
కథల సంపుటి
రెప్పవెనుక స్వప్నం
ఎర్రగుంట సుజాత ప్రసాద్

# కవయిత్రికి అభినందన



గవర్నర్ తమిళసైకి పుస్తకం అందిస్తున్న కవయిత్రి సుజాత

దుబ్బాకటౌన్: తన కవితలతో సమాజాన్ని చైతన్య పరుస్తున్న దుబ్బాక మున్సిపల్ పరిధిలోని కవయిత్రి ఎర్రగుంట సుజాతప్రసాద్‌ను గవర్నర్ తమిళిసై ప్రత్యేకంగా అభినందించారు. గవర్నర్ నివాసంలో ఆమెను కలిసి తాను రచించిన గుప్పెడు గుండెను తడితే కవితల సంపుటి పుస్తకాన్ని సుజాత అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై కవయిత్రి సుజాతను ప్రత్యేకంగా అభినందించి, మంచి కవితలతో రాణించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

# 'గుప్పెడు గుండెను తడితే' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

దుబ్బాకటౌన్: తన కవిత్వంతో సమాజాన్ని మేల్కొల్పుతూ.. మనిషిని మనిషిగా గుర్తించే ఆదర్శ సమాజం కోసం కవయిత్రి ఎర్రగుంట సుజాతప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన సుజాత రచించిన 'గుప్పెడు గుండెను తడితే' కవిత సంపుటిని మంగళవారం హైదరాబాద్‌లో కవిత చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే తాను రచించిన రెండో పుస్తకంపై కవయిత్రి సుజాత ఎమ్మెల్సీ కవితతో సుదీర్ఘంగా చర్చించారు. కవిత మాట్లాడుతూ కవయిత్రి సుజాత రచించిన కవితలు సమాజాన్ని తట్టి లేపేవిధంగా చాల ఆలోచనలు రేకెత్తించే విధంగా గొప్పగా ఉన్నాయన్నారు.



ఎర్రగుంట సుజాత ప్రసాద్, కవయిత్రి, లచ్చపేట

సేకరణ : దుబ్బాక మున్సిపాలిటీ

స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల సందర్భంగా లచ్చపేటకు చెందిన కవయిత్రి రాసిన కవిత ఇది... ఈమె ఇటీవల వచ్చిన తెలంగాణ ఆవిర్భావంలో 'నా తెలంగాణ ప్రగతి ప్రస్థానం' కార్యక్రమంలో విజేతగా నిలిచి బహుమతిని పొందారు.

స్వతంత్ర్య భారత జననికి - వసంతాల హారతి
స్వతంత్ర్య భారత జననికి - వజ్రాల హారతి
మూడు రంగుల మువ్వన్నెల జెండాకు - ముత్యాల హారతి
ప్రపంచ దేశాల శాంతి ప్రతీకకు - పగడాల హారతి
జాతి రత్నాలను కన్న రత్నగర్భకి - రత్నాల హారతి
వీర తిరోగాములను కన్న వీరమాతకి - పచ్చల హారతి
విద్యను అమూల్య నిధిగా ప్రేమజ్యోతికి - సూర్య హారతి
మానవతావిల్ల మహిత మూర్తికి - మణిదీప హారతి
రాణిస్తు లోకాన కావ్యాల కీర్తికి - కర్పూర హారతి
సంస్కృతిని వారసిలో శాంతి దీపానికి - పద్మ కర్పూర హారతి
మానవత్వాన్ని చాటుతున్న మహోన్నతమూర్తికి - మంజుల హారతి
స్వాతంత్ర్య సమరయోధులున్న సౌభాగ్యమునకి - చంద్రహారతి
విమ సమరం స్ఫూర్తిని నవంబ తిగించిన
నారీశిరోమణికి - సువర్ణ హారతి
సర్వధర్మ సమభావన సమ్మేళితకు - సర్వమంగళ హారతి
మహిలోనే మహిమాన్వితమైనం నా పవిత్రభారతికి - పచ్చల హారతి
మహాత్ముల మహిత్వంలో జ్యోతోత్సవ వెలిగించిన
విజ్ఞాన జ్యోతికి - వెండిల హారతి
ప్రపంచ గగనంలో ధ్రువతారకి - ధవళ హారతి
సకల కళానిలయ విశ్వగురువుకి - కుంకుమ హారతి
ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన జన్మకేతనం
వసంతాల నా భారతికి - వసంతాల హారతి
వజ్రోత్సవ వైభవ భారత ఖ్యాతికి - వందనాల హారతి
స్వతంత్ర్య భారత జననికి - కర్పూర మంగళ హారతి

# రెప్ప వెనుక స్వప్నం

కథలు

ఎర్రగుంట సుజాత ప్రసాద్

విరించి ప్రచురణలు

హైదరాబాద్

**Reppa Venuka Swapnam**

(A collection of Stories)

**Smt. Y. Sujatha Prasad**
**(Pen Name : Virinchi)**
Cell : 9963169653
E-mail : sujathaprasadlpt@gmail.com

© Author

*First Edition :*
Oct, 2023

*Copies : 1000*

*Book Design :*
Sri Vaishnavi Graphics
Cell : 9394592727

*For Copies :*
Y. Sujatha Prasad
H.No.6-17
Vil : Lachapet - 502 108
Dist. Siddipet
Telangana State

All leading book stores

*Price*
Rs : 120/-

*Printed at :*
Hyderabad.

ఓం శ్రీ గురుభ్యో:నమః

ఓం శ్రీ మాత్రే నమః







**శ్రీ విఘ్నేశ్వరాయ నమః** **శ్రీ మహాలక్ష్మీ దేవ్యాయ నమః** **శ్రీ సరస్వత్యాయ నమః**

## శ్రీ విఘ్నేశ్వర ప్రార్థన

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే ॥
అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేక దంతం భక్తానాం ఏకదంతముపాస్మహే ॥

## శ్రీ మహాలక్ష్మీ ప్రార్థన

శ్లో॥ లక్ష్మీం క్షీరసముద్ర రాజతనయాం శ్రీరంగ ధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం ।
శ్రీ మన్మంద కటాక్ష లబ్ధ విభవత్ బ్రహ్మేంద్ర గంగాధరామ్
త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం ॥

## శ్రీ సరస్వతీ ప్రార్థన

శ్లో॥ అంబ దవాంబుజోజ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫుట భూషరత్న దీపికా
చుంబిత దిగ్విభాగ శృతిసూక్తి వివిక్త నిజ ప్రభావ భా
వాంబర వీధి విశ్రాంత విహారిణి – నన్ గృపఁజూడు భారతీ ॥

***"సర్వేజనా సుఖినోభవంతు – సన్మంగళానిభవంతు"***



# అంకితం



**డా॥ కీ.శే. క్యాతం మల్లయ్య - లక్ష్మీదేవి**

**శ్లో॥ సర్వతీర్థమయీ మాతా సర్వదేవమయః పితా**
**మాతరం పితరం తస్మాత్ సర్వయత్నేన పూజ్యేత్**

అమ్మ సర్వ పుణ్యతీర్థాలకూ ప్రతీక.
నాన్న సకల దేవతల అవతార రూపం.
కనుక నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను
ప్రాణప్రదంగా పూజించుకుంటూ
నా ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

*- ఎర్రగుంట సుజాత ప్రసాద్*

# నా సాహిత్య ప్రోత్సాహికులు



**శ్రీ. కొత్త ప్రభాకర్ రెడ్డి (పార్లమెంటు సభ్యులు), శ్రీమతి. మంజులత**

*అలుపెరుగని అలల సవ్వడిలో సెలయేటి నురగ మా మంజులత గారైతే...*
*చెలియలికట్ట దాటని ఉత్తుంగ సముద్ర కెరటం మా ప్రభాకరన్నయ్య.*
*తొలి ఉషస్సులో కురిసే హేమంతపు మంచుదుప్పటి మా మంజులత గారైతే...*
*నీరెండలో చిగురాకుల కొసలపై తేలియాడే హిమబిందువు మా ప్రభాకరన్నయ్య.*
*అల్లంత దూరాన ఉప్పొంగి పారే జలపాతం మా మంజులత గారైతే...*
*కొండకోనల మీద తిరుగాడే పిల్లతెమ్మెర మా ప్రభాకరన్నయ్య.*
*అందాల ప్రకృతిలో అలరారే అడవితల్లి మా మంజులత గారైతే...*
*తొలిపొద్దుకు అప్పుడే విచ్చుకుని పరిమళిస్తున్న మంచిగంధపుష్పం మా ప్రభాకరన్నయ్య.*
*వెన్నెలలు వెదజల్లుతూ పున్నమై ప్రకాశిస్తున్నది మా మంజులత గారైతే...*
*జాబిల్లి రేయిలో మంజులతగారి సిగలో చేరే వెన్నెల పుష్పం మా ప్రభాకరన్నయ్య*
*గుప్పెడంత గుండెలో ప్రేమానురాగలను భద్రంగా దాచుకునేది మా మంజుల గారైతే...*
*కష్టాల అడుగులను అలుపెరుగని అలలతో చెరిపే ప్రేమతీరం మా ప్రభాకరన్నయ్య.*
*తొలిపొద్దుపై బ్రతుకుపాఠాలు నేర్పే బంగారు కిరణం మా మంజులత గారైతే...*
*గతాన్ని పాఠంగా మలచి భవిష్యత్తుకు దారి చూపే పుస్తక భాండాగారం మా ప్రభాకరన్నయ్య.*
*ఎలాగైతేనేం నిష్కల్మష, నిర్మలమైన జీవితమనే ప్రకృతిలో అల్లుకుని సాగిపోయే పూలతీగలు*
*మా* ***మంజులత, ప్రభాకరన్నయ్యలు...*** **– ఎర్రగుంట సుజాత ప్రసాద్**

**B. VENKATESHAM,**
I.A.S.,
Principal Secretary to
Government

**BACKWARD CLASSES WELFARE**
GOVERNMENT OF TELANGANA
3rd Flor, D-Block, B.R.K.R. Bhavan,
Teanagana Secretareat,
Hyderabad - 500020
Off : 040-23453638, Fax : 23452025
E-mail : prlsecy_bcw@telangana.gov.in

# అభినందన

భారతీయ కథా సాహిత్యంలో తెలుగు కథ ఇప్పటికీ చక్కటి స్థానంలోనే ఉంది. నాడు గురజాడ, చలం, కొడవటిగంటి కుటుంబరావు, చాసో వంటి కొద్దిమంది రచయితలు కథలు రాసేవారు. నేడు ఎంతో మంది రచయితలు చక్కటి కథలు రాస్తున్నారు. ఐతే, గురజాడ నాటి సమాజం వేరు. నూరేళ్ళ తరవాత ఇవాళ్ల సమాజం వేరు. కథల్లో వస్తువు మారింది. ఇప్పుడు ఏదీ నేరుగా కనపడదు. ఇప్పటి రచయిత కనపడని శతృవుతో యుద్ధం చేయాలి. ఒకప్పటి కన్నా ఇవ్వాళ కథ రాయటం కష్టం. అంతటి కష్ట సాధ్యమైన పనిని సుజాత ప్రసాద్ గారు సమర్థవంతంగా నిర్వర్తించారు.

కనులు తెరిచిన క్షణం నుంచి, బంధం కోసం ... బాధ్యత కోసం... కుటుంబం కోసం... అందర్నీ కనుపాపలా తలచి, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి, తన ఇంటిని నందనవనం చేసే స్త్రీ మూర్తికి గల గౌరవాన్ని సుజాత ప్రసాద్ గారు తన కథల ద్వారా మరింత ఇనుమడింపజేశారు.

'రెప్ప వెనుక స్వప్నం' అనే ఈ కథల సంపుటిలోని ప్రతీ కథా ప్రత్యేకమైనదే, ప్రశంసనీయమైనదే... 'జననీ జన్మభూమిశ్చ' అనే కథలో శాంతమ్మకు మాతృభూమి పట్ల గల అవ్యాజమైన ప్రేమను ..., 'మరో అమ్మ' అనే కథలో అత్తను అమ్మలా చూసుకోవాలి అనే ఆదర్శాన్ని... హృదయానికి హత్తుకునేలా చెబుతూనే.. 'దేవుడు ఇచ్చిన బిడ్డ' అనే కథలో 'రాజారావు' అనే భర్త పాత్ర ద్వారా పురుషుల పట్ల గౌరవభావము కలిగేలా పాత్రను తీర్చిదిద్దడం విశేషంగా పేర్కొనవచ్చును. 'తెలుగు తల్లి ఒడిలో' అనే కథలో 'సంస్కృతి' మరియు 'సాహితి' అని పాత్రల పేర్లు

ఎంచుకోవడంలోనే కథాసారం ద్యోతకమవుతుంది. 'దేవుడు ఇచ్చిన బిడ్డ' అనే కథకు ఆర్ద్రమైన ముగింపును, 'మసిపూసిన పసిమనసు' అనే కథకు అనువైన ముగింపును, 'తిరగని పొద్దు' అనే కథకు ఘాటైన ముగింపును ఇచ్చి, ప్రతీ కథలోనూ ప్రత్యేకతను ప్రదర్శించారు సుజాత ప్రసాద్ గారు.

అన్ని కథలలో సంభాషణలు చిన్నగా మరియు శక్తివంతంగా ఉన్నాయి. అలాగే, కథ చదివిన పాఠకుడికి, తనకు తెలియని విషయం ఏదో తెలిసింది అని, లేదా తెలిసిన విషయమే అయినా ఏదో కొత్త కోణం ఆవిష్కృతం అయింది అనీ, తన అనుభవంలోకి రాని విషయం కథ చదివాక, అది తన అనుభవంలోకి వచ్చినట్లుగాను అనిపించాయి.


చక్కటి శైలి, అనువైన శిల్పం సుజాత ప్రసాద్ గారి ప్రత్యేకతలుగా చెప్పవచ్చును. స్పష్టంగా సరళంగా, సంక్షిప్తంగా ఉన్న వాక్యరచన పాఠకుడిని ఆసాంతం చదివిస్తాయి. దాదాపు అన్ని కథలలో, పాఠకుడు కథతోపాటు ప్రయాణించేట్లుగా కథనం ఉంది. కథ చదవడం పూర్తయ్యాక పాఠకుడికి చక్కటి అనుభూతి కలిగేలా, ప్రతీ కథనూ పాఠకుడు ఆస్వాదించేలా సుజాత ప్రసాద్ గారు తీర్చిదిద్దారు.

సుజాత ప్రసాద్ గారి కలం నుండి జాలువారిన 'రెప్ప వెనుక స్వప్నం' అనే కథల సంపుటి చదివాక, ప్రతీ పాఠకుడి హృదయంలో... 'అమ్మను పూజించు... భార్యను ప్రేమించు... సోదరిని దీవించు... ముఖ్యంగా మహిళలను గౌరవించు' అనే భావన వెల్లివిరుస్తుందని నా భావన.

సుజాత ప్రసాద్ గారి 'రెప్ప వెనుక స్వప్నం' అనే కథల సంపుటి విశేషమైన పాఠక ఆదరణ పొందాలని ఆశిస్తూ... వారి కలం నుండి మరిన్ని కథా సంపుటాలు జాలువారాలని ఆకాంక్షిస్తూ......



**– బుర్రా. వెంకటేశం,** ఐ.ఏ.ఎస్.,



**డా॥ ఏనుగు నరసింహారెడ్డి,**
అదనపు కలెక్టర్,
మేడ్చల్–మల్కాజిగిరి (జిల్లా)

# కథనంతోనే కథను సృష్టించగలిగే నేర్పు

కథ అత్యంత పురాతనమైందే కానీ ఆధునిక కథ అత్యంత నవీనమైనది. ఇంగ్లీషు మనకిచ్చిన బహుమానాల్లో ఫ్రీవర్స్, నవలతోపాటు కథ కూడా ఉంది. కథ జీవితంలోని ఒక శకలాన్నే చెబుతుంది కానీ దానికదే సమగ్రంగా ఉంటుంది. కథకు ఎన్ని అంచులున్నా, ఎంత లోతు ఉన్నా, ఎంత గాఢత ఉన్నా ఒక మోస్తరు నిడివి ఉండడం, ఒక ప్రయత్నంలో చదివేయగలగడం దాన్ని చిరంజీవిని చేసింది. ప్రపంచ సాహిత్యంలో వంద పేజీల కథనాలు ఉన్నాయి. రెండు పేజీలవీ ఉన్నాయి. ఠాగూర్, ప్రేమ్‌చంద్ కథలు రెండు డజన్ల పుటల నిడివి వరకూ నడిచాయి. తెలుగులోనూ పాలగుమ్మి పద్మరాజు– 'గాలివాన', అల్లం రాజయ్య– 'ప్రత్యర్థులు' లాంటి సుదీర్ఘ కథలున్నాయి. అయితే వర్తమాన యుగపు స్పీడ్‌లో పది పేజీలకు మించని కథ ఎక్కువమంది పాఠకులకు చేరుతుంది. చిన్న నిడివి కథలు పాఠకులకు మెసేజ్ ఇస్తాయా అన్న ప్రశ్న కూడా పూర్వపక్షం చేయబడింది. ఇటీవలి కాలంలో ఐదు పేజీలకు మించని ఓల్గా కథల్లో స్త్రీవాదం బలంగా వినిపిస్తుంది.

విప్లవ, అభ్యుదయ, స్త్రీ, అస్తిత్వ వాదాలతోపాటు గొప్ప మానవతా చర్చ పెట్టిన కథలకు తెలుగులో గొప్ప పాఠకాదారణ దొరికింది. కవిత్వంతో పోల్చినప్పుడు కథల్లో స్త్రీల సంఖ్య ఎక్కువ. జీవితంలోని సునిశిత పార్శ్వాల పరిశీలన స్త్రీలకు సాధ్యమైనంతగా పురుషులకు కాదు. మాదిరెడ్డి సులోచన, ముదిగంటి

సుజాతారెడ్డిలాంటి లబ్ధప్రతిష్టులతోపాటు తాయమ్మ కరుణ, జ్వలిత లాంటి వర్తమాన రచయిత్రుల్లో ఈ అంశం గమనించవచ్చు. ఈ వరుసలో మరింత భిన్నమైన రచయిత్రి ఎర్రగుంట సుజాత ప్రసాద్. కవయిత్రిగా పత్రికల్లో కనిపించినా కథలు పోటీలకు పంపడానికి, రేడియోలో చదవడానికి మాత్రమే లక్ష్యం పెట్టుకొని రాసారు. అందువల్ల ఈ కథల్లో అలవోకగా నిడివి స్థిరపడిపోయింది. అది పది పేజీలలోపు, ఐదు పేజీలపైన. ఇది సాధారణంగా కనిపించినా ఒక గొప్ప అసాధారణాంశం– గుండెల్ని పిండేసే ఆర్ద్రత ఈమె ప్రతి కథలో పాఠకుల హృదయాలను మెలిపెడుతుంది. కథలన్నీ స్త్రీల సున్నితత్వం చుట్టూ తిరుగుతాయి. చదివిన ప్రతికథా పాఠకులను ఆందోళన పరుస్తుంది.

ఏ కథలోనూ రెండు మూడు పాత్రలకు మించి లేకుండా కథను నడుపుతారు రచయిత్రి. అందువల్ల పాఠకుడు చాలా సులభంగా వాక్యాలవెంట పరుగెడతాడు. గొప్ప ఎత్తుగడతో సన్నివేశాన్ని రూపకల్పన చేసినట్లనిపించదు మొదట. కానీ ముగింపుదాకా చదివాక పాఠకుడు చకితుడయే శిల్పంతో కథను నడిపిస్తుంది రచయిత్రి. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' కథలో శాంతమ్మ శాశ్వతంగా విదేశానికి తీసుకెళ్ళాలనుకుంటాడు ఆమె కొడుకు. మానసికంగా తన స్వస్థలాన్ని వదలలేని స్థితి శాంతమ్మది. తప్పదన్నట్లు తయారై ఇరుగుపొరుగులో వీడ్కోలు తీసుకుంటుంది. ఏర్‌పోర్ట్‌లో బంధువుల వీడ్కోలు తీసుకొని ఫ్లైట్ ఎక్కాక శాంతమ్మకు గుండెపోటు వస్తుంది. ఫ్లైట్ దించి బంధువులంతా గుమిగూడి చూస్తుండగా ఆమె చనిపోతుంది. ఇంతచిన్న విషయాన్ని అపూర్వమైన కథగా మలిచి కరుణ ఉట్టిపడేలా రాసారు రచయిత్రి. 'తిరగని పొద్దు', 'చదువులలో మర్మమెల్లనే చదివితి' తదితర కథల్లో కూడా ఇంతే చిన్న సందర్భాలను అద్భుతమైన కథగా మలిచారు. కథనంతోనే కథను సృష్టించగలిగే అరుదైన నేర్పు ఈ సుజాత గారిది.

స్త్రీల జీవితంలోని అనేకమైన డైమెన్షన్స్ ఈ కథల్లో ఎదురొస్తాయి. ఈ కోణంలో చర్చించదగిన గొప్ప కథ 'మాతృత్వపు మమకారం'. వాగ్వాణి ప్రేమించిన, పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న వ్యక్తిని కారణాంతరాలవల్ల ఒక చిన్న పాప ఉంటుంది. అతన్ని పెళ్ళి చేసుకుంటే ఆ తల్లికి మారుతల్లిగా వెళ్ళినట్లవుతుంది వాగ్వాణి. సహజంగానే ఆమె తల్లిదండ్రులు ప్రతిపాదనను వ్యతిరేకిస్తారు. అయితే ఇక్కడ

పాఠకులు ఊహించే కారణాలు వేరు. ఆమె తల్లిదండ్రులకున్న కారణాలు వేరు. వాగ్వాణి తల్లి కూడా ఆమెకు పెంపుడు తల్లే. ఆ విషయం కూతురు పెళ్ళి చర్చ వచ్చేదాకా తెలియనీయని మాతృత్వ ప్రేమ ఆమె తల్లిది. ఈ కోణంతోనే పాఠకుడు కలవరపడతాడు. ఆ తర్వాత కథను నడిపిస్తూ చెప్పిన విషయాలన్నీ మానవ స్వభావంలోని డొల్లతనాన్ని ఎండగడుతూ ఉంటాయి. వాగ్వాణి బంధువులకు ఒంటరిగా దొరికినప్పుడల్లా 'అమ్మ నీకు మొదట అన్నం పెడుతుందా, మీ తమ్ముడికా' అని అడిగేవారట. 'అమ్మ తనకు మంచి డ్రెస్ వేసిందా, తమ్ముడికా' అని ఆరా తీసేవారట. 'అల్లరి చేస్తే ఎవరిని ఎక్కువగా తిడుతుంది' అని ప్రశ్నించేవారట. 'అన్నీ నాకు ముందుగా చేస్తే సవతి కూతుర్ని ఎక్కడ సరిగా చూడడం లేదంటారోనని అందరిముందు షో ఇస్తుందని విమర్శలు వచ్చేవి. పోనీ తమ్ముడి పనులు ముందు చేస్తే ఎంతయినా కన్నకొడుకు కన్నకొడుకే, పరాయి పరాయే అని దీర్ఘాలు తీసేవారు' అని చెప్పుకుంటుంది వాగ్వాణి. అలాంటి స్థితి తనకూ ఎదురవుతుందని తను మారుతల్లిగా పోయే సంబంధం వద్దని తల్లి వారిస్తుందని అర్థం చేసుకుంటుంది. ఎంతో ఆదర్శంగా పెంచిన తన తల్లిలాగే తానూ తన మారుకూతురును చూసుకుంటానని తల్లిని ఒప్పించడంలో కథ ముగుస్తుంది. కొత్తవస్తువు, ఆర్ద్రమైన స్త్రీల మనోగతాన్ని ఆవిష్కరించే శైలి ఈ కథలో అపురూపంగా ఒదిగాయి. 'దేవుడిచ్చిన బిడ్డ', 'వినూత్న' కథలు కూడా ఇంతే అపురూపంగా స్త్రీల మనసును చిత్రిస్తాయి.


ఈ సంపుటిలోని 10 కథల్లో మానవత్వాన్ని మేల్కొలుపగలిగే దయార్ద్ర సన్నివేశాలను అడుగడుగునా చిత్రించారు రచయిత్రి. 'మరోఅమ్మ' కథలో దీని పరాకాష్ఠను చూడవచ్చు. అండాళమ్మకు ఒక కూతురు, ఒక కొడుకు. భర్త పోయాక కొడుకు తనను చెన్నై తీసుకుపోతానంటూ పదేపదే ఫోన్ చేస్తుండడంతో ఒకసారి కూతురింటికి వెళ్ళొద్దామని హైద్రాబాద్ వెళ్తుంది. భర్తను కోల్పోయిన అత్తను తన కూతురు పనిమనిషిలా చూడడంతో ఆండాళమ్మ షాక్‌కి గురై అడుగుతుంది. దానికి కూతురిచ్చిన జవాబు ఆమెను హతాశురాల్ని చేస్తుంది. 'ఇక్కడ నేనేదో ఓపిగ్గా ఉండి అందరికీ చాకిరీ చేసేలా కనిపిస్తున్నానేమో. అందుకే నాకు ఒళ్ళు మండి కావాలనే పనిమనిషిని మాన్పించాను' అంటుంది కూతురు. అత్తను 'తప్పనిసరి తద్దినం మాకేగా' అంటుంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులంటే పిల్లల దృష్టికోణం ఎలా ఉంటుందో ఈ

కథ కళ్ళకు కడుతుంది. కథను ఇక్కడితో కూడా ఆపేయవచ్చు. కాని సుజాతగారు తల్లితో కూతురుకు ఒక కరుణ రసార్ద్రమైన లేఖ రాయించి పాఠకులకు కళ్ళనీళ్ళు పెట్టించారు. ఇదే ఈ రచయిత్రి ముద్ర.

మగ చూపులను ఎండగట్టే తీవ్రత, సంప్రదాయంలోని మూఢత్వంపై పేచీ, సామాజిక అపసవ్యతల పట్ల క్రోధం కూడా కనిపిస్తుంది ఈ కథల్లో కానీ ఎక్కడా శృతిమించదు. మానవ హృదయాలలో ఉండాల్సిన దయ, జాలి, కరుణ మిస్సవడం ఈ రచయిత్రిని కలవరపరిచిన అంశాలు. అన్ని కథల్లోనూ వ్యక్తుల అంతఃశుద్ధి మీదనే ప్రధాన చర్చ ఉంటుంది. ఈ కథల్లో విలన్లు ఉండరు. సగటు మనిషిలోని విలనత్వం మాత్రమే ఉంటుంది. మరో అమ్మలో 'కూతురు', 'చదువులలో మర్మమెల్ల నే చదివితి'లో బహిరంతరాలు వేరైన మనుషులు ఇందుకు ప్రతీకలు. సుజాత గారి కథల్లో కొల్లలుగా కారుణ్యమూర్తులే ఉంటారు. 'మరో అమ్మ'లో తల్లి ఆమె వియ్యంకురాలు, 'మాతృత్వపు మమకారం'లో తల్లీ కూతుళ్ళు, 'పరోపకా ర మిదం శరీరం'లో ఆదిలక్ష్మమ్మ, 'అమ్మ మనసు'లో అమ్మ, 'దేవుడిచ్చిన బిడ్డ'లో లక్ష్మి, 'చదువులలో మర్మమెల్ల నే చదివితి'లో వృద్ధురాలు సుజాతగారు సృష్టించిన కారుణ్యమూర్తులు.

తొలి కథాసంపుటి పాఠకుల హృదయాల మీద చెరగని ముద్ర వేయగలిగిన గొప్ప కథలు రాసారు ఎర్రగుంట సుజాత ప్రసాద్. స్త్రీ కేంద్రిత, మానవత్వ స్పర్శ, కారుణ్య దృష్టిగల ఇలాంటి కథలు సుజాతగారు నిరంతరం రాస్తూనే ఉండాలి. నిరంతరం పత్రికల్లో కథకురాలిగా స్థిరపడిపోవాలి.

**– డా॥ ఏనుగు నరసింహారెడ్డి**



**డా॥ సుద్దాల అశోక్ తేజ**
ప్రముఖ కవి,
ఉత్తమ జాతీయ సినీ గేయరచయిత

# అభినందన

శ్రీమతి సుజాతా ప్రసాద్ చక్కని కవయిత్రి – కథారచయిత్రి. పాఠకులకు కవితాభిమానులకు ఆమె శైలి – శిల్పం బాగా తెలిసిందే.

'గుప్పెడు గుండెను తడితె..' చిప్పిల్లిన కవితా మకరందాలు కొంచెం కొంచెం నేనూ ఆస్వాదించినవాణ్ణి.

'నేనొక కొంత గుట్టని...' అన్న కవితలో 'ఉలి దెబ్బలన్ని భరించి రాళ్ళను శిల్పాలుగా మార్చాను' అన్న తన కవితలో సరికొత్త ఆవిష్కరణను ఇష్టపడ్డవాణ్ణి. ఇప్పుడు 'రెప్ప వెనుక స్వప్నం' కథా సంపుటి తెస్తుంది.

'రాత్రి బడిలో ఆకాశం భూమి పలకమీద చినుకు కలంతో అక్షరాలు దిద్దుతుంటె ధరణి తల్లి పులకించి పోతున్నవేళ' అంటూ 'తెలుగు తల్లి ఒడిలో' కథ ఎత్తుగడలోని కవితాత్మకతకు కవిని కనుక ఎంతో రసానుభూతికి లోనయ్యాను.

ప్రతి కథలో సన్నివేశాలతోపాటు వాటిని ప్రవేశపెట్టే వాక్యాలలో కవిత సరళి లేకుండా ఉండనీయని ఆమె ధోరణికి ఎంతో ఆనందంగా అనుభూతి చెందాను.

సాహితీలోకంలో కవయిత్రిగా కథారచయిత్రిగా లబ్ధప్రతిష్టురాలుగా విస్తరించాలని కోరుకుంటూ...

అభినందన.

**– సుద్దాల అశోక్ తేజ**



**ఓల్గా (ప్రముఖ స్త్రీవాద సాహిత్య రచయిత్రి)**

# రెప్ప విప్పి చూడాల్సిన నిజాలు !

సుజాతా ప్రసాద్ గారి కథలు చాలా సున్నితంగా, అందంగా, పొందికగా ఉన్నాయి. కథావస్తువులుగా కుటుంబ సంబంధాలను ఎంచుకుని వాటిలో రావాల్సిన మార్పులను సూచించారు. ఆ మార్పులను తను జీవితల్లోకి తెచ్చుకున్న పాత్రలు సంతోషప్రదమైన జీవితాలను గడిపినట్లుగా చిత్రించారు. మార్పు గురించిన కథలు రాసేవారెవరైనా సమాజహితం కోరేవారే తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య ఉండే సంబంధాలు ప్రస్తుత కాలంలో సమాజంలో చాలా వేగంగా మారిపోతున్నాయి. తల్లిదండ్రులు, పిల్లల మధ్య దూరం పెరిగిపోతున్నది. ఒకరినొకరు అర్థం చేసుకోవటం, కనీసపు సంభాషణలు చేసుకోవటవం కూడా తగ్గిపోతున్నది. ఉద్యోగాలు, వలస కారణంగా భౌతికదూరంతోపాటు మానసిక దూరం, సాంస్కృతికమైన ఎడం కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. ఆ ఎడాన్ని, దూరాన్నీ తగ్గించటానికి సాహిత్యం ప్రయత్నించాలి. సుజాత ప్రసాద్ గారు తన కథలతో ఆ ప్రయత్నం చేశారు. అందుకు ఆమెకు అభినందనలు.

కేవలం కుటుంబ సంబంధాలే కాక సమాజం కోసం ఆలోచించి నలుగురికి ఉపకారం చేసిన ఆదిలక్ష్మమ్మ వంటి స్త్రీల గురించిన కథలు కూడా ఆర్భాటం లేకుండా సింపుల్‌గా రాశారు. కుటుంబానికే స్త్రీలు పరిమితం కావటం కంటే తను నివపించే ప్రాంతపు ప్రజలకు తాను చేయగలిగిన మేలు చేయటం మంచిదనే 'పరోపకారార్థ మిదం శరీరం' కథ సందేశాత్మకమైనది. అలా సహాయం చేసే క్రమంలో ఎవరు

ఏమనుకున్నా ఆగిపోకూడదనీ, ఆ మానసిక ధైర్యసాహసాలు స్త్రీలకు అవసరమనీ సుజాత ప్రసాద్ చెప్పారు. అలాగే స్త్రీల జ్ఞానానికి గుర్తింపు, గౌరవం ఉండని ఈ పురుషాధిక్య సమాజపు తీరుని మరొక కథలో చాలా సింపుల్‌గా చెప్పారు. తనకు తెలిసిన సంగీత, సాహిత్య, సామాజిక విషయాలను నలుగురితో పంచుకోబోయే సామాన్య స్త్రీని, కుటుంబ విషయాలకూ, చీరెలకూ, నగలకూ, పెళ్ళిళ్ళకు, పేరంటాలకూ పరిమితమైన మహిళామణులు ఎలా హేళనగా, అగౌరవంగా చూస్తారో తెలుపుతుంది ఆ కథ. భిన్నంగా, తెలివిగా, తెలిసిన విషయాలను నలుగురికీ చెప్పే మగవారు మేధావులవుతారు. అలాంటి స్త్రీలు మాత్రం చిన్నచూపుకూ, తిరస్కారానికీ గురవుతారనే పెద్దవిషయాన్ని చిన్నకథలో చక్కగా రాశారు సుజాతా ప్రసాద్.

మాతృత్వానికి గురించిన అతి ఊహలు, అపోహలు కూడా రచయిత్రి కథలుగా మలుచుకున్నారు. 'దేవుడిచ్చిన బిడ్డ', 'అమ్మ మనసు' వంటి కథలు చాలా సున్నితంగా రాశారు. ఈ రచయిత్రి భాష కూడా చాలా అందమైన భాష. చెబుతున్న భావాలకు సరిగా సరిపోయే పదాలను ఎంచుకుని, వాక్యాలను కూర్చుకోవటంలో ఒక నిదానం, స్థిమితత్త్వం కనిపిస్తాయి. కథలలోని వస్తువు ఎవరూ రాయనంత కొత్తది కాకపోయినా చెప్పే తీరులోని స్థిమితత్త్వం వల్ల, కృషి వల్లా కథలలో ఒక ప్రశాంతమైన వాతావరణ కల్పన జరిగింది. చక్కని చిత్రణకు అవకాశం దొరికింది. ఇకముందు మరిన్ని వైవిధ్యభరితమైన కథలు ఎంచుకుని ఈ తీరులో రాస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కొత్తగా ఆలోచించటం, కొత్త విషయాలపై దృష్టి పెట్టటం రచయితలకు అవసరం. అదే రచయితలకు మంచి గుర్తింపుని ఇస్తుంది. రాయబోయే కథలలో సుజాతా ప్రసాద్‌గారు ఆ ప్రయత్నాన్ని మరింతగా చేస్తారని ఆశిస్తాను.

ఇది సుజాతా ప్రసాద్ గారికి తొలి కథల సంపుటి అనుకుంటాను. 'రెప్ప వెనుక స్వప్నం' రచయిత్రి కలగన్నారు. ఆ కల నిజమవ్వాలనీ, ఆమె రాసిన కథలలో పాత్రలకు కలిగిన వివేకం, శాంతి పాఠకులకు కలగాలనీ ఆమె ఒక రచయిత్రిగా కోరుకుంటున్నారు. ఆ కోరిక నెరవేరాలని కోరుకుంటూ, మరిన్ని కథలు రాయగలరని ఆశిస్తూ, ఈ సంకలనానికి అభినందిస్తూ...

**– ఓల్గా**



కాత్యాయని విద్మహే (కిట్స్
తెలుగు ప్రొఫెసర్,ప్రముఖ
స్త్రీవాద సాహిత్య రచయిత్రి)

# స్త్రీల జీవిత పరిశీలనలు సుజాత కథలు

ఎర్రగుంట సుజాతా ప్రసాద్ వివిధ ప్రాంతాలలో జరిగే కవి సమ్మేళనాలలో పాల్గొంటూ కవి ప్రపంచంతో సంబంధాలు పెంచుకొంటూ వస్తున్న వర్ధమాన రచయిత్రి. 'విరించి' కలం పేరుగా పెట్టుకొన్నది. క్రిందటి సంవత్సరం 'గుప్పెడు గుండెను తడితే' అనేకవితా సంపుటి ప్రచురించి ఈ సంవత్సరం కథా సంపుటి ప్రచురణకు పూనుకొన్నది. పరిచయ తోరణం ఒకటి ముందు ద్వారానికి కట్టమని అడిగింది. మహిళలు చేసే సృజన విమర్శల పట్ల ఆసక్తితో అంగీకరించాను.

2008 నాటినుండి2020 వరకు పన్నెండు ఏళ్లకాలం మీద వ్రాసిన పదకొండు కథల సంపుటి ఇది. కథలు ఎక్కువ భాగం ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో) వరంగల్, హైదరాబాద్ కేంద్రాల నుండి ప్రసారం అయినవి.

ఈ కథలు అన్నీ స్త్రీ జీవిత పరిశీలన నుండి వచ్చినవే. వీటిలో మాతృత్వం ప్రధాన సమస్యగా వచ్చిన కథలు కొన్నయితే, భర్త మరణాంతరం భార్య జీవిత పరిణామాలు వస్తువుగా వచ్చిన కథలు మరికొన్ని. 'దేవుడిచ్చిన బిడ్డ', 'మాతృత్వపు మమకారం', 'అమ్మ మనసు' ఈ మూడు కథలలో మాతృత్వ సమస్య భిన్న కోణాలనుండి వస్తువు అయింది. గర్భధారణ, ప్రసవం, శిశువుకు క్షీరమిచ్చి పెంచటం స్త్రీ శరీరానికి, మనసుకు సంబంధించిన అనుభవం. పురుషుల విషయంలో తండ్రి కావటం అహం తృప్తికి, వంశ వారసత్వ కొనసాగింపుకు సంబంధించిన సామాజిక

అంశం. తల్లి కాలేక పోయిన స్త్రీని గొడ్రాలు అని అవమానించటమైనా, తల్లి కాలేకపోయిన కారణంగా ఆమెను వదిలేసి మగవాడు మరొక పెళ్లి చేసుకొనటమైనా ఆ సామాజిక నీతి నియంత్రణ వల్లనే. ఈ నీతి వలన బాధితులవుతున్న స్త్రీల కోణం నుండి ఇదివరలో అనేక కథలు వచ్చాయి. 'దేవుడిచ్చిన బిడ్డ' కథ వీటికంటే కాస్త భిన్నమైనది. ఇందులో తల్లి కాలేకపోయిన స్త్రీ తోటి స్త్రీల సూటీపోటీ మాటలకు, సామాజికమైన చిన్నచూపుకు గురవుతూ ఎంత బాధపడుతుంటుందో అంతగానూ అందుకు కారణమైన భర్తలోని లోపాన్ని గురించి కూడా బాధ పడుతుంటుంది. అది అతనిపట్ల అసహనంగా వ్యక్తం అవుతుంటుంది. ఆ భర్త కూడా భార్య బాధను అర్థంచేసుకోగల సంస్కారవంతుడే. అందుకనే ఆర్టిఫిషల్ ఇన్సేమినేషన్ నుండి విడాకులు తీసుకొని మళ్ళీ పెళ్లి చేసుకొనటం వరకు తల్లి కావటానికి ఆమెకు ఉన్న అవకాశాలు చెప్పాడు. ఈ సందర్భం నుండి పిల్లలు పుట్టటం, పుట్టకపోవటంతో నిమిత్తం లేకుండా భార్యాభర్తల మధ్య పెనవేసుకొని ఉండే ప్రేమానురాగాలను ఫోకస్‌లోకి తెచ్చి వాటిని నిలుపుకొనే దిశగా ప్రజాస్వామికంగా ప్రవర్తించగల సంస్కారాలను స్త్రీ పురుషులు జీవితంలో పెంచుకొంటే ఎలా ఉంటుందో చెప్పటం ఈ కథలోని ప్రత్యేకత.

మాతృత్వపు మమకారం కథలో సమస్య కూడా విభిన్నమైనది. పిల్లలు ఉన్నా భార్య మరణించిన పురుషుడు మళ్ళీ పెళ్లిచేసుకొనటం, ఆడపిల్లలకు రెండవ పెళ్లి భర్తతో పాటు కడుపున కనని పిల్లలను పెంచవలసి రావటం, ఆ క్రమంలో సవతితల్లిగా ఆమె మోయవలసిన బరువు లోకంలో సాధారణమైనవే. వాటికి సంబంధించి వచ్చిన కథాసాహిత్యం కూడా చాలానే ఉన్నది. భిన్నంగా కనకపోయినా బిడ్డను పెంచటంలో ఎంత మాతృత్వ సంతోషం, సంతృప్తి ఉంటాయో ఆ వైపుకు దృష్టిసారించమంటుంది రచయిత్రి ఈ కథలో. కోరి ఒక బిడ్డతండ్రిని పెళ్లి చేసుకొనటానికి సిద్ధపడిన కూతురిని ఆ ప్రయత్నం నుండి మళ్లించటం ఎలాగా అని ఆలోచిస్తున్న తల్లికి ఆమె కన్నకూతురు కాదన్న విషయం ఇందులో కీలకమైనది. పిల్లను తానెంత దగ్గరకు తీసినా సవతి తల్లి అన్న కారణంగా లోకం తమ ఇద్దరి బంధాన్ని బలహీనపరచటానికి చేసిన ప్రయత్నాలను అధిగమిస్తూ బిడ్డతో బంధాన్ని దృఢపరచుకొనటానికి తాను ఎంత యాతనపడిందో తెలిసిన తల్లి కనుక బిడ్డకు ఆ

యాతన ఉండరాదని భావించిన తల్లి పతిస్పందన అది. తల్లి పిల్లల మధ్య పెనవేసుకొన వలసిన ఆప్యాయతా అనురాగాలకు అవరోధంగా సృష్టించబడిన సవతి తల్లి అనే ఒక పితృస్వామిక మాయను బద్దలుకొట్టటానికి జరిగిన ఒక ప్రయత్నం ఈ కథలో చూస్తాం.

పిల్లలే సర్వస్వంగా భావించి వాళ్ళకోసమే తమ జీవితాన్ని అంకితం చేసే తల్లులకు బిడ్డలు పెరిగిపెద్దయి తమ జీవితాలు తాము ఏర్పరచుకొనే దశ ఒకటి ఉంటుందని వూహ లేకపోతే చెందే ఆశాభంగాల గురించిన హెచ్చరిక 'అమ్మ మనసు' కథ.

భర్తమరణించిన స్త్రీల తక్షణ వేదన వితంతువుగా సామాజిక బహిష్కరణకు గురి కావటం. చిన్నతనంలోనే భర్త మరణిస్తే అది మరీ దుర్భరం. వినూత్న కథలో అలా చిన్నతనంలోనే వితంతువైన అమ్మాయి పసుపు కుంకుమలకు, బతుకమ్మ పండుగకు దూరమై పడిన దుఃఖం, అప్పటికే కడుపునా బిడ్డను కని పెంచేబాధ్యతలో యవ్వనాన్ని కోల్పోవటం వస్తువైంది. పిల్లలు పుట్టి పెరిగి పెద్దవాళ్ళయి చదువుకొని పెళ్లిళ్లు చేసుకొని స్థిరపడిన తరువాత భర్త మరణిస్తే ఆ వయసులో స్త్రీలకు ఎదురయ్యే సమస్య ఇన్నాళ్లు తమకు అలవాటైన ఊరిని, ఇంటిని, పరిసరాలను వదిలి కొడుకుల దగ్గరకు వెళ్లి ఉండవలసిరావటం. అక్కడ తనది కాని బతుకు బతకవలసిరావటం సహించరానిది, భరించరానిది అవుతుంది. 'జననీ జన్మ భూమిశ్చ', 'మరో అమ్మ' మొదలైన కథలలో సమస్య, సంఘర్షణ అదే. ఎవరి వ్యాపకాలలో, సంసార బాధ్యతలలో వాళ్ళు ఉండే పిల్లల దగ్గరకు వెళ్లి ఒంటరితనాన్ని మోయాల్సిరావటం కంటే ఒంటరిగా ఉంటూ మనుషులతో సజీవ సంబంధాలలో ఉండటం ఒక ప్రత్యామ్నాయం అని చెప్పే కథ 'పరోపకారార్థ మిదం శరీరం' అనేకథ. తన శక్తిని, సంపదను వూళ్ళో ప్రజల సంక్షేమం కోసం వెచ్చిస్తూ చేతనైనది చేయటం, జగమంతా కుటుంబంగా బతకటం బతుకును సార్థకం చేస్తాయని ఈ కథ సూచిస్తుంది. ఆ మాత్రపు వూరు, ఆస్తులు లేక ఆశ్రయమైన కొడుకు కూడా మరణిస్తే ఆత్మభిమానం కల స్త్రీ ఏ వయసులోనైనా బతకటానికి చేయవలసిన ఆరాట పోరాటాలను చిత్రించిన కథ 'చదువులలో మర్మమెల్లనే చదివితి'.

ఈ సంపుటిలో రెండు కథలు సమకాలిక స్త్రీ దళిత వాద చైతన్యాలను ప్రతిఫలిస్తాయి. 'తిరగని పొద్దు' కథ స్త్రీ శరీరం మగవాళ్ల వంకరచూపులకు, చేష్టలకు వస్తువు కావటం, స్త్రీల సహజ శారీరక పెనుగుదలను, మగవాళ్లే నిర్వచించి, నియంత్రించే సంస్కృతిలో స్త్రీ పడే హింస, స్త్రీల సహజ సున్నిత స్పందలను బండబార్చే స్థితి ఏళ్ళు గడుస్తున్నా, తరాలు మారుతున్నా మారక పోవటం గురించి చర్చించింది. ఈ కథలు వ్రాయగలిగిన రచయిత్రి సామాజిక సంవేదనా శీలత అభినందించదగినది. చుట్టూ జీవితాలను పరిశీలించే ఆసక్తి, జీవితంలో ఏ కాస్తయినా మంచికి జరగ వలసిన మార్పు గురించిన ఊహాలు సుజాతా ప్రసాద్‌కు ఉన్నాయి. వాటిని సామాజిక గమనశీల సందర్భం నుండి అర్థం చేసుకొనే అధ్యయనం, అవగాహన పెరిగితే ఆమె మరింత మంచి కథలు వ్రాయగలదు. ఆ దిశగా తన అడుగులు సాగాలని ఆశిస్తున్నాను.

– కాత్యాయనీ విద్మహే

తేది : 12–8–2022



# మనసు స్పందించే కథలు

**1. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" :–** తల్లిదండ్రులు పిల్లలను కంటారు. విద్యాబుద్ధులు కష్టపడి చెప్పిస్తారు.కాని పెరిగి పెద్దవారైన పిల్లలు సుఖ,సంతోషాలకు అలవడి అమ్మానాన్నలను వదిలి వర్తమాన సుఖాలకోసం ఇతర ప్రదేశాలకు,ఇతర దేశాలకు వెళ్ళిపోతున్నారు. స్వానుభవమా కాదు.జీవితభాగస్వాములకు తొత్తులై కన్నవారిని మరిచి,మీదిమాటగామీరు మాతో ఉండండి అంటున్నారు. ఇది ఈ కాలంలో సత్యం.ఒక మాతృమూర్తి,తన జీవితభాగస్వామి చేసిన పనులకు లోబడి పిల్లలతోయెచ్చటకువెళ్ళదు. చివరికి తన ఇల్లు,దేశంలోనే తుదుశ్వాస విడుస్తుంది. ఇది "భారతమాత ఆశిస్సు" ....

**2. మరో అమ్మ:–** స్త్రీమూర్తిత్వమును పొందుపరచి, కన్నకూతురికి మంచి చెప్పిన తల్లి. ప్రతి ఆడపిల్ల పెరిగి పెద్దైన తరువాత, ఒక స్త్రీమూర్తి కన్న కుమారునికి సహధర్మచారిణిగా వెళ్ళాలి. వివాహితయైన ప్రతి స్త్రీ,తను ఒక అమ్మకు పుట్టిన బిడ్డను, నా భర్త ఒక అమ్మకు బిడ్డే.కాబట్టి ఆ స్త్రీ భర్త తల్లిని అత్తరూపములో ఉన్న "తల్లిగా" భావించినప్పుడే ఆమెకు ఉన్నతస్థానము కలుగుతుంది. ఆ స్త్రీ మాతృత్వమును పొంది సమాజములో గౌరవము పొందుతుంది. నిష్కల్మషమైన ప్రేమను పంచేది స్త్రీ మూర్తే.

**3. "పరోపకారం మిదం శరీరం" :** –స్వార్థ పర లోకంను కన్నులు తెరిపించింది.

కన్నవారి కన్నులు తెరిపించింది.నవమాసాలు మోసి కన్నపిల్లలను పెంచి పెద్ద చేసిన స్త్రీ మూర్తి కన్నులు తెరిపించింది. అసూయకు,కుటిలత్వానికి కలిగేఫలితం దీనిలోమూర్తీభవించింది.ఇలాంటి వారు నేడు(ఈనాడు) యిలాంటి వారెందరున్నారో తెలియదు. వారు (బుద్ధి) జ్ఞానం తెచ్చుకుంటే గ్రామం, దేశం బంగారు కాంతులు వెదజల్లుతుంది.

**4. అమ్మ మనసు :–** అమ్మ అనే రెండక్షరాలలో యెంత విలువ యుండునో తెలుసు కోవాలి."అ" అనే అక్షరం– ఆత్మ,ఆదరణ,ఆప్యాయత, అంతులేని ప్రేమ. "మ్మ"– లో మమకారం,మాధుర్యత యెంత యుందో తెలుసుకోవాలి బిడ్డలు. క్షణికోద్రేకాలకు బానిసై, భార్యల వేదింపులకు చితికి, బాధననుభవించిన వారు ఈ లోకంలో యున్నారు. తన వాళ్ళని, కన్నవారి కోరికలు తీర్చి గతించిన మాతృమూర్తులున్నారు. కాని తెలిసికోకున్నారు. "మాతృ దేవోభవ,పితృదేవోభవ,ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అనే వేదవాక్యము కాళ్ళ క్రింది త్రొక్కిపెడుతున్నారు. అలాంటివారు చివరికి అధోగతి పాలవుతీరనేది సత్యం.

**5. "మాతృత్వపు మమకారం" : –** ప్రపంచంలోని ప్రతి స్త్రీ మాతృమూర్తియే. కాశీ ఖండంలో ప్రతి స్త్రీ పునీతురాలని,పవిత్రురాలని చెప్పింది.మాతృత్వములోని ప్రేమాభిమానాలు కనిపించక, కనిపించును. నేడు స్వార్థపరులైన స్త్రీలు కామానికిలోనై కన్నబిడ్డలను కాదనుకునే వారున్నారనే భావన కల్పించావు.అలాంటి స్త్రీలలో మార్పు వచ్చిన మాతృత్వమును పొందుననే భావన వ్యక్త మవుతుంది. ప్రేమను పంచేది స్త్రీ మూర్తే.

**6. తెలుగు తల్లి ఒడిలో :–** "మాతృ దేవోభవ,పితృదేవోభవ,ఆచార్య దేవోభవ మరియు అతిథి దేవోభవ" అనే వేదవాక్యమును గ్రహించిన వారెందరున్నారీ లోకంలోని ప్రతి శిశువు మాతృభాషను తెలిసికొన్నప్పుడే,యే యితర భాషలనైన నెమ్మదిగా తెలిసికొని ప్రావీణ్యతను పొందును.తల్లిపాల రుచిని తెలిసికొనిన శిశువు యే పాలు, యే నీరు యెట్లుండునో తెలిసికొనగలదు.

**7. దేవుడిచ్చిన బిడ్డ :–** ప్రతి స్త్రీ తాను ఒక అమ్మను కావాలనుకుంటూ కలలు కంటుంది. భార్య, భర్తల అనురాగ కోరికలతోనే సాధ్యమై, మాతృమూర్తిగా పేరుం టుందనే భావన కలుగుతుంది. నవ మాసాలు మోసి బిడ్డను కనడము కానప్పుడు,

స్త్రీ బాధపడకూడదనే భావన కలిగింది. ప్రతి స్త్రీ పాపను ప్రేమతో పెంచడంతో మాతృత్వం వస్తుంది.నేను, భగవంతుడిచ్చిన అనాధ పసిపాపకు తల్లిననే సంతోషం కలుగుతుంది.

**8. చదువులలో మర్మమెల్లనే చదివితి :–** స్త్రీ ఉన్నత చదువులు చదివి, ప్రతి చిన్న విషయము మానవ మనుగడకేనని తెలుస్తుంది.సాత్విక స్వస్వభావులైన స్త్రీలలోగౌరవ,మర్యాదలుంటాయి.కొందరు స్త్రీలు తమ అహం చాటుకుంటూ,తోడు హత్యకు కారకులవుతారు.

**9. తిరగని పొద్దు :–** ఈ లోక సమాజంలో ఒక అందమైన స్త్రీ సొగసులు చూసి,మగవారు,కుర్రాళ్ళు చిలిపిగా చేస్తారని తెలుపుతుంది.ప్రతి శిశువు స్త్రీ గర్భము నుండే ఉదయిస్తుందని తెలిపింది. మగజాతి యీ విషయంగమనించాలని తెలిపింది.

**10. వినూత్న –** "ఆడజన్మ "అమ్మ" అనే రెండక్షరాల నిలయము. కాని సనాతన (గత) కాలంలో ఆడపిల్లలకు చిరు ప్రాయములోనే పెళ్లిళ్ళు చేసేవారు. భవిష్యత్తులో అదృష్టం కలిసిరాకే, చిరు ప్రాయంలో పెళ్లి చేసిన కూతురు భర్త మరణించితే,అభం – శుభం తెలియని "వినూత్న" జీవితాంతం తన స్త్రీమూర్తిత్వాన్ని నాశనం చేసుకుంది. కావున యిలాంటి ఆడపిల్లల జీవితాలను బండరాయి చేయ కూడదని తల్లిదండ్రులు ఆలోచించి సరియైన నిర్ణయము తీసికోవాలి.

శ్రీమతి.వై.సుజాత ప్రసాద్ వ్రాసిన ఈ కథలు చాలాచాలా అమూల్యమైనవి.ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. ప్రతి కథ కూడా ఆలోచించేలా, ఆచరించేలాగ ఉన్నాయి. ఇట్టి భావనలు స్త్రీలలో కలిగిన దేశం గర్విస్తుంది. ఇదే నా ముఖ్యఉద్దేశము. ఇంత మంచి కథలు వ్రాసిన శ్రీమతి.సుజాత ప్రసాద్ గారికి నా ధన్యవాదములు. ఇలాంటి సామాజిక అంశాలనే ఇతివృత్తంగా వ్రాస్తున్న సుజాత ప్రసాద్ గారికి మంచి భవిష్యతు ఉంది. మంచి కథారచయిత్రిగా పేరుగాంచి మన గ్రామానికి మంచిపేరు తేవాలని ఆశీర్వదిస్తున్నాను.

**– గాజుల నాగరాజం,**

లచ్చపేట.



# నా హృదయ ఆవిష్కరణ

*'యత్ర నార్యస్తు పూజ్యతే రమంతే తత్ర దేవతాః*
***యత్రేతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రా ఫలా క్రియాః'***

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడదేవతలు నివసిస్తారు అన్నారు మన పెద్దలు. కాని ఈనాటి పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తుంది. ఆడపిల్ల అర్ధరాత్రి ఒంటరిగా క్షేమంగా ఇల్లు చేరినపుడే మన దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు మన జాతిపిత గాంధీ మహాత్ముడు. కానీ ఈ రోజుల్లోపగలుతిరిగినా పడతులకు రక్షణ లేని సమాజాన్ని చూస్తున్నాం. ఈనాడు ప్రపంచమంతా స్త్రీలపై హింస పెరిగి పోతుంది. మూడేళ్ళ పసిమొగ్గ నుండి ముడుతలు పడ్డ ముదుసలి వరకు అత్యాచారాలకు గురి అవుతున్నారు. దీనికి కారణం పురుషాహంకారమే అని చెప్పవచ్చు. ఆర్ధ్రతను, ఆగ్రహాన్ని కూడా సమాన ప్రతిభతో వ్యక్తీకరించడం స్త్రీయొక్క ప్రత్యేకత. స్త్రీ జాతిని ఉత్సాహంతో నింపి, సంప్రదాయ మత్తు నుంచి నిద్రలేపే చైతన్యం స్త్రీ ఆగ్రహంలో ఉంది. మానసిక పరిణతి మనిషి వ్యక్తిత్వానికి వికాసం కలిగిస్తే, సామాజిక చైతన్యం సమాజ ప్రగతికి దోహదం చేస్తుంది. ఈ రెండు సమాజంలో సంభవించినపుడే సమాజం అన్నివిధాలుగాను ఆరోగ్యమవుతుంది. స్త్రీ స్వేచ్ఛ అంటే బాధ్యతతో కూడిన స్వేచ్ఛ అని స్పష్టంగా చెబుతూ, స్త్రీ జీవితంలోని అన్ని కోణాలను చర్చించి, ఆమెను పరిపూర్ణ వ్యక్తిగా జీవించాలని సందేశాన్నిచ్చిన ఓల్గా మేడమ్ మనందరికి ఆరాధ్యురాలు, ప్రతి మహిళ ఆర్థిక స్థిరత్వాన్ని సాధించినపుడు ఇక సమానత్వ సాధన కోసం పిడికిలి బిగించాల్సిన అవసరం ఉండదు. కాబట్టి

ఆర్థిక స్వావలంబనతోనే సమానత్వ సాధన సాధ్యమవుతుంది. కాస్త స్వేచ్ఛ మరికాస్త ప్రోత్సాహం ఉంటే మహిళలు ఆకాశమే హద్దుగా ఎదుగుతారనడానికి నేనే నిదర్శనం. సాధారణ గృహిణి నుంచి ఈ స్థాయికి చేరుకునే నా సాహిత్య ప్రయాణంలో నేను వ్రాసే ప్రతి అక్షరం మహిళకు ఒక స్ఫూర్తిపాఠం కావాలన్నదే నా ఆరాటం. ఎందుకంటే ఏ రంగంలోనైనా మహిళలు తమను తాము నిరూపించుకోవడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. వాళ్ళు పైకి రావడానికి, విద్యాభ్యాసం, హక్కులను పొందడానికి అలుపెరగని పోరాటం చేయాల్సి వస్తుంది. అందుకు నా జీవితమేమి అతీతం కాదు. సాధారణ గృహిణిగా ఉన్న నేను ఇవాళ ఈ స్థానంలో ఉండడానికి నా కృషి పట్టుదలతోపాటు నా  కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా తోడ్పడింది. ఆడవాళ్ళు బయటికి వెళ్ళి ఏది సాధించాలన్న తన ప్రతిభను చాటుకోవాలన్న ముందుగా కుటుంబం నుంచి సహకారం ఉండాలి. న్యాయవ్యవస్థలో 33 శాతం మహిళా రిజర్వేషన్‌తో చాలా ఉన్నత స్థానాల్లోకి మహిళలు వస్తున్నా ఇది శుభపరిణామము. కానీ అదే అన్ని వ్యవస్థల్లోనూ రావాలి. మహిళలు ఏ పనిచేసినా, భర్త బాగా సంపాదిస్తుంటే ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోకుండా ఏదో సాధించాలన్న తాపత్రయం యెందుకని చాలామంది నిరుత్సాహపరుస్తారు. అలాంటి మాటలు విన్నా పట్టించుకోకపోవడం పట్టుదలతో ముందుకు సాగిపోవడమే మన ఆడవాళ్ళ కర్తవ్యం.

ఏదో కొంత సమయంలో వ్రాయడం నా దినచర్యలో భాగం అయింది. ప్రతి రోజు న్యూస్‌పేపర్ చదవడం అలవాటుగా మారింది. అలా వ్రాస్తూనే నాకంటూ ఓ గుర్తింపు వచ్చింది. నా రచనా వ్యాసంగ ప్రవృత్తి జీవితంలో నాకొక గౌరవాన్ని తెచ్చి పెట్టింది. అపుడే నా ఎదుగుదలకు తొలి అడుగు పడింది. నా బాధ్యతలు నెరవేరుస్తూనే, నా జీవితాన్ని ఇంకా ఉన్న స్థితిలోనుండి ఉన్నత స్థితిలోకి చేరుకోవడానికి చదువు ఒక్కటే మార్గం అని నా నమ్మకం. కనుక నా చదువును కొనసాగిస్తున్నాను. ముసలి తనానికి కుసుమ గుడాలు అని ఎవ్వరు ఎంత వెక్కిరించినా పట్టుదలతో చదువు కొనసాగిస్తున్నాను. ఎన్ని అవాంతరాలు ఎదురయినా అవరోధాలు,అవమానాలు దాటి ముందుకు వెళ్ళాల్సిందేనని నిర్ణయించుకొన్నాను. మన హక్కుల గురించి మనం తెలుసుకోవడంతోనే వివక్ష అణచివేతలను ఎదుర్కోగలం. మహిళలకు అన్నిచోట్లా  ఈ వివక్ష ఎదురవుతోంది. నిత్యం మన సమాజంలో ఎంతోమంది మహిళలు ఎన్నో రకాలుగా వివక్షకు గురవుతున్నారు. చాలామంది జీవితాల్లో

నేను ప్రత్యక్షంగా చూశాను. అయితే చాలామంది వివక్షను తేలికగా తీసుకుంటారు. ఇప్పుడిప్పుడే కొంతమంది ధైర్యంగా తమకు ఎదురైన సమస్యలను పరిష్క రించుకొంటున్నారు. ఇది ఎంతో శభపరిణామమని చెప్పవచ్చు. అందుకే ఎటువంటి లింగవివక్ష, అసమానతలు లేని సమాజం రావాలన్నదే నా ప్రయత్నం. కానీ ఇప్పటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రతి స్త్రీకి భద్రత ముఖ్యమే. నా మటుకు, నాకు ఆడపిల్లల భద్రత మరింత కీలకం. మహిళల మీద హింస రోజురోజుకు పెరుగుతూ ఉంటే కొంతమంది మౌనంగా భరించగలుగుతున్నారు. కొందరు పోరాటానికి సిద్ధ పడ్తున్నారు. కడుపులో బిడ్డగా ఉన్నప్పుడు గర్భస్రావం మొదలుకొని, ప్రేమించమని వేధించే ఉన్మాదుల నుంచి బైటపడటం, పెళ్ళయ్యాక ఇంటి హింస, భర్త ఆస్తిమీద హక్కు, రెండోపెళ్ళి సమస్యలు, పనిచేసే చోట వేధింపులు సహా సమాజంలో ఎదురయ్యే హింస, చివరగా కొడుకులే గెంటేసే పరిస్థితి వస్తుంది. అక్కడా ఇక్కడా అని కాదు. ఆడవాళ్ళపై అన్నిరంగాల్లో అణచివేత కొనసాగుతుంది. స్త్రీలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నా అబలగానే చూస్తుంది పురుష ప్రపంచం. ఎప్పుడైతే ఓ మహిళ తన కాళ్ళ మీద తాను స్వతంత్రంగా నిలబడుతుందో ఆమెతోపాటు ఆమె కుటుంబ మంతా సమాజంలో అభివృద్ధి సాధిస్తుంది. ఆ మహిళ సమాజానికి పునాదిగా మారుతుంది. కుటుంబానికి మహిళ తోడ్పాటు లోపిస్తే ఆ కుటుంబం మొత్తం కుప్పకూలిపోతోంది. దృఢమైన ఆలోచనలున్న మహిళ ఆసరాతో కుటుంబం నిలదొక్కు కుంటుంది. ఇంటి బయట ఆమె పేరు రాసి లేకపోయినా, ఇంటిలోపల ఆమెదే ప్రధానపాత్ర అయి వుంటుంది. తరాలు మారుతుంటాయి. ఆ మార్పుతో మనం ముందుకు వెళ్ళాలి. అందుకు ప్రతి మహిళ అక్షరాస్యురాలయి ఉన్నపుడే ఇది సాధ్యమవుతుంది. జీవితమంటే రకరకాల ఒత్తిళ్ళతో కూడిన సాగిపోయే ప్రస్థానం. ఇక నా రచనల గురించి చెప్పాలంటే ఒక రచనకు రచయితకు గీటురాయి పాఠకుల ఆదరణ తప్ప అవార్డు కాదు అని నమ్మకం. ఇప్పటివరకు అవార్డు రాని గొప్ప రచయితలు ఉన్నారు. అవార్డులు తిరస్కరించిన గొప్ప రచయితలు మనలో ఉన్నారు. హింస నిండిన నేటి ప్రపంచంలో, ప్రజాస్వామ్యం కరువైపోతున్న పరిస్థితుల్లో కవులు తన కలాన్ని పదును పరుచుకొని ప్రజల్లో చైతన్యం కలిగించేలా ధిక్కార స్వరమై నిలవాలి. మరో పార్శ్వం ఏమంటే అభ్యుదయ సాహిత్యసేవలో నేను రచయిత్రిని కాకున్నా సమాజానికి మేలుచేసే, చైతన్యాన్ని రగిల్చే సాహిత్యానికి అండదండగా

నిలిచే కవయిత్రిని కావాలని నా ఆకాంక్ష. ఈ ప్రయాణంలో నా కథలు మీ అందరికీ ఒక ఊరట కలిగించాలి. ఒక స్వాంతన, ఒక ఉత్సాహం, ఊపిరి కావాలి. నా జీవితంలో సామాజిక చైతన్యం కోసం చేసిన రచనలను సౌకర్యంగా, సులభశైలిలో అందించాను. భావుకత అంతకు మించి చక్కటి కథాత్మకత కలగలిపి నా దైనందిన జీవితంలో నాకు తటస్థించిన అనేక అనుభవాలను, అనుభూతులను చక్కగా అక్షరీకరించి కథలల్లి కథాపుష్పాలు గుదిగుచ్చి దండగా మార్చి పుస్తకంగా మలిచాను. ఈ పుస్తకం విసుగనిపించకుండా ఆద్యంతం మిమ్మల్ని అలరిస్తుందని ఆశిస్తున్నాను. సాదాసీదా సామాన్యుల స్వభావాలను కళ్ళకు కట్టి మీ గుండెను తడిచేస్తే నేను ధన్యురాలిని. నా ప్రతి కథ ఒక సామాన్య మహిళలకు దిక్సూచి కావాలి. ఒక పుస్తకాన్ని వ్రాసి ప్రచురించడం అనేది సామాన్య విషయం కాదు. అందుకు ఎన్నో సమస్యలు, ఆటంకాలు ఎదురవుతుంటాయి. నాది దిగువ మధ్యతరగతి కుటుంబం. కష్టాలు, సవాళ్ళు తెలుసు. అయితే వాటిని చూసి బాధపడుతూ కూర్చోలేదు. ఆశావహ దృక్పథంతో అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు వెళుతూ లక్ష్యాన్ని సాధించాను.సమాజాన్ని పరిశీలించడంలోనే నాకు ఒక స్పష్టత వచ్చిందని చెప్పవచ్చు. ఈ తరం మహిళలకు కూడా నేను చెప్పేది ఒక్కటే..ఆత్మవిశ్వాసంతో పట్టుదలగా ప్రయత్నిస్తే సాధించలేనిదేమీ లేదు. చాలామంది మహిళలు వాళ్ళనివాళ్ళు తక్కువగా అంచనా వేసుకొంటారు. మహిళలు నేను ఆడదానిని...అని మర్చిపోయి మహిళలు ఎందులోనూ తక్కువ కాదని గ్రహిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరు.అదే సమయంలో కుటుంబ మద్దతు కూడా ముఖ్యం. సమాజం మనస్తత్వంలో మార్పు రావాలి. స్త్రీ పురుషుడికన్నా తక్కువనే పితృస్వామ్య భావజాలాన్ని సమాజం వదిలించు కోవాలి. స్త్రీని చిన్నచూపు చూసి బాధలు పెట్టే సమాజం ఎప్పటికీ పురోగమించలేదు.ఒక వ్యక్తిని మార్చాలంటే ఎన్ని మాటలైనా చాలకపోవచ్చు. కాని వ్యవస్థని మార్చాలంటే అది ఒక పుస్తకానికే సాధ్యం. మస్తకాన్ని మార్చాలంటే మనందరికి పుస్తక జ్ఞానం అవసరం. ప్రతి సమస్యను ఒక సవాలుగా తీసుకొని తనదైన శైలిలో సంక్షోభాలను దాటుకుంటూ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగడం అలవర్చుకోవాలి. ఇక నా ప్రగతి శీల సాహిత్య ప్రస్థానంలో "పసిడి పళ్ళానికైనా గోడ చేర్పు అవసరమన్నట్లు" కళాకారులను సైతం భుజం తట్టే చేతులుండాలి. అదే నావంటి కవయిత్రులకు కొండంత అండ. అలాంటి ప్రోత్సాహాన్ని మీరు

నిరంతరాయంగా నాకు అందిస్తారని ఆశిస్తున్నాను. అనాదిగా మహిళలను గౌరవించే సంస్కృతి మనది. మనమే కాదు మన తర్వాత తరాలు వారు కూడా నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది.

ఇక కథల విషయానికొస్తే నా మొదటి కథ చదివిన కొడుకులందరూ తన తల్లిదండ్రులకు తగు సేవలందించినపుడు, నా రెండవ కథలో ప్రతి కోడలు తన తల్లిని చూసినట్లు అత్తమ్మను చూసినపుడు, మూడవ కథలో సవతి తల్లికి కూడా మనసుంటుంది అనుకున్నప్పుడు, ఐదవ కథలో ప్రతి తల్లీ తన కొడుకుల పట్ల ఎనలేని మమకారం పెంచుకుని కోడలు వచ్చినాక కూడా అన్ని సేవలు తనే చేయకుండా కోడలుకు స్వాతంత్రం ఇచ్చినపుడు, ప్రతి ఆడపిల్లను తెలుగు మాధ్యమంలో చేర్పించి తెలుగు నేర్పించినపుడు, పిల్లలు కలగని మాతృమూర్తి ఆవేదనను ఇతరులు గ్రహించినపుడు, తక్కువ చదువుకున్నా తెలివిగలవారని గుర్తించినపుడు, ఆడవారి జీవితం ఒకలాగా ఉండకుండా పొద్దు తిరిగినపుడు, ఆడపిల్ల కన్న కలలన్నీ నిజమయి నపుడు నేను వ్రాసిన పుస్తకం పావనమైనట్లు.

నా కథలు చదివి మగవారు మనసు మార్చుకొని మానవత్వం ప్రదర్శించినపుడు, నా కథలు చదివిన కొందరిలోనైనా మార్పు కనబడినపుడు, గడిచిన కాలాన్ని మన కళ్ళముందు నిలిపి పునరుశ్చరణకు, పునర్విమర్శకు దోహదపడినపుడు నా జన్మ ధన్యమైనట్లు నా పుస్తకం సార్ధకమైనట్లు.

ఇక ముందుమాటల విషయానికి వస్తే...

**బుర్రా వెంకటేశం గారు...**

భారతీయ కథాసాహిత్యంలో తెలుగు కథ ఇప్పటికే చక్కటి స్థానంలోనే ఉంది అని అభివర్ణిస్తూనే, కథలు వ్రాయడం కష్టం. అంతటి కష్టసాధ్యమైన పనిని సుజాతాప్రసాద్ గారు సమర్థవంతంగా నిర్వర్తించారని అభినందిస్తున్న బుర్రా వెంకటేశం సార్‌కి నా హృదయపూర్వక కృతజ్ఞతాభినందనలు. మహిళలను గౌరవించు అనే భావన వెల్లివిరుస్తుందని నా భావన అంటూ, వారి కలం నుండి మరిన్ని కథా సంపుటాలు జాలువారాలని ఆకాంక్షిస్తూ.. ఇక సార్ గురించి చెప్పాలంటే మా అక్షరయాన్ మహిళా రచయిత్రులందరికీ ఆత్మీయ సోదరుడు. మేమంతా ఎంతో ఆత్మీయంగా పెద్దన్న అని పిలుచుకునే పెద్ద పెద్దన్న మా బుర్రా వెంకటేశం అన్న. తను వ్రాస్తూనే అందరిచేత వ్రాయించే అక్షరమాంత్రికులు మా వెంకటేశం అన్న.

తాను నిత్యం పరిపాలన విభాగంలో ఎంత బిజీగా ఉన్నా కూడా కొంత సమయాన్ని రచనా వ్యాసంగానికి కేటాయిస్తున్న అక్షరహాలికులు మా వెంకటేశం అన్న. అమ్మ గీసిన బొమ్మను అనే క్రొత్త ప్రక్రియలలో వ్రాసిన కవితాసంకలనాన్ని ఎంతో సొగసులద్దాలని నాట్యరూపకంగా చేయమని గొప్ప ప్రైజ్ మనీ ప్రకటించిన ఉదారస్వభావులు. తాను వ్రాసిన 1) సెల్ఫీ ఆఫ్ సక్సెస్ 2) రామాయణ పరివారం 3) శతకశోడచి అనే సూక్ష్మ కావ్యం 4) జీవితధన్యం 5)బుద్ధం శరణం గచ్ఛామి 6) అనుబంధాల పూదోట అనే పుస్తకాలు వ్రాసి తాను వ్రాయడమే కాకుండా అనేకమంది అక్షరయాన్ అనే మహిళారచయిత్రులతో సూక్ష్మ కావ్యం అనే క్రొత్త ప్రక్రియలో అనుబంధాల పూదోట అనే కవితాసంకలనాన్ని వ్రాయించిన అక్షర మాంత్రికులు మా వెంకటేశం అన్న. అక్షరక్షేత్రంలో అనుబంధాల పంట పండించిన అక్షర ఆత్మీయులు. అన్న ఎప్పుడూ మీ అడుగుజాడల్లో నడుస్తానని హామీ ఇస్తున్నాను.

**ఏనుగు నరసింహారెడ్డి గారు...**

కథనంలోనే కథను సృష్టించగలిగే నేర్పు ఉన్న భిన్నమైన రచయిత్రి సుజాతాప్రసాద్ అని... తన కథలో మానవత్వాన్ని మేల్కొలిపే దయార్ధ సన్నివేశాలను అడుగడుగునా చిత్రించారు రచయిత్రి అని... స్త్రీ కేంద్రిత మానవత్వ స్పర్శ, కారుణ్య దృష్టిగల ఇలాంటి కథలు సుజాత గారు నిరంతరం రాస్తూనే ఉండాలి. నిరంతరం పత్రికల్లో కథకురాలిగా స్థిరపడిపోవాలని ముందుకు నడిపిస్తూ తగు సూచనలు, ఎన్నో సలహాలు ఇస్తూ నన్ను ముందుకు నడిపిస్తున్న ఏనుగు నరసింహారెడ్డిగారు ఎన్నో మంచి పుస్తకాలు వ్రాసిన అక్షర కర్షకులు. సమాంతర స్వప్నం (1995), నేనే (2002), మట్టిపాట (2008), కొత్తపలక (2013), హైద్రాబాద్ విషాదం (2018), అంతరంగం (2018) తెలుగు రాష్ట్రాల రెవెన్యూ వ్యవస్థ నిన్న నేడు రేపు (2019), సమాహర (2019), గుర్రం జాషువా, డిలాన్ థామస్ కవిత్వంలో బాల్యం (2019), తెలుగు హిందీ జాతీయోద్యమ గీతాలు (2019) తెలంగాణ రుబాయిలు (2020), అసఫ్‌జాహీ సంస్థానం విలీనగాథ (2020), నీడల దృశ్యం (2021), పూల పూల వాన (2022) లాంటి పుస్తకాలు వ్రాసి అక్షరసేద్యం చేస్తూ పరిపాలన దక్షత కలిగి వున్న నిత్యాన్వేషి ఏనుగు నరసింహారెడ్డి సార్.

తను వ్రాసిన కొత్తపలకకు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు – 2022లో తెలంగాణ రుబాయిలకు సారస్వత పరిషత్తు అవార్డు అందుకొని అందరిని

ప్రోత్సహిస్తున్న ఔత్సాహికులు, ఉదారస్వభావులు. మీలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని మేమందరం ముందుకు నడుస్తాం సార్. నా హృదయపూర్వక నమస్సులు సార్ మీకు.

**అశోక్ తేజా సార్...**

తేజా సార్ నాన్నగారైన సుద్దాల హనుమంతు గారు వ్రాసిన 'పల్లెటూరి పిల్లగాడ పసులగాసే మొనగాడ' అని వ్రాసి తన కూతురు సుశీలక్క గారితో పాడించిన పాట అమోఘం. అభినందనీయం. వారి సాహిత్య సంస్కృతిని వారసత్వంగా పుణికిపుచ్చుకొని తాను కూడా తనదైన శైలిలో పాటలు వ్రాయడం, టాగూర్ సినిమాలో నేను సైతం అన్న పాటకి జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషదాయకం. ఇలాంటి ఎన్నో పాటలు వ్రాసి ప్రసిద్ధికెక్కిన సుద్దాల అశోక్ తేజ సార్, సినారె తర్వాత మన తెలంగాణ పసిడి పాటల ముద్దుబిడ్డగా మనకెంతో గర్వకారణం. ఈమధ్యకాలంలో వ్రాసిన సారంగధరియా అన్న పాట కూడా ఎంతో ప్రాచుర్యం పొందినదో మనకందరికీ తెలిసిందే. నేను అడిగి అడగగానే నా బుక్‌కి ముందుమాట వ్రాస్తానన్నారు. అన్నమాట ప్రకారం నేను అడగగానే వ్రాసి పంపినారు. నా మొదటి కవితా సంపుటిని చదివి చిప్పిల్లిన కవితామకరందాలు కొంచెం కొంచెం ఆస్వాదించిన వాణ్ణి. తన కవితల్లో సరికొత్త ఆవిష్కరణలు ఇష్టపడ్డవాణ్ణి అంటూ సాహితీలోకంలో కవయిత్రిగా లబ్ధప్రతిష్టురాలిగా విస్తారించాలని ఆశీర్వదిస్తూ, అభినందిస్తూ తన విలువైన సమయాన్ని వెచ్చించి చాలా చక్కని ముందుమాట వ్రాసిన అశోక్‌తేజా సార్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**ఓల్గా మేడమ్...**

మన దేశంలో ఓల్గా మేడమ్ పేరు తెలియని వారుండకపోవచ్చు. మేడం పూర్తిపేరు లలితకుమారి యైనా ఓల్గా అన్న కలం పేరుతోనే ప్రాచుర్యం పొందారు. నా కథలు చదివి 'రెప్ప విప్పి చూడాల్సిన నిజాలు' అని అభివర్ణిస్తూ నా పుస్త కానికి ముందుమాట వ్రాశారు. ముఖ్యంగా చెప్పాలంటే నేను చదవకున్నా సాహితీ అభిలాషుల నోట విన్నాను మేడం రచన గురించి స్వేచ్ఛ నవల ఎన్నో విమర్శలకు గురి అయినా తన వాదనతో స్త్రీవాద సాహిత్యంలో కొనసాగుతున్న గొప్ప ఎన్నో మంచిమంచి పుస్తకాలు వ్రాసిన అక్షర సైనికురాలు. అందుకే మేడంను ఆదర్శంగా తీసుకుని నా కథాసంపుటి ముందుమాటలు వ్రాయించుకొన్నాను. నా అక్షరాలకు

మీ ముందుమాటలతో సువాసనలద్దమన్నాను. తాను ఎంతో అస్వతతకు గురి అయి చెన్నైలో ఉన్నా నాకిచ్చిన మాట ప్రకారం ముందుమాటలు వ్రాసిన దయార్ద్ర హృదయిని. మేడమ్ వ్రాసిన విముక్తి నవల నా జీవితానికి అద్దం పట్టినట్లు ఉందనిపించింది. ప్రజాస్వామిక రచయిత్రుల కార్యక్రమంలో చర్చించుకున్నపుడు విన్నప్పుడు అన్పించింది. స్వేచ్ఛ భావజాలంతో వ్రాసే ఈ మేడమ్‌ని కలవాలని కుతూహలం కలిగింది. తెలుగుమహాసభల్లో కలిసాం కానీ ఎక్కువ మాట్లాడే అవకాశం రాలేదు. ఇప్పుడు పుస్తకాలకి ముందుమాట కోసం మేడంను అడిగినపుడు మేడమ్ ఓకే అనగానే నా ఆనందం ఆకాశమంటింది. ఇప్పుడు మేడం ముందుమాటలు నా పుస్తకానికి తీరైన రంగుల సొబగులు అద్దినట్లనిపిస్తుంది. అందుకు చాలా చాలా సభక్తికధన్యవాదాలు మేడం.

**కాత్యాయని విద్మహే మేడమ్...( కిడ్స్ ప్రొఫెసర్, ప్రముఖ స్త్రీవాద సాహిత్య రచయిత్రి)**

మేమంతా ప్రజాస్వామిక రచయిత్రుల సమ్మేళనానికి తిరుపతి వెళ్ళినపుడు పరిచయమయ్యారు. మేడం ఎన్నో మంచి పుస్తకాలు వ్రాసి రచయిత్రిగా ప్రసిద్ధి పొందారు. ఎప్పటికైనామేడంతో నా పుస్తకానికి ముందుమాట వ్రాయించుకోవాలని నిర్ణయించుకున్నాను. మేడం ప్రసంగం విన్నాక, స్త్రీల జీవిత పరిశీలనలు సుజాతా ప్రసాద్ కథలు అని కితాబునిస్తూనే, సామాజిక సంవేదనాశీలత అభినందించ దగినదని, సామాజిక గమనశీల సందర్భం నుండి అర్థం చేసుకునే అధ్యయనం, అవగాహన పెరిగితే ఆమె మరింత మంచి కథలు వ్రాయగలరు అని సూచనలు, సలహాలు ఇస్తూనే! ఆ దిశగా తన అడుగులు సాగాలని ఆశీర్వదిస్తున్న మేడంకు నా మనఃపూర్వక ధన్యవాదాలు. మేడం అమెరికాలో ఉన్నా కూడా నేనడగగానే పరిమళ భరితమైన అక్షరతోరణమొకటి నా పుస్తక ముందు ద్వారానికి కట్టి నా పుస్తకంలోని అక్షరసువాసనలు అందరూ ఆస్వాదిస్తూ చదివేలా వ్రాసిన మీకు మరొక్కసారి ధన్యవాదాలు మేడం.

మీ విలువైన సమయాన్ని వెచ్చించి నా కథలు ఆమూలాగ్రంథం సమగ్రంగా చదివి స్పందించి చక్కని విశ్లేషణను అందించి నాకు ప్రోత్సాహాన్నిస్తూ ఇంకా వ్రాయాలన్న ఉత్సాహాన్ని కలిగించినందుకు మీకు వేలవేల ధన్యవాదాలు.

“రెప్పవెనుకస్వప్నం” అనే నా కథల సంపుటికి మీ ముందుమాటలు సొబగు లద్దిన అలంకారాలు. మీ నీడలో అవరోధాల్ని, ఆటంకాల్ని అధిగమిస్తూ ఇప్పుడే

మొలకెత్తుతున్న గడ్డిపువ్వు నైన నన్ను సువాసనలు వెదజల్లే నాస గడ్డిలా నన్ను మార్చేసి నా అక్షర పరిమళాల్ని అందరికి చేరేలా చేసిన మీ అందరికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

నన్ను ఎంతో ప్రోత్సాహిస్తున్న గురుతుల్యులు శ్రీ సిధారెడ్డి సార్ గారికి ధన్య వాదాలు. నాపట్ల ఎంతో సౌజన్యం కనబరచిన సిద్ధిపేట పార్లమెంటు సభ్యులు గౌరవనీయులైన శ్రీ కొత్త ప్రభాకరన్నకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నన్ను ఎంతో ప్రోత్సాహిస్తున్న నా జీవిత సహచరులు శ్రీ యెర్రగుంట ప్రసాద్ గారికి నా మనఃపూర్వక పాదాభివందనాలు. పూజ్యులైన నా  అత్తమ్మ మామయ్యలగు కీ.శే. ఎర్రగుంట. విఠల్ వరలక్ష్మీగార్లకు నా సభక్తిక పూర్వక పాదాభి వందనాలు. గౌరవ నీయులైన శ్రీ రామచంద్రమౌళి బావగారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. నా పుస్తకానికి ముందుమాట వ్రాసి అక్షరదోషాలు సవరించిన ఆత్మీయులు, గురు తుల్యులు గౌరవనీయులైన శ్రీ గాజుల నాగరాజం సార్ (లచ్చపేట) గారికి నా ఆత్మీయ కృతజ్ఞతలు. అడుగడుగునా నన్ను ప్రోత్సహిస్తున్న పితృసమానులైన మా పెద్దన్న శ్రీ క్యాతం రఘుపతిగారికి,నా అన్నదమ్ములకు, అక్కాచెల్లెళ్ళకు, అన్నయ్య వదినలకు, మరదళ్లకు,మరుదులు తోడికోడళ్ళకు, నా కృతజ్ఞతాభి వందనాలు. నా తోబుట్టుల పిల్లలకు,మావారి తోబుట్టిన పిల్లలకు మరియు నాపుస్తకానికి అందమైన ముఖ చిత్రం వేసిన చిరంజీవి. లక్ష్మీ సౌ.నూతి స్నేహ ప్రియకు నా ఆశిస్సులు. నా శ్రేయోభిలాషి కేసుగారి రాములన్నకు,మిట్టపల్లి పరుశురాముల అన్నకు నా కృతజ్ఞతలు.

నా ఆత్మీయగురువులైన శ్రీ సామసువర్ణాదేవి వదినకు (మహిళాకళాశాల వైస్ ప్రిన్సిపల్) సోషల్ వెల్ఫేర్ పర్సన్ బండారు. జయశ్రీ మేడం గారికి (యాదాద్రి భువనగిరి జిల్లా), కృష్ణారెడ్డి అన్నగారికి,చెన్న కృష్ణారెడ్డి గారికి (ఒ.యు.విశ్రాంత ఆచార్యులు), చిదంబర్ గారికి, లక్ష్మీనారాయణ అన్నగారికి, ధరణి అన్నగారికి,గొల్ల కృష్ణమూర్తి అన్నగారికి, బెస్త నారాయణ అన్నగారికి, గౌరయ్యగారికి, కృష్ణమూర్తి బాబాయిగారికి,గోవర్ధన్ బాబాయిగారికి, వడ్లకొండ వెంకటయ్య బాబాయి గారికి, శ్రీనివాసు శ్రీదేవి అక్కయ్యగారికి  మరియు మా కుటుంబ పెద్దలు, శ్రేయోభిలాషు లందరికీ పేరు పేరునా నాహృదయ పూర్వక ధన్యవాదాలు. అక్షరయాన్ రథసారథి ఐనంపూడి శ్రీ లక్ష్మీ మేడం గారికి నా కృతజ్ఞతలు.నాకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ నా పుస్తకానికి తగిన పేరును సూచిస్తూ నన్ను వెన్నుతట్టి ముందుకు నడిపిస్తున్న

నా ఆత్మీయ సోదరుడు శ్రీ మనిమిద్దె రామకృష్ణ స్పందన గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. నా అభ్యున్నతి కోరుతున్న నా కుటుంబసభ్యులకు, మరియు నా తోబుట్టువులకు, మావారి తోబట్టువులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులందరికీ పేరుపేరునా ధన్యవాదములు. నా కొడుకులు కోడళ్ళకు, నా తదుపరి ప్రతినిధులు నా నవ్వులపువ్వుల వెన్నెల హాసితాలు నా ప్రతిబింబాలైన మా శారద వెన్నెల వనంలో మాలతీ లతలకు ఇప్పుడే అంకురిస్తున్న అంకురాలు పువ్వులై కవితా కుసుమ మాలికలవ్వాలని ఆశిస్తూ నా మనమడు హనుమ విరించి,మనుమరాళ్ళు త్రైలోఖ్య, అవని, లక్ష్మీ వైష్ణవిలకు శుభాశిస్సులు. నా బంధు మిత్రులు,శ్రేయోభిలాషులందరికీ పేరు పేరునా నా ధన్యవాదాలు. నా పుస్తకాన్ని డి.టి.పి. చేసిన ఆత్మీయ సోదరుడు శ్రీనివాస్ మోని గారికి, నా బుక్ గ్రాఫిక్స్ చేసిన కమల్ గ్రాఫిక్స్ గారికి, ప్రింటర్స్ వారికి, సాహిత్యపరిషత్ కవులు,వెన్నెల సాహితీ సంఘం,సుగుణ సాహితీ సంస్థ,అక్షరయాన్ గ్రూప్ మొదలుకొని అన్ని గ్రూప్‌ల కవయిత్రులందరికీ, అక్షరయాన్ రథసారథి శ్రీ ఐనంపూడి శ్రీలక్ష్మి గారితోపాటు అక్షరయాన్ కవయిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదములు.

నేను ఆడపిల్లను అక్షరంగా........

పడతులను పదంగా.........

వనితలను వేకువ వాక్యంగా........

నా మనసు దీపంతో వెలిగించాలనే తపనతో “రెప్ప వెనుక స్వప్నమై” పాఠక హృదయాంతరాలలో స్పందన కలిగించి మగువల కలలు నిజంకావాలని ఆశిస్తూ మీ ముందు అక్షరీకరించాను. పెద్ద మనసుతో ఆశీర్వదిస్తారు కదూ...!

**మీ**

**సుజాత ప్రసాద్**

# కథా క్రమం


| | |
|---|---|
| జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ | 33 |
| మరో అమ్మ | 40 |
| మాతృత్వపు మమకారం | 48 |
| పరోపకారార్థ మిదం శరీరం | 56 |
| అమ్మ మనసు | 60 |
| తెలుగు తల్లి ఒడిలో | 68 |
| దేవుడిచ్చిన బిడ్డ | 76 |
| చదువులలో మర్మమెల్ల నే చదివితి | 84 |
| తిరగని పొద్దు | 94 |
| వినూత్న | 97 |

# జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ

**నా** ఒడిలో పెరిగి చక్కని విద్యాబుద్ధులు నేర్చుకుని నన్ను నిర్దాక్షిణ్యంగా వదలి పై చదువులకనీ వలసవెళ్ళిపోతున్నారు పిల్లలు. విదేశీ వ్యామోహంతో స్టేటస్ కోసమని ఉద్యోగాల పేరుతో మరెంతో మంది వెళ్ళిపోతున్నారు. రెక్కలు వచ్చిన పక్షులు ఎగిరిపోయినట్లు వెళ్ళిపోతున్నారులే అనుకుని సరిపెట్టుకున్నాను. కానీ ఈ తల్లిని విడిచి వార్ధక్యం మీద పడి ముక్కుతూ మూలుగుతూ కాలక్షేపం చేస్తున్న వృద్ధమాతవు, నువ్వు ఎందుకమ్మా వెళ్ళిపోతున్నావు... ఏం బావుకుందామని! పిల్లలని వదిలి ఉండలేక అంటావా! వట్టిపోయిన గోమాత లాగ మరి ఈ తల్లిని గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా, బేలగా అడుగుతోంది భారతమాత.

తూలీ ముందుకు పడబోయి నిలదొక్కుకుంది శాంతమ్మ. పలుగు పార పట్టుకుని తవ్వే పురుషుడు పడ్డప్పుడు, 'ఆ బాగా పడ్డావులే' అంటుందట... అదే ఆలికి ముగ్గువేసే ఆడది పడితే, 'అయ్యో బిడ్డ పడ్డవా' అంటుందట ఆ భూమాత. అత్తగారు కొత్తగా కాపురానికి వచ్చినప్పుడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి శాంతమ్మకు. లేస్తూనే మంచం దిగుతూ భూమి మీద పాదం మోపుతూ, 'తల్లీ భూమాత నన్ను క్షమించు తల్లీ' అని భూమాతకు నమస్కరించాలట. అలా చేస్తే ఆ భూమాతనే కాపాడుతుందట. తను ఎన్నిసార్లు పడిందో, ఆ తల్లి కాపాడుతోంది. మెల్లగా కూర్చుండిపోయింది.

అలసిన ప్రాణం సేద తీర్చుకోవాలనుకుంటే ఇక్కడ నీకు నేను ఉన్నాను. మరి ఆ పరాయి దేశంలో... భూమాత ప్రశ్నిస్తున్నట్లు ఉంది.

శాంతమ్మ కళ్ళు వర్షిస్తున్నాయి. 'నిజంగా భూమాత నిన్ను పలకరించిందా... అంతా నీ ఊహ' అని, తల్లి వంగి నమస్కరిస్తుంటే చూసి పెద్దకూతురు పారిజాతం వెక్కిరించింది చాలాసార్లు తల్లిని.

పుట్టిన ఊరుని కన్నతల్లిని, పెట్టిన చేతిని, చేసిన మేలుని మరిచిపోకూడదట. కాని ఇప్పుడు అందరూ చేసేది అదే. చివరికి తను అదే చేస్తుంది. కన్నీళ్ళు ఆగనంటు న్నాయి. అంబవైనా నీవేనమ్మా భారతాంబ... జగదాంబవైనా నీవేనమ్మా భారతాంబ... రత్నగర్భినానీ పేరు గాంచితివమ్మా. నేడు రాళ్ళను కన్నావమ్మా భారతాంబ... అన్న పాటని నిజం చేస్తుంది ఇప్పటి యువతరం పోకడ.

'అమ్మా... అలా దిగులుగా కూర్చున్నావెందుకమ్మా! నేను నీ కన్న కొడుకునే కదమ్మా... వచ్చేది నా దగ్గరికేగా... అలా దిగులుపడకమ్మా! ఏదైనా మొదట్లో అదోలా అనిపిస్తుంది. తర్వాత అదే అలవాటవుతుంది. నాన్న పోయాక ఒంటరిగా నీవు ఎలా ఉంటున్నావో అని నాకు బెంగగా ఉందమ్మా! నాన్న పోయి సంవత్సరం అయినాక వస్తానన్నావు కదమ్మా. అన్ని తంతులు జరిగిపోయినాక కూడా ఎందుకమ్మా... నిన్ను ఇలా ఒంటరిగా వదిలి వెళ్ళితే నలుగురు నానారకాలుగా అనుకోవటం ఏమోగాని నిన్ను విడిచి వెళ్ళి ఏదో అపరాధభావంతో నేను బ్రతకలేనమ్మా... నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటామమ్మా! నన్ను నమ్మమ్మా...' అన్నాడు వినయ్, తల్లి భుజం మీద చేయి వేస్తూ అనునయంగా.

'దిగులు ఎందుకు ఉండదు! అన్నీ వదిలి దేశంగాని దేశంలో నీవు ఎంత మంచిగా చూసుకున్నా బంగారు పంజరంలో చిలుక బ్రతుకులాగే ఉంటుందిరా ఈ వయస్సులో రావడం అవసరం అంటావా! ఈ జీవిత చరమాంకం ఇక్కడే గడిపేయాలని ఉందిరా' గొంతు పెగలక గుండెల్ని దాటిన ఆ మాటలు పెగుల్చుకుని వచ్చాయి.

'సరేలే సంతోషంగా ఉండు, ఇంకా టైం సరిపోదు. అన్నీ సర్దుకోవాలి నీ మెడికల్ ఫైలుతో సహా ఏది మరిచిపోయినా కష్టమే. నీ గురించి అందరూ వస్తుంటారు, ఆ హడావుడితో సరిపోతుంది. కొన్నికొన్ని మనసుకు ఇష్టం ఉన్నా లేకపోయినా కాలంతో పరుగు తీయక తప్పదమ్మా... ఇప్పుడే వస్తాను' అంటూ బయటకు వెళ్ళి పోయాడు వినయ్.

మౌనంగా లేచి వాకిలి తుడిచి, తులసికోట కడిగి, ముగ్గు పెట్టుతుంటే చెయ్యి ఒణికింది శాంతమ్మకు. రేపటి నుండి నా ఆలనా పాలనా ఎవరు చూస్తారు! నన్ను వదిలి నువ్వు వెళ్ళినా, నిన్ను నేను ఎలా మరిచిపోతాను! ఆలనాపాలనా లేక నీమీద బెంగతో వాడి కృశించి పోతాను సుమా! అంటూ పుష్పవిలాపంలోని పూలమొక్కలా దీనంగా అంటోంది తులసికోటలోని తులసి మొక్క. 'ఈ అశక్తురాలిని క్షమించు తల్లి' అంటూ కన్నీళ్ళతో చేతులు జోడించింది శాంతమ్మ.

'వసుధ భర్త పోయాడట. మన ఇంట్లో పెరిగిన పిల్ల ఒక్కసారి చూసి వస్తాను రా' దు:ఖం ఆగలేదు శాంతమ్మకు.

'సరే, త్వరగా వచ్చేయమ్మా... నాకు మాత్రం పంపాలని లేదు. ఈ సమయంలో ... సరే వెళ్ళిరా...' విసుగ్గానే అనేసి వెళ్ళిపోయాడు వినయ్.

జనం ఏడుస్తున్నారు. వసుధ భర్త మంచితనాన్ని చెప్పుకుంటూ కంటతడి పెడుతున్నారు. అన్ని కార్యక్రమాలు జరిగిపోయాయి. 'అమెరికాకు వెళ్తున్నావట గదా! నీకెందుకమ్మా, 'కృష్ణా రామా' అని కాలక్షేపం చేసుకోక మరీ చోద్యం కాకపోతే' బుగ్గలు నొక్కుకుంటూ అడుగుతోంది పక్కింటి పార్వతమ్మ.

'భారతదేశం పుణ్యభూమి అంటారు. ఈ పుణ్యభూమిలో కలిసిపోతే పునర్జన్మ ఉండదని విదేశీయులు సైతం మన కాశిలో కలిసిపోవడానికి వస్తారు. నువ్వేమిటమ్మా అక్కడ తనువు చాలించాలంటూ వెళ్తున్నావు. అక్కడ నీకు ఏమన్నా అయితే, దిక్కు దివాణం ఉండదు. నీకోసం ఏడ్చేవాళ్ళు కూడా ఉండరు, నీ పిల్లలు తప్ప. అక్కడ ఏదో కరెంటు కుర్చీలో కూర్చోబెడతారట. క్షణంలో బూడిదేనట. ఇన్ని ఏళ్ళు ఇక్కడ బతికి ఏం లాభం... ఇంత బతుకు బతికి ఇంటెనుక చచ్చినట్లు ఏం కర్మ! చెప్పు తప్పుగా తీసుకోకమ్మా, నాకు తోచింది చెప్పానమ్మా!' లెంపలు వేసుకుంటూ మరొకరు.

'అంటే ఇదేనా నిన్ను ఆఖరిసారిగా చూడటం, ఇంకా నిన్ను చూడమా...' అక్క అంది. అలివేలు ఆ కళ్ళలో సన్నటి నీటిపొరా, అన్నింటికీ చిరునవ్వే సమాధానంగా పెదాలని నవ్వుని అతికించుకుని చెప్పింది శాంతమ్మ. శాంతమ్మ మనసు ఎంత వర్తమాన కాలాల్లో ఆలోచించుకున్నా గతంలోకే పరుగుతీస్తుంది. ఉన్న బంగారం అంతా అమ్మి లోను పెట్టి, పార్ట్ టైం చేసి రాత్రి పగళ్ళు కష్టపడి ఈ ఇంటిని కొన్నాడు రఘురామయ్య. తన అభిరుచికి తగ్గట్లుగా ఇంటిముందు కొబ్బరి, అరటి ఎన్నో రకాల పూలచెట్లు, ఇంటివెనక పనస, మామిడి, జామ, సపోటా, నారింజ చెట్లను

పెంచాడు. ఏ కాస్త తీరిక దొరికినా వారికి ఆ చెట్ల మధ్య కాలక్షేపం, వెలుగురేకులు విచ్చుకోక ముందే లేచి ఆ చెట్ల కింద నులక మంచం వేసుకుని కూర్చునేవాడు.

'ఇంత పొద్దున్నే ఎందుకండీ లేవడం, మంచు పడుతుంది.. అలా చెట్ల కింద కూర్చోకండి...' విసుక్కునేది శాంతమ్మ.

'ఆ పక్షుల కువకువలు, మామిడి చెట్ల మీదుగా వచ్చే సువాసనలు... ఆ గాలి కొబ్బరి చెట్ల ఆకుల నుండి జాలువేరే మంచు బిందువులు... నీకు ఎలా చెబితే అర్థం అవుతుంది!' అనేవాడు.

'నిజమే నాకు అర్థం కాదు. ఈ పిల్లలతో ఈ చాకిరీ నాకు సరిపోతుంది. నాకు అంత తీరిక లేదు' విసురుగా వెళ్ళిపోయేది శాంతమ్మ.

'శాంతా... నేను లేని ఈ రెండురోజులు మొక్కలకి నీళ్ళు పోయలేవూ... చూడు ఈ మొక్కలు ఎంత అల్లాడిపోతున్నాయో... మొక్కలని పెంచడం కష్టం కాదు. వాటి గొంతులో గుక్కెడు నీళ్ళు పోస్తూ వాటి ఆలనాపాలన చూస్తే అవి రేపు నీకు ఎంతటి ఫలితాన్నిస్తాయో తెలుసా... కన్నపిల్లలైనా రేపు మనల్ని సరిగ్గా చూస్తారో చూడరో కాని ఈ మొక్క అలా కాదు. నీడ నిచ్చి సేద తీరుస్తాయి. ఆకలిని తీరుస్తాయి. వాటిపట్ల ఇక ముందైనా శ్రద్ధ చూపు'... మొక్కలకి నీళ్ళు పోస్తూ మందలించాడు. నొచ్చుకుంది. భర్త మందలించినందుకు కాదు. గుక్కెడు నీళ్ళు పోయనందుకు, ఎంతో అపరాధభావంతో. మామిడి, పనస ఏపుగా పెరిగాయి. ఫలవంతమైన ఆ చెట్లని చూస్తుంటే ఆ కళ్ళల్లో ఎంత ఆనందం. కొబ్బరి కూడా విరగ కాచేది. అలా ఏళ్ళు గడిచాయి. పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయి. వాస్తు బాగ లేదు వెనకాలా మెట్లు మార్చాలంటే పనస చెట్లని, మామిడి చెట్లని కొట్టేయాలని పట్టుబట్టారు ఇద్దరు మగపిల్లలు శ్రీను, వేణు.

'శాంతా ఈ పిల్లలని చూడు ఇవాళ మనకే ఎదురు తిరిగారు. నా ప్రాణంలో ప్రాణమైనది కొట్టేస్తే నేను... నేను బతుకలేను...' రఘురామయ్య కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

'ముగ్గురు పిల్లలు చాలంటే' భర్త ముఖంలోకి చూస్తూ ఆగిపోయింది ఆనాడు.

'శాంతా నారు పోసినవాడు... నీరు పోయకమానడు. పిల్లపిల్లకే ఆదాయం పెరుగుతుంది. ఆ మాట ఇంకా అనకు' అన్నాడు. ఫలభరితమైన చెట్లని చూపిస్తూ నవ్వుతూ 'చూడు అవి నీలా ఆలోచించాయా' అని.

కాని తన ఆలోచనా విధానమే తప్పని ఆలస్యంగా తెలుసుకున్నాడు. అధిక సంతానం దు:ఖానికి హేతువు. శ్రీను, వేణు, వినయ్ ముగ్గురు మగపిల్లల తర్వాత పారిజాత, సరిత, శోభ ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. ఉన్నదంతా ఖర్చుపెట్టి ఆడపిల్లల, మగపిల్లల చదువులు, పెళ్ళిళ్ళు చేశాడు. ఆరుగురు ఆరు తరహాలు. గతం చెదిరింది. భర్తని ఎలా అనునయించాలో తెలియక మౌనంగా అతడి తల నిమురుతూనే ఉండిపోయింది. తను మాత్రం ఏమి చేయగలదు. తండ్రిని కాదన్న పిల్లలు తల్లి మాట వింటారా! తనకీ బాధగానే ఉంది. ఫలభరితమైన ఆ చెట్లు లేనిచోటు ఊహించుకోలేకపోయింది. ఏడాది తిరగకుండానే రఘురామయ్య కన్ను మూశాడు. ఆ మామిడిచెట్టు, ఆ పనస చెట్టు లేదు. ఆ యజమాని లేడు. కాని, ఆ జ్ఞాపకాలు నీడలా వెంటాడుతూనే ఉంటాయి.

'అమ్మా' అనగానే గతంలోంచి ఈ లోకంలోకి వచ్చి చేరింది శాంతమ్మ. చివరి ప్రయత్నంగా 'నేను ఇక్కడే ఈ ఇంట్లోనే ఉంటానురా... ఆడపిల్లలు వచ్చి చూసి వెళ్తారు అప్పుడప్పుడు. నేను నీతో రాలేనురా... పెదవి దాటనీ ఆ మాటలని కంఠం నొక్కేసింది. 'అమ్మా నువ్వు నాతోనే ఉంటావు. ఇంకేదో చెప్పాలని చూడకు నిన్ను నేను ఏ లోటు లేకుండా చూసుకుంటాను. ఇంకేమీ ఆలోచించకు మరోసారి చెప్పాడు వినయ్. శ్రీను ఎప్పుడో వెళ్ళిపోయాడు విదేశాలకి. వేణు వెళ్లేది మరో దేశమట. చాలా దూరమట. మనుష్యులకి కాని, దూరభారాలు మనసులకు కాదుగా. అలాంటప్పుడు మమతానురాగాలు పంచుకోవడానికేం... ఎందుకింత పట్టుదలలు, పంతాలు... ఒకరి వెనుక ఒకరు విమర్శలు, వేళాకోలాలు. రక్తసంబంధీకులేనా వీళ్లు?... అక్కా, చెల్లి, అన్నా, తమ్ముడు అని పిలుపులు లేవు. అదిగో పెద్దాడి నుండి వచ్చింది. పెద్దవాడు వచ్చాడు. చిన్నది, చిన్నోడు వచ్చారు. ఇదేనా రక్త సంబంధం. అనుబంధం ఆత్మీయతా ఏవి లేవా...

నా భర్త, నా భార్య, నా పిల్లలు ఇంతేనా కుటుంబం అంటే. ఎవరింటికీ ఎవరు వెళ్ళరు. పిల్లల్ని కదలనివ్వరు. ఎంతసేపు చదువు, పరీక్షలు, ఇతర వ్యాపారాలు ఇదేనా వీళ్ళనుండి ఆశించేది. ఆయన ఉన్నప్పుడు దీపావళి వస్తే ఎంతో సందడిగా ఉండేది. అందరూ ఎక్కడున్నా రావలసిందే... అందరికీ సరిపడా అరిసెలు దగ్గరుండి మరీ చేయించేవారు. నవ్వులతో, కేరింతలతో ఎలా ఉండేది ఇల్లు. ఇప్పుడు... ఈ పిల్లల కోసమా తను బాధపడేది... గుండె బరువెక్కింది.

'అమ్మా... ఏం చేస్తున్నావు?' హడావుడిగా వచ్చారు పిల్లలు.

'ఇండియా ఈజ్ మై కంట్రీ... ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్' మూడేళ్ళు నిండని మనవరాలు త్రైలోక్య ముద్దుముద్దుగా చెపుతుంది. అందరూ నవ్వు తున్నారు దాని ముద్దుమాటలకు. తల్లి వనజ బంగారు కన్నమ్మ అని ఎత్తుకుని ముద్దు లాడింది. ఆ పదం అర్థం తెలియదు ఆ తల్లిదండ్రులకి. ఒక కడుపున పుట్టిన పిల్లలు వాళ్ళల్లో వాళ్ళకే బ్రదర్స్, సిస్టర్స్ అనే మమతానురాగాలు లేవు. ఇంకా దేశంలోని ఆల్ ఇండియన్స్ అంతా బ్రదర్స్, సిస్టర్స్ ఆహా... శాంతమ్మ పెదాల మీద నవ్వు వచ్చింది. ఆడపిల్లలు అమ్మను పట్టుకుని 'అమ్మా... బెంగగా ఉందే' అని కంట తడిపెట్టారు.

'జాగ్రత్తగా ఉండండీ. డబ్బుతో కొనలేనిది ప్రేమ ఆప్యాయతలు. రక్తసంబంధాన్ని మించింది ఏదీ లేదు. ప్రేమానురాగాలను మరిచి ఏదో కావాలని, లేని దేనికోసమో పరిగెట్టాలని ప్రయత్నించకండి. పట్టుదలలు, పంతాలు మాని అహంకారాన్ని వదిలి ఆరుగురూ ఒకటిగా బ్రతకండి. ఇదే తల్లిగా నేను మీ నుండి కోరే కోరిక.. పిల్లలు జాగ్రత్త, మీరు జాగ్రత్త... అంటూ మెల్లిగా లేచి తులసి కోట దగ్గరికి వెళ్ళి మెల్లిగా చెట్లని నిమిరింది. తులసి చెట్టు వాడింది ఎందుకో... వెళ్ళొస్తా తల్లీ... కాదు నేను వెడుతున్నానమ్మా... కన్నీరు ఇపుడు వచ్చింది. కొబ్బరి, సన్నజాజి, పారిజాతాలు, గులాబీలు మౌనంగా తమ విషాదాన్ని తెలుపుతూ వీడ్కోలు చెబుతున్నాయి. ఇన్నేళ్ళు మీతో కలిసి బతికాను, మీకు చేసిన సేవ తక్కువే, ప్రతిఫలం మాత్రం ఎక్కువే పొందాను. మీ ఆలనా, పాలనా రేపటి నుండి ఆ దేవుడు చూడాలి. ఆ వానదేవుడే కరుణించాలి. కన్నీటి మధ్య ఆకాశం వైపు చూస్తూ నమస్కరించింది.

ఎంతోమంది వచ్చారు. ఇదే ఆఖరి వీడ్కోలు అన్నట్టుగా ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. తల్లిగా ఒదిలి నువ్వు వెళ్ళిపోతున్నావు. ఇలా వృద్ధాప్యంలో కూడా మీరు వెళ్ళిపోయి నన్ను బాధపెట్టటం ఏం న్యాయం.. నేను భరించగలనా! కసాయివాడిని నమ్మి తన లేగదూడను విడిచి పోతున్నట్లుగా కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంది. భారతమాత. తన లేగదూడతో పాటు తాను కూడా బ్రిటిష్ వాడికి బానిసలా ఊడిగం చేయడానికి పోతున్నట్లు మనసులో మూగగా రోదిస్తుంది. శాంతమ్మ భూదేవికి వంగి నమస్కరించి 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అని మనస్సులో పదే పదే వల్లిస్తూ కారు ఎక్కింది బరువైన గుండెతో. అయిపోయింది. ఈ ఇంటికీ, ఈ ఊరికీ, ఈ దేశానికీ,

తనకీ ఋణం తీరిపోయింది. ఆ ఊహ గుండెల్ని పిండేస్తుంది. రేపటి రోజు గురించి ఆలోచించలేక కళ్ళు మూసుకుంది.

ఎయిర్‌పోర్ట్ చేరారు అంతా. అంతా ఏడుస్తున్నారు. శాంతమ్మ వాళ్ళనెవరినీ చూడడం లేదు. ఆకాశంవైపు, భూమివైపు మార్చిమార్చి చూసి లోపలికి వెళ్ళిపోయింది కొడుకును అనుసరిస్తూ. అంతా హడావుడిగా ఉంది. ఆవును వదిలిన లేగదూడలాగా ఇంకొద్దిసేపు అంటే ఈ దేశాన్ని ఒదిలి తను వెళ్ళిపోతుంది. మళ్ళీ తను తన మాతృభూమిని చూస్తుందో లేదో... అక్కడే కళ్ళు మూస్తుంది. తన కోసం కన్నీరు కార్చేవారుండరు. ఎవరు నాకు అన్నీ యధావిదిగా చేయరా... కరెంటు కుర్చీలో కూర్చోబెట్టి బూడిద... వద్దు... వద్దు... అరిచాననుకుంది.

'అబ్బా...' గుండెల్లో గునపంతో పొడిచినట్లు కలుక్కుమంది.

'నాన్న నాన్నా నానమ్మ...' త్రైలోక్య అరిచింది. వినయ్ తన సీటు వదిలి తల్లి దగ్గరికి వచ్చాడు కంగారుగా. పరిస్థితి అర్థమైనది తనెంత తప్పు చేసాడో...

ఉరుకులతో,పరుగులతో శాంతమ్మను ఎయిర్‌పోర్టు లోకి తెచ్చారు. పిల్లలూ, వచ్చిన బంధువులంతా ఎవరూ ఇంకా వెళ్ళలేదు. అందరూ శాంతమ్మని చుట్టుముట్టారు ఏడుస్తూ. అంత బాధలోనూ శాంతమ్మ"జననీజన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసి" అంటూ తేరిపారా తృప్తిగా చూసింది. ఆమె నవ్వుతున్నట్లు పెదవులపై నవ్వు మెరిసింది. తన తల్లి ఒడిలోనే తనువూ చాలిస్తున్నానన్నట్లుగా తృప్తిగా ఆ చూపులు చుట్టూ పరికించాయి. ఆకాశం వైపు, భూమి వైపు చూసింది.

'ఎలా ఉందమ్మా, చెప్పు. నీకేం ఫర్వాలేదు!' వినయ్ కన్నీటి మధ్య అన్నాడు.

శాంతమ్మ పెదవుల మీద అదే చెరగని చిరునవ్వు. ప్రపంచాన్ని జయించినంత సంతోషం. తను తన దేశాన్ని వదిలిపెట్టి వెళ్ళలేదు. భారతదేశము నా మాతృభూమి... ఆ పెదాలు కదులుతున్నాయి అతికష్టం మీద. ఇది చాలు నాకు. ఇంకేం అక్కర్లేదు అన్నట్లుగా తృప్తిగా చూసింది. అంతే... శ్వాస ఆగిపోయింది. ఎంత అదృష్టవంతురాలు శాంతమ్మ అనుకుంటున్నారు అంతా.

*(2015 సంవత్సరం వరంగల్*
*ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక;*
*జలదంకి సుధాకర్ భార్య సంస్మరణ సందర్భంగా*
*నిర్వహించిన కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ)*

# మరో అమ్మ

**"నాస్తి మాతృసమం దైవం**
**నాస్తి మాతృసమ: పోజ్యో,**
**నాస్తి మాతృసమో బంధు**
**నాస్తి మాతృ సమో గురు:"–**

అని దగ్గరలోని కస్తూరిభా వృద్ధాశ్రమం నుండి లీలగా ఈ శ్లోకం చెవులకు సోకుతుండగా,, (అమ్మతో సమానమైన పూజ్యులు గానీ, దైవంగానీ లేరు) తల్లిని మించిన బంధువులుగానీ, గురువులు కానీ లేరు) (తల్లీ కన్పించే దేవత). ఘణ... ఘణ... మని ల్యాండ్‌ఫోన్ అదే పనిగా మ్రోగుతున్నా విన్పించనంత తన్మయత్వంతో వింటున్న నాకు పరుగున వెళ్ళి ఫోన్ అందుకున్న నాకు బాబు నుండి ఫోన్.

"అమ్మా! నాన్నగారి సంవత్సరీకం కూడా అయిపోయిందిగా... ఇప్పుడైనా మాతోపాటు వస్తావా అమ్మా...?"

"........."

"ఏంటమ్మా! ఏం మాట్లాడవు... ఇంకా దేని గురించి నీ ఆలోచన..?" ఏం చెబుతుందోనని ఆత్రంగా తల్లి మొహంలోకి చూశాడు దామోదర్.

"ఇప్పటికిప్పుడంటే ఎలారా నానా... పొలం కౌలు గురించి మాట్లాడాలి.

ఉన్నపళంగా ఇల్లు వదిలివస్తే ఎలా... అనవసరమైనవి వదిలించి అవసరమైన సామానంతా ఓ గదిలో సర్ది మిగిలిన ఇల్లు ఎవరికైనా అద్దెకిస్తే... ఎవరో ఒకరు ఇల్లు కనిపెట్టుకుని ఉంటున్నారన్న ధైర్యం ఉంటుంది. ఇంత మొక్కలకు నీళ్ళు పోస్తూ.. ఇంట్లో దీపం వెలిగించే వారెవరైనా దొరుకుతారేమో చూస్తాను" మౌనంగా ఉన్న కోడలు వైపు చూస్తూ అంది.

సరే "ఆ పనులన్ని త్వరగా పూర్తయ్యేలా చూడమ్మా!... నాకు ఎక్కువ రోజులు లీవ్ పెట్టడానికి కూడా కుదరదు. మళ్ళీ వచ్చి నిన్ను తీసుకెళ్తాను" అన్నాడు.

"సర్లేరా, నువ్వంతగా చెప్పాలా. నీ దగ్గరికి కాక, నేనెక్కడికి పోతానురా చెప్పు" అంటూ మురిపెంగా కొడుకువైపు చూసింది ఆండాలమ్మ.

వెంకటయ్య, అండాళమ్మ దంపతులకు ఒక కొడుకు, కూతురు. ఉన్న కొద్దిపాటి పొలంతోపాటు మరికొంత కౌలుకు తీసుకొని ఎంతో కష్టనష్టాలకోర్చి కొడుకుని ఎం.టెక్, కూతుర్ని డిగ్రీవరకు చదివించారు. డిగ్రీ కాగానే కూతురి అందాన్ని చూసి దామోదర్ ఫ్రెండ్ సుధాకర్ ఇష్టపడి మరీ పెద్దలనొప్పించి పెళ్ళి చేసుకున్నాడు. దామోదరానికి మంచి జీతంతో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం రాగానే ఓ ధనవంతుల సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. అల్లుడికి కొడుక్కి ఐదంకెల్లో జీతం రావటం, వాళ్ళు జీవితంలో బాగా సెటిలై పిల్లా పాపలతో సంతోషంగా గడపటం చూసి విధికి కన్ను కుట్టిందేమో! రోడ్డు ప్రమాదంలో తలకి బలంగా దెబ్బ తగలటంతో వెంకటయ్యను హాస్పిటల్‌కి తీసుకెళ్ళేలోపు మరణించాడు. తనని ఒంటరిదాన్ని చేసి భర్త అంత హఠాత్తుగా దూరమవటాన్ని తట్టుకోలేకపోయింది ఆండాళమ్మ. కోలు కోవటానికి చాలాకాలం పట్టింది.

తల్లిని ఆ స్థితిలో చూసి తట్టుకోలేకపోయాడు దామోదర్. "ఒక్కదానివే ఇక్కడ ఎందుకమ్మా... మాతోపాటు వచ్చేయ్" అని ఎన్నోసార్లు బతిమిలాడాడు దామోదర్.

"ఇప్పుడు నాకెక్కడికి రావాలని లేదురా. నాన్న జ్ఞాపకాలతో నన్నిక్కడే ఉండనియ్యి. అంతగా అయితే కొద్దిరోజులాగాక చూద్దాంలే" అంది. ఆ తర్వాత "సంవత్సరీకం కానీయ్" అంది. అందుకనే సంవత్సరీకం కాగానే తల్లిని తనతో తీసుకెళ్ళాలని అడిగాడు.

ఇంతలో దాక్షాయణి కలుగజేసుకుని.. అమ్మా అన్నయ్యతో చెన్నై వెళ్ళావంటే మళ్ళీ ఎప్పుడొస్తావో ఏమో... నాన్న ఉన్నపుడు ఇద్దరు కలిసిరావడమే, నువ్వు మా యింటికి వచ్చి కూడా చాన్నాళ్ళు అవుతుందమ్మా.. పిల్లలు నిన్ను మరీ మరీ

గుర్తుచేస్తున్నారు. ఓసారి రావమ్మా! మా యింటికి" అంటూ ఫోన్ చేసింది కూతురు దాక్షాయణి. దాక్షాయణి ఫోన్‌చేసి పదేపదే అడగటంతో ఓ మంచిరోజు చూసుకొని తెలిసినవాళ్ళు హైదరాబాద్ వెళ్తుంటే వాళ్ళతోపాటు బయలుదేరింది ఆండాళమ్మా.

అల్లుడు స్టేషన్‌కి వచ్చి ఇంటికి తీసుకెళ్ళాడు.

"బాగున్నారా వదినగారూ...?" అంటూ పలకరించిన వియ్యపురాలు యశోధమ్మని చూసి విస్తుపోయింది ఆండాళమ్మ.

"నిండుగా పుష్టిగా ఉండే యశోదమ్మగారేనా ఇంతలా చిక్కిపోయారు. ఎలా ఉండే ఆమె ఇలా అయ్యారేంటి" అనుకుంటూ "బాగున్నాను వదినగారూ... మీరు బాగున్నారా" అన్నయ్య పోయిన దిగులుతో మీరు చాలా చిక్కిపోయినట్లున్నారు అంటూ పలకరించింది.

"అమ్మమ్మా..." అంటూ పరుగున వచ్చిన మనవడిని, మనవరాలినీ చూసి ఉండడ్రా,,, మా బంగారాలు రాత్రంతా ప్రయాణం చేసి వచ్చాను కదా! స్నానం చేసి వస్తాను" అంటూ బ్యాగ్ తీసుకొని లోపలికి వెళ్ళింది.

స్నానం చేసి పిల్లలతో కబుర్లు చెబుతూ టిఫిన్ తిని, కాఫీ తాగుతూ యశోధమ్మనే గమనించసాగింది. ఇల్లు ఊడ్చి తుడవటం, వాషింగ్ మిషన్లో బట్టలు వెయ్యటం, కూరలు తరిగి వంటచేయటం, అంట్లన్నీ తోమి తుడిచి సర్దిపెట్టటం దగ్గర్నుండీ అన్ని పనులూ చేస్తున్న యశోధమ్మని చూసి "అదేమిటి వదినగారూ... ఈ పనులన్నీ మీరు చేస్తున్నారు. పనిమనిషి దొరకటం లేదా?" ఆశ్చర్యంగా అడిగింది ఆండాళమ్మ.

"లేదమ్మా.. మానేసింది" అంది దాక్షాయణి.

కూతురి సమాధానం విని "ఎందుకు మానేసింది? ఎన్నో ఏళ్ళుగా సొంతమనిషిలా నమ్మకంగా పనిచేస్తుంది కదా!" అంది.

"ఒంట్లో బాగుండటం లేదని రెండేళ్ళనుండి రావటం లేదు".

"మరి ఇంకెవరినైనా పనికి పెట్టుకోలేకపోయావా అమ్మా... ఏదో ఒకరోజో రెండ్రోజులో అయితే ఎలాగో చేసుకోవచ్చుగానీ, రోజూ ఇంట్లో పనంతా చెయ్యాలంటే మాటలా... అందులోనూ మీ ఇల్లు చాల పెద్దది. పైగా ఇంటిచుట్టూ మొక్కలు కూడా పెంచుతుంటారు. పిల్లలతో ఇంత పని చెయ్యాలంటే కష్టం కదా!"

"చాలామందిని అడిగి చూశాను., ఎవ్వరూ దొరకటం లేదమ్మా. పనివాళ్ళున్నా లేకపోయినా మన పని మనకి తప్పదు కదమ్మా!" అని నవ్వింది దాక్షాయణి.

తనేదైనా పని అందుకోబోతే కూతరుతోపాటు యశోదమ్మ కూడా అడ్డుపడి చెయ్యనివ్వటం లేదు. ఒకరోజు సాయంత్రం యశోదమ్మ పెరట్లో మొక్కలకి నీళ్ళు పోయటం చూసి తల్లి పక్కన చేరింది దాక్షాయణి.

"అమ్మా! మీ అల్లుడు గారు ఈవిడ గారిని ఇక్కడకు శాశ్వతంగా తీసుకుని వచ్చేశాడు. ఈమధ్య ఆరోగ్యం కూడా అంత బాగుండటం లేదు కదా! ఒక్కదానివే అక్కడెందుకు? అని తీసుకొచ్చి దిగబెట్టాడు. తప్పనిసరి తద్దినంలా ఈవిడగారిని భరించాల్సింది నేనేగా... ఇక్కడ నేనేదో ఒపిగ్గా ఉండి అందరికీ చాకిరీ చేసేదానిలా కనిపిస్తున్నానేమో. అందుకే నాకు ఒళ్ళు మండి కావాలనే పనిమనిషిని మానిపించాను. మా అత్తగారికి తను స్వయంగా చేసుకుంటే తప్ప, మరొకరు చేసే ఏ పని నచ్చదు... నువ్వు చేసినా మళ్ళీ తను చేసుకుంటుంది. కొన్నాళ్ళపాటు రావద్దు. అంతగా అవసరమైతేనేనే కబురు చేస్తాన్లే అని చెప్పాన్లే పనిమనిషికి. ఇకనుండి ఈవిడగారికి ఇన్ని జరిపి మళ్ళీ పనిమనిషికి అంతంత జీతాలివ్వటం ఎందుకు... వాళ్ళ ఊళ్ళో ఉన్నప్పుడు పనిమనిషి లేకుండా ఇంట్లో పనంతా తనొక్కతే చేసుకోలేదా ఏంటీ... అక్కడ చేసినట్లే ఇక్కడా చేస్తుంది. అంతే కదమ్మా!" అంది.

కూతురి మాటలకి కళ్ళు పెద్దవి చేసుకుని విస్తుపోయి చూసింది ఆండాళమ్మ.

"అమ్మా అక్కడున్న పొలం అమ్మేసి పిల్లలిద్దరి పేరున ఇక్కడ రెండ్లు ప్లాట్లు తీసుకున్నాడాయన. ఇల్లు కూడా బేరం పెట్టాం. దాన్ని కూడా అమ్మేసి, ఆ వచ్చిన డబ్బును పిల్లలిద్దరి పేరు మీద ఫిక్సేడ్ డిపాజిట్ చెయ్యాలను కుంటున్నాం. అన్నట్టు మరిచాను. అన్నయ్య కూడా నిన్ను చెన్నై తీసుకెళ్ళాక మన ఊళ్ళో ఉన్న యిల్లు, పొలం అమ్మాలని అంటున్నాడు. ఒకవేళ అవి కానీ అమ్మటం జరిగితే నాకు కూడా వాట ఇవ్వాలి ముందే చెబుతున్నాను. ఇవ్వకపోతే ఊరుకోను. వాడికెలా నచ్చచెప్పుకుంటావో నీ ఇష్టం" అంది.

ఆ మాటలు విన్నాక ఇక కూతురు చెప్పేవేమి బుర్రలోకి ఎక్కటం లేదు. ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయింది. మర్నాడు సాయంత్రం దాక్షాయణి ఫ్రెండ్స్ కాబోలు ఇద్దరు ఆడవాళ్ళు వస్తే హాల్లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళొచ్చిన విషయం తెలియక ఉతికిన బట్టలు మడత పెట్టి ఎవరి గదుల్లో వాళ్ళవి సర్దటానికని హాల్లో నుండి బెడ్రూంలోకి వెళ్ళింది యశోధమ్మ. ఆ తర్వాత పెరట్లోకివెళ్ళిపోయింది. ఆ వచ్చినవాళ్ళలో ఒకామె వెళ్తూవెళ్తూ మొక్కలకి పాదులు చేసి నీళ్ళు పెడుతున్న

యశోదమ్మని చూసి "మీ పనిమనిషి అన్ని పనులు ఎంతో చక్కగా బాధ్యతగా చేస్తుందే... మాక్కూడా ఎవరైనా దొరుకుతారేమో కాస్త కనుక్కో" అంది.

దాక్షాయణి ఆ మాటలు విననట్లే వెంటనే టాపిక్ మార్చి గేట్ వరకు సాగనంపింది. "ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు వాళ్ళకు ఎదురుపడవద్దని చిలక్కి చెప్పినట్లు ఎన్నిసార్లు చెప్పినా ఈవిడింతే... చూసినవాళ్ళంతా 'పనిమనిషా' అని అడుగుతుంటే ఏం చెప్పాలో అర్థం కాక చస్తున్నాను. ఇంకా ఎన్నాళ్ళు భరించాలో ఈవిడగారిని" అంటూ యశోధమ్మ స్నానానికి వెళ్ళటం చూసి తల్లి ముందు విసుక్కుంది దాక్షాయణి.

ఇంట్లో ఇంతకుముందు ఉన్న పరిస్థితికీ ఇప్పటి పరిస్థితికీ చాలా తేడా కన్పించింది అండాళమ్మకి. ఓ వారం పదిరోజులు మనవడూ మనవరాలితో సరదాగా గడపాలని వచ్చిందల్లా ఐదో రోజే తిరుగు ప్రయాణ మైంది. పదిరోజుల తర్వాత కూతురికి ఓ ఉత్తరం రాసింది ఆండాళమ్మ!

అమ్మా! దాక్షాయణి...!

అన్నయ్యతో చెన్నైకి రాను.. ఇక్కడే ఉంటానని చెప్పావట కదమ్మా!... ఎందుకని అని నువ్వు నన్ను ఎన్నిసార్లు అడిగినా ఎలా చెప్పాలో అర్థం కాక ఇప్పుడిలా నీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. నిన్ను చూస్తుంటే చాలా మారిపోయావు అనిపిస్తుంది. నీలో ఉండే జాలి, ప్రేమా, కరుణా నేను నేర్పిన నడవడిక ఏమైపోయాయో అర్థం కావడం లేదు. ఇంత సగటు మనస్తత్వంతో నీవు ఎలా మారావని ఆశ్చర్యపోతున్నాను.

చిన్నతనంలోనే భర్త చనిపోతే ఎన్నో కష్టాలు పడి ఆశలు కోరికలూ చంపుకుని తినీ తినకా ఉన్నగానొక్క కొడుకుని ఇంతవాడిని చేసింది మీ అత్తగారు. వయసుడిగి, శక్తి నశించి, ఆరోగ్యం బాగాలేదని పరిస్థితిలో కొడుకు ఆధరణ కోసం వస్తే చివరిరోజుల్లో ఆమెని నువ్వెంత బాధపెడుతున్నావో నీకేమైనా అర్థమవుతుందా...?

తిండి తిప్పలు, బట్టలు, మందులు అన్నీ మేమే చూసుకోవాలిగా అన్నావే... ఆమె కూడా ఇంచుమించు నా వయసుదే కదా... ఈ వయసులో మాలాంటి వాళ్ళు ఎంత తింటాం చెప్పు... ఆమె తినే ఆ నాలుగు మెతుకులు నీకు భారం అనిపించిందా. మీరంతా తినగా మిగిలిపోయినంత లేదు ఆమె తినే తిండి. రేపేదైనా నా పరిస్థితి బాగాలేక నీ దగ్గర ఉండాల్సివస్తే నాగురించి కూడా ఇలాగే అనుకుంటావామ్మ అమ్మా...!

ఆమె ఆరోగ్యం బాగున్నప్పుడు మీకు మీ పిల్లలకు ఎన్ని చేసి పెట్టలేదు. నీకు సీమంతాలకు, పురుళ్ళకు ఎంత సేవ చేయలేదు. మర్చిపోయావా అమ్మా! ఆడబిడ్డలు లేని తను నిన్నే బిడ్డనుకుని ఎన్ని సేవలు త్యాగాలు చేయలేదమ్మా! మర్చిపోయావామ్మా...?

తను 500/- వాయిల్ చీర కొనుక్కొని నీకు 5000/- పట్టుచీర కొన్నదన్న విషయం మర్చిపోయావామ్మా! మీవారు ఎందుకమ్మా ఇంత ఖర్చుపెట్టి కొన్నావు అని అంటే పంట బాగా వచ్చింది సంతోషంగా కొన్నారురా మన ఇంటి లక్ష్మియే కదరా కోడలు అనేది మా అత్తమ్మ అనేదానివి కదమ్మా!

తనకు బిడ్డలు లేని కారణంగా తీర్చుకోలేని కోర్కెలన్నీ నీకు తెచ్చిపెట్టి అందరికన్నా నా కోడలు బాగుండాలని కోరుకునేది కదమ్మా చివరికి తన కోసం కొనుక్కున్న చీరనైనా దాక్షాయణి నీవు కాస్త పాతబడేవరకు కట్టుకుని మరీ నాకివ్వమ్మా అప్పుడు నేను కట్టుకుంటాను. అనే పెద్ద మనసుగల మాతృమూర్తి అని మర్చిపోయావా అమ్మా! ఇంకా నాదన్నదంతా నీదే కదమ్మా! ఈ నగలు పెట్టుకో అని ఇచ్చి నీవు పెట్టుకుంటే చూసి మురిసిపోయేది అన్న సంగతి మర్చిపోయావమ్మా.

ఎక్కడినుండి వచ్చిందమ్మా నీకు ఇంత కఠినత్వం- ఎవరు బోధపోశారమ్మా నీకు ఈ పైశాచికత్వం. ఇక ఈ వయసులో ఒళ్ళు దాచుకోవటానికి ఏవో నాలుగు సాదా కాటన్ చీరలు తప్ప మాలాంటివాళ్ళకు పట్టుపీతాంబరాలు అవసరం లేదు కదమ్మా... ఆమెకి కొనే చీరలు అన్నీ కలిపినా నువ్వు కొనుక్కునే ఒక్క సాదాచీర మామూలుగా ఇంట్లో కట్టుకునే చీర ఖరీదు కూడా ఉండదు. నెల మొత్తం మీ అత్తగారికి అయ్యే ఖర్చంతా చూసినా మీరు మీ పిల్లలు ఒకరోజు సినిమా చూసి, రెస్టారెంట్లో భోజనం చేసినంత కూడా అవదు. అవునంటావా... కాదంటావా? కడుపునిండా తిండి కూడా తినకుండా కరిగే కొవ్వొత్తిలా మీ భవిష్యత్తు కోసం తాను కరిగిపోతూ మీకు వెలుగు పంచిన మహోన్నతమూర్తి మీ అత్తగారు. ప్రతిక్షణం నీ భర్త కోసం త్యాగాలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఇటు భర్త లేక దాయాదుల కుట్రలకు లోకులనే కాకుల మాటలకు బలి అవుతూ పోరాడుతూ శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలుపడ్తూన్నా ఎంతో ప్రేమగా పెంచుకోబట్టే కదా! నీ భర్త ఈ రోజు లక్షలు సంపాదిస్తూ నిన్ను నీ పిల్లల్ని ఏసి గదుల్లో ఉంచి ఏసీ కార్లల్లో తిప్పగలుగుతున్నాడు.

వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించి అనారోగ్యంతో తన పనే తాను చేసుకోలేక కన్నబిడ్డ దగ్గరికి వస్తే మీ ఇంటిల్లిపాది అందరి పనులు చేయిస్తూ జీతం లేని పని మనిషిని చేస్తున్నావు కదమ్మా! నీకు ఇది న్యాయమా చెప్పు. అటు పనిమనిషిని మాన్పించి మరీ... ఎంత దారుణం. తను రాకముందు నీకు ఇంటిపనికి ఒకరు, వంటపనికి ఒకరు ఉండేవాళ్ళు కదా! వయసులో ఉన్న నువ్వే నీ ఇంట్లో పని చేసుకోలేక ఇద్దరు పనివాళ్ళను పెట్టుకుంటే, వయసు మళ్ళిన మీ అత్తమ్మ ఇంటెడు చాకిరీ ఎలా చెయ్యగలదనుకున్నావమ్మా! అత్తగారంటే తల్లి తర్వాత తల్లి లాంటిదని ఎందుకనుకోవు. ఆమె అత్త కాదు. "మరో అమ్మ" అని తెలుసుకో. ఆమె స్థితిలో నేనే ఉంటే.. ఒక్కసారి ఊహించుకో... నీకెంత బాధ కలుగుతుందో. ఇలా అంటున్నానని కోపం తెచ్చుకోక. అత్తమ్మకో న్యాయం, అమ్మకో న్యాయమా... ఇది భావ్యం కాదు. నేను నిన్ను 21 సంవత్సరాలే పెంచి పెళ్ళి చేశాను బాధ్యత తీర్చుకున్నాను కాని మీ అత్తమ్మ తను తనువు చాలించేవరకు బాధ్యత వహించి మీ కుటుంబ క్షేమం కోసం పాటుపడుతుంది. అలాంటప్పుడు అత్తమ్మను అమ్మలా చూడాలి కాని పనిమనిషిగా కాదు. ఇది తెలుసుకోమ్మా...!

అయినా మాలాంటి వాళ్ళం. ఇంకా ఎన్నాళ్ళుంటాం. ఎన్నేళ్ళు బ్రతుకుతాం. మీరు మమ్మల్ని మంచిగా చూస్తే ఇంకా అయిదు సంవత్సరాలు ఆరోగ్యంగా బ్రతుకుతా మేమో. ఈ వయసులో మాకు ఉండేది ఒకే ఒక కోరికమ్మా... ఉన్న నాలుగు రోజులు కన్నబిడ్డల అభ్యున్నతి కళ్ళారా చూస్తూ మనశ్శాంతిగా బతికి, ప్రశాంతంగా తనువు చాలించాలనే. కానీ మీరు పెట్టే భోజనానికో భోగభాగ్యాలకో ఆశపడి బ్రతుకడం లేదు. కానీ ఈ కాలం ఆడపిల్లలకి భర్తలు కావాలి. వాళ్ళు సంపాదించే లక్షల జీతం కావాలి. వాళ్ళ వెనుకున్న ఆస్తులు కావాలి. కాని వాళ్ళ తల్లిదండ్రులు మాత్రం వద్దు. నోరారా వాళ్ళని అత్తమ్మా! మావయ్యా! అని పిలవటానికి కూడా ఇష్టపడటం లేదు. వాళ్ళని తన యింట్లో పాత వస్తువుల్ని స్టోర్ రూముల్లో పడవేసినట్లు వాళ్ళను స్టోర్ రూమ్‌లో ఉంచుతున్నారు.కారణం. వాళ్ళు పరాయివాళ్ళు, పనికిరాని వాళ్ళు, అంటరానివాళ్ళు. ఇంకా చెప్పాలంటే వాళ్ళు ఒకటి రెండు పోతారని నీరు, భోజనం పెట్టని ప్రబుద్ధులు కోడళ్ళు కూడా ఉన్న సమాజం మన మధ్యలోనే కన్పిస్తుంది. మొన్న ఒక కొడుకు తన తల్లిని బ్రతికి ఉండగానే స్మశానంలో మూట కట్టి పడేసిన విషయం తెలిసి ఈ సంస్కృతి ఎటు పోతుందోఅని శ్రవణకుమారుడు

పుట్టిన దేశం ఇదేనా అనిపిస్తుంది. నువ్వే నీ అత్తగారిని ఓ పనిమనిషిని చేస్తే నీ ఇంటికొచ్చిన వాళ్ళు మాత్రం అలా అనుకోవటంలో తప్పేముందమ్మా. పనిమనిషి కాదు ఆమె మా అత్తగారు... అని చెప్పే సంస్కారం నీకు లేకపోయె... నా కడుపులో పుట్టి, నా పెంపకంలో పెరిగిన నువ్వే ఇలా ఉంటే, ఇక నీ వదిన మాత్రం నన్ను బాగా చూస్తుందన్న గ్యారంటీ ఏంటి... తనూ నీలాంటి ఆడపిల్లే కదా! నేనూ తనకు అత్తగారినే... మీ భాషలో చెప్పాలంటే 'తప్పనిసరి తద్దినాన్నే' కదమ్మా! నా పెంపకంలో న్యాయం, ధర్మం, పాపం-పుణ్యం అని ఎన్నో ధర్మసూక్తులు నేర్చుకున్న నీవే ఇలా ప్రవర్తిస్తే ఏది తెలియనివాళ్ళు ఇలా ప్రవర్తించడం అతిశయోక్తి కాదేమో. ఇది నా పెంపకం లోపమేమో అని నేను సిగ్గుపడుతున్నానమ్మా!

ఉన్న ఆస్తులు వదులుకొని మీ ఇళ్ళకి వచ్చి మీ ఇళ్ళల్లో సేవలు చేస్తూ పనిమనుషులుగా మారి, మీరనే సూటిపోటి మాటలు భరిస్తూ, జీతంలేని పనిమనుషులుగా బ్రతుకు వెళ్ళదీస్తూ 'ఆ దేవుడు ఎప్పుడు తీసుకెళ్తాడా' అని ఎదురుచూస్తూ జీవచ్ఛవంలా బతకాల్సిన ఖర్మ నాకు వద్దమ్మా!... నీ ఇంటి వాతావరణం చూశాకే నాకు జ్ఞానోదయమైంది. నువ్వే కాదు... ఈ రోజు చాలామంది కోడళ్ళు నీలానే ప్రవర్తిస్తున్నారు. అందుకే నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ నా యింట్లోనే ఉండాలనీ నేను ఉన్నంతవరకు నా ఆస్తులు కూడా అమ్మకూడదని నిర్ణయించుకొన్నాను. చివరిగా ఓ మాట... నీలో జాలి, దయా, మానవత్వమనేవేవీ ఏ మాత్రమైనా ఉంటే ఈ చివరి రోజుల్లోనైనా మీ అత్తగారికి కాస్తంత విశ్రాంతిని, సంతోషాన్ని, మనశ్శాంతిని కలిగించి ఆమెలో ఈ అమ్మని చూసుకుంటావని ఆశిస్తూ... కాదు కాదు అభ్యర్థిస్తూ...

మీ అమ్మ
ఆండాళమ్మ.

*(2020 సంవత్సరంలో 'సర్వేజన - సుఖినోభవంతు ఫౌండేషన్' వారి కథల పోటీలో విశిష్ట ప్రతిభారత్న అవార్డు పొందిన కథ )*

# మాతృత్వపు మమకారం

**వం**టింట్లో 'దబ్'మన్న పెద్ద శబ్దం ఒక్కసారిగా నన్ను నిద్రలోంచి ఉలిక్కిపడి • లేచేలా చేసింది. కంగారుగా లేచి లైట్ వేసి చూసేసరికి మంచినీళ్ళ జగ్ కింద పడిపోయి ఉంది.

మంచినీళ్ళ కోసం వంటింట్లోకి వెళ్తుండగా నాన్నగారి గదిలోనుండి మాటలు విన్పించసాగాయి. దానిలో నా పేరు, ప్రస్తావన వచ్చేసరికి కొంచెం ఆశ్చర్యపడ్డాను. అమ్మ ఎప్పుడు లేనంత ఆవేశానికి గురయి మాట్లాడుతోంది. నాన్న కూడా అమ్మ చెప్పే మాటల్లోని 'నిజాన్ని' కొట్టేయలేక, నా కోరిక కాదనలేక సందిగ్ధావస్థలో ఉన్నారు.

తమ్ముడు కూడా నాన్నకి, అమ్మకి సమన్వయం కుదర్చలేక మౌనంగా వింటు న్నాడు. అమ్మ ఇదే ఆఖరు మాట అన్నట్లుగా "మీరు ఏమైనా అనండి. అనుకోండి. నాకు ఎంతమాత్రమూ ఇష్టం లేదు. నేను ఈ పనికిససేమిరా ఒప్పుకోను. దాని జీవితం చూస్తూ చూస్తూ చేతులారా నాశనం చెయ్యలేను.

"చిన్నపిల్ల దానికేం తెలుసు దాని జీవితం విలువ. ఒక్కసారి తప్పు నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తు అంతా బాధపడాల్సిందే. పెద్దలం మనం ఉండి కూడా ఈ పనికి మద్దతివ్వటం సబబు కాదు" అనేసి అక్కడనుండి వెళ్ళిపోయింది. నేను కూడా నిరాశగా వెనుదిరిగి నా రూమ్‌కి వెళ్ళిపడుకున్నాను.

నా గురించి అంత కలవరపెడుతున్న అంశం నా పెళ్ళి విషయం. మంచి

చదువు, ఉద్యోగం ఉన్న నాకు పెళ్ళి చేయటం అనేది అసలు సమస్యే కాదు. కాని 'నా' నిర్ణయం వల్ల నా తల్లిదండ్రులకు అతిపెద్ద భారంగా మారింది. అమ్మని ఎలా కన్విన్స్ చెయ్యాల అని ఆలోచిస్తూ పడుకునేసరికి ఎప్పటికో నిద్ర పట్టేసింది.

తెల్లవారి లేచేసరికి కొంచెం లేటయ్యింది. అప్పటికే నాన్న ఆఫీస్‌కి, తమ్ముడు కాలేజీకి వెళ్ళిపోయారు. నేను రెడీ అయ్యి అమ్మకు వెళ్ళి వస్తానని చెప్పి బయటకు రాబోతుంటే, వెనుకనించీ అమ్మ 'వాణి' అని పిలిచింది. ఏమిటన్నట్టు మెల్లగా వెనుతిరిగాను. "ఇవాళ ఆఫీసుకి సెలవు పెట్టడం కుదురుతుందా?" అని అడిగింది.

ఫోన్ చేసి రావట్లేదని చెప్పాక తను కూడా ఆఫీసుకి ఫోన్ చేసింది రావట్లేదని, ఇదంతా నాకు క్లాస్ పీకటానికేనని అనుకున్నాను. నేను ఆమెని కన్విన్స్ చెయ్యటానికి బాగా ప్రిపేరవుతూ... వచ్చి కుర్చీలో కూర్చున్నాను. నా ఎదురుగా కూర్చున్న అమ్మ కొంచెంసేపు ఏమి మాట్లాడలేదు. తర్వాత భుజం మీద చెయ్యి వేస్తూ మెల్లగా అంది.

"రాత్రి బాగా ఆలోచించాం వాణి! నువ్వు తీసుకునే నిర్ణయం మేము ఆమోదించేలా లేదు వాణి! నీకు ఇపుడు తెలియదమ్మా... ఎవరో ఏదో అనుకుంటారనీ. వేలెత్తి చూపుతారని కాదు. నేను ఇలా అంటున్నది. నీ సుఖం కోసం, సంతోషం కోసం ఏమైనా చేస్తాం. అవసరమైతే మాటలు పడతాం. దూషణలు ఎదుర్కొంటాం. కానీ నీ జీవితం ఎక్కడ డిస్ట్రబ్ అవుతుందో అని భయం వేస్తోందమ్మా!...ఒక్కసారి ఆలోచించు. పెళ్ళి చేసుకోవడానికి అతను తప్ప ఇంకెవరూ దొరకలేదా? పోనీ నువ్వతన్ని ప్రేమించావా అంటే అదీ లేదు.

కేవలం ఇష్టపడ్డాను అంటున్నావ్! అలాంటి వ్యక్తిని పెళ్ళిచేసుకొని, కొన్నాళ్ళయ్యాక, మీకు పిల్లలు పుట్టాక అపుడు, అపుడు తప్పు చేశాననే బాధ నిన్ను వింటాడితే... తప్పటడుగు వేశాననే ఆలోచన ప్రారంభం అయితే... ఆ తరువాత జీవితం నరకం కన్నా దారుణంగా ఉంటుందమ్మా...

అందుకే నా మాట విను తల్లీ... వద్దమ్మా, ఏ బాదరబందీలు లేనివాడ్ని, మంచి ఉద్యోగం ఉన్నవాన్ని చూసి చేస్తాం. మీరిద్దరూ సంతోషంగా ఉండాలనే కదరా మా కోరికా! అంది.

నేను అమ్మవంక ఆశ్చర్యంగాను, కొత్తగాను చూశాను. ప్రతి విషయాన్ని చాలా లోతుగాను కూలంకషంగాను పరిశీలించి నిర్ణయాలు తీసుకునే అమ్మ... ఎన్నో ఉన్నత భావాలతో, విశాలమైన హృదయంతో ఆలోచించే అమ్మ!.. తన

దృఢమైన వ్యక్తిత్వంతో, చెదరని చిరునవ్వు ఆయుధంగా అందరినీ ఆకట్టుకునే అమ్మా.... ఇలా బెంబేలుపడి, డీలాపడిపోతుందనీ– ఇలా అసలు మాట్లాడుతుందని నేను కలలో కూడా ఊహించలేదు.

విషయం వినగానే నా నిర్ణయాన్ని ఇంట్లో అందరూ సమర్థిస్తారని, నన్ను అభినందిస్తారని ఊహించిన నాకు ఈ విధమైన మాటలు చాలా బాధ కలిగిస్తున్నాయి. అందరూ ఎందుకు ఇంత వింతగా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదు.

వీళ్ళ బాధకు కారణం నేను ఇష్టపడి చేసుకునే అబ్బాయికి అందమైన ఇల్లు, ఉద్యోగంతోపాటు అందమైన 'పాప' కూడా ఉండటమే. ఒక బిడ్డకు తండ్రి అయిన అతన్ని నేను ఇష్టపడటం... పెళ్ళి చేసుకోవాలనుకోవటం, మాత్రమే కాదు. పాపను ఏ ఆశ్రమంలోనూ చేర్పించక సంరక్షణ భారాన్ని నేనే స్వీకరిస్తానని వాగ్దానం చెయ్యటం! మంచి చదువు, ఉద్యోగం ఉన్న నాకు, ఒక బిడ్డకు తండ్రిని చేసుకోవలసిన అవసరం ఏంటని వాళ్ళ వాదన!

అమ్మ ఇక చెప్పాల్సిన సమయం దగ్గరపడినట్లు ఒక్కసారి కళ్ళు మూసుకుని ఆలోచించి, నన్ను పెంచటానికి తను పడిన ఇబ్బందుల్ని ఒక్కొక్కటి చెప్తుంటే, నేను ఆమె ఒళ్ళో పడుకుని ఆమె చేతిగాజులు సరిచేస్తూ నిశ్శబ్ధంగా వినసాగాను. అంతా చెప్పాక, 'వాగ్వాణి' ఇదంతా నా జీవితంలో జరిగిన వాస్తవ సంఘటన, నిన్ను ఇబ్బంది పెట్టటానికి చెప్పలేదమ్మా. నువ్వు తెలుసుకుంటావని, నీకు తెలియచెప్పాలని నేను ఎప్పుడు అనుకోలేదమ్మా!

కానీ, భవిష్యత్తులో బాధపడేకన్నా ముందుగా దాన్ని తెలుసుకొని ఆచితూచి అడుగు వేస్తావనీ, ఒకసారి పునరాలోచించుకొంటావని చెప్తున్నాను. ఆపైన నీ ఇష్టం. కానీ ఒక విషయం గుర్తుంచుకో. ఎవరో కవి అన్నట్లుగా పెళ్ళి, సముద్రం ఒకలాంటిదే! దిగితేనే గానీ లోతు తెలియదు. ఒక్కసారి దిగాక బయటకు రావాలన్న రాలేము అని నవ్వింది. నేనేమి మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చున్నాను. అమ్మ కూడా నా మనసు గ్రహించి నన్ను ఏమి మాట్లాడించకుండా వెళ్ళింది. అమ్మ చెప్పింది అక్షరాల నిజం. పరాయిబిడ్డను పెంచటం అనుకున్నంత సులువు కాదని నాకు మొదట్నుంచీ తెలుసు.

ఎందుకంటే నేను కూడా నా తల్లికి పరాయి బిడ్డనే కనుక! తనకు నేను సవతి కూతుర్ని కనుక! తను కూడా నాకు సవతి తల్లి కనుక! మా అమ్మను నేను ఇంతలా ప్రేమించటానికి కారణం, ఆమె నా సవతితల్లి కావడం కాదు.

ఆమె నన్ను కన్నతల్లి కంటే ఎక్కువగా పెంచటం వల్ల కాదు. ఏమి కాని నాకోసం... కేవలం మా నాన్నను కట్టుకున్నందుకు ఆమె పడిన కష్టం, అనుభవించిన బాధలు... ఒక పసిపాపను, తనది కాని ఒక చిన్న ప్రాణికి మాతృమూర్తిగా మారటానికి ఆమె పడిన తపన.. ఇవన్నీ నన్ను కదిలించాయి.

నాకు ఏడాదిన్నర వయస్సప్పుడు నా తల్లి మా యింట్లో ప్రవేశించింది. బోసినవ్వులతో, చిలిపి అల్లరితో మురిపిస్తున్న నన్ను దగ్గరకు హత్తుకుంది. మాకు ఓపిక ఉన్నన్నాళ్ళు మేము పెంచుతాం, తర్వాత మీ దగ్గరికి పంపిస్తామన్న అమ్మమ్మ మాటను కాదని తన దగ్గరే ఉంచుకుంది.

'వాగ్వాణి'కి నేను కన్నతల్లిని కాదనే విషయం ఎప్పటికీ తెలియకూడదు. మీరు కొంతకాలం గడిచిన తర్వాత తీసుకువచ్చి నాకిస్తే అపుడు నాకు పాపకి అనుబంధం అసలు ఏర్పడదు. అదే చిన్నప్పటి నుంచి నా చేతుల మీదుగా పెరిగితే ఆ అనుబంధం వేరు. నాకు పాపకు 'సవతి తల్లి' అనిపించుకోవాలని లేదు. కాబట్టి పాప నా దగ్గరే ఉంటుంది అని ఖచ్చితంగా చెప్పేసింది.

ఆరోజు నుంచి ఈ రోజు వరకు నన్ను స్వంతబిడ్డలాగే చూసుకొంది. తమ్ముడు నేను బాగా అల్లరి చేసినా, కొట్టుకున్నా ఏమి అనేది కాదు. మీరిద్దరూ నాకు చెరో కన్ను... అని అంటుంది.

అమ్మ నాకోసం పడ్డ శ్రమ... బహుశా ఏ తల్లి తన బిడ్డ కోసం పడి ఉండదు. అంతెందుకు తమ్ముడితో కూడా అంత ఇబ్బంది పడలేదు. తను సవతితల్లినని తెలియకూడదని ఎంతలా తపించిందో, ఎంతలా నా మీద శ్రద్ధ తీసుకుందో... అంతగా సమాజం ఆమెని బాధించింది. ప్రతిచోట ఏదో ఒకరకంగా అమ్మను నన్ను గుచ్చి గుచ్చి చూడటం, అమ్మ లేనప్పుడు నన్ను ఇబ్బందికరంగా ప్రశ్నించడం.

ఏదైనా ఫంక్షన్‌కి వెళ్ళినపుడు అక్కడ అమ్మ ప్రవర్తనని డేగకళ్ళతో గమనించేవారు. అమ్మ నాకు ముందు అన్నం పెట్టిందా... తమ్ముడికి పెట్టిందా? అమ్మ నాకు వేసిన డ్రెస్ బాగుందా? తమ్ముడిది బాగుందా? అంతెందుకు బాగా అల్లరి చేస్తుంటే అమ్మ నన్ను తిట్టిందా? తమ్ముడిని తిట్టిందా? ఇలా ప్రతి ఒక అంశం నిశితంగా గమనించే వారు. కొందరయితే దాన్ని అక్కడే బాహటంగానే విమర్శించటమో లేక ఎగతాళి చేయటమో చేసేవారు.

అన్నీ నాకు ముందుగా చెస్తే సవతి కూతుర్ని ఎక్కడ సరిగ్గా చూడటం

లేదంటారోనని అందరి ముందు 'షో' ఇస్తోందని విమర్శలు వచ్చేవి. పోనీ తమ్ముడి పన్లు ముందు చేస్తే! ఎంతయినా కన్న కొడుకు కన్నకొడుకే, పరాయి పరాయే అని దీర్ఘాలు తీసేవారు.

ఏ శుభకార్యానికి వెళ్ళినా, ఎక్కడికి మమ్మల్ని తీసుకెళ్ళినా అమ్మ ఇంటికి వచ్చి బాధపడకుండా ఉండేది కాదు.

అందరూ నా దగ్గరచేరి, మీ అమ్మ నీకు సరిగ్గా పెడుతుందా? చాక్లెట్లు కొనిస్తుందా, డ్రెస్సులు కొంటుందా? నీతో పని చేయిస్తుందా? ఇలా రకరకాల ప్రశ్నలతో నన్ను వేధించేవారు. ఒక్కోసారి నాకు ఇవన్నీ నన్నే ఎందుకు అడుగుతున్నారనే సందేహం వచ్చేది. ఇక యుక్తవయస్సు వచ్చాక చెప్పినా పర్లేదనే ధైర్యం వచ్చాక, ఒకరోజు అమ్మ కూర్చోబెట్టుకుని నాకు తమ్ముడికి ఈ విషయం చెప్పింది.

నిజానికి అమ్మ ఇంటాబయటా ఒకేలా ప్రవర్తించేది. ఆమెది కపట ప్రేమకాదు. నన్ను తమ్ముడిని ఒకేలా పెంచింది. నాన్న కూడా ఆమెను పూర్తిగా అర్థం చేసుకోవటం వల్ల ఆమె నన్ను దండించినా నోరు మెదిపేవారు కాదు.

మంచి క్రమశిక్షణతో సరిఅయిన పద్ధతిలో పిల్లల్ని పెంచటానికి ఆమె ఒక్కసారి కసిరేది. తిట్టేది. అవసరం అయితే అపుడపుడు చేయి కూడా చేసుకునేది. తన కూతురు అన్న భావన వచ్చాక, తరువాత ఏమి చేసినా ఆమె నా కోసమే, నా మంచి కోసమే చేస్తుంది అని అనుకోవటం వల్ల నాన్న కూడా ఆమెను సపోర్టు చేసేవాడు.

ఈ విషయం విన్న వెంటనే నాకు మతిపోయింది. ఇంతకాలం బంధువుల్లో నేను ప్రత్యేకంగా గుర్తింపబడటానికి గల కారణం తెలిసింది. నేను నమ్మలేని ఆ నిజాన్ని ఒప్పుకోవటానికి చాలా రోజులు పట్టింది. అమ్మను చుట్టుకుని బావురుమని ఏడ్చాను. నన్ను చూసి తమ్ముడు కూడా ఏడ్చేసరికి అమ్మకీ ఏడుపు వచ్చింది.

వాణి! నీకీ విషయం ఈ జన్మలో నేను చెప్పాలనుకోలేదు. కాని సమాజం మనల్ని మంచిగా బ్రతకనివ్వదమ్మా! ఇంతకాలం నువ్వు చిన్నపిల్లవి. ఎవరు నీతో ఏం చెప్పినా అన్నీ నాకు పూసగుచ్చినట్లు చెప్పి, వాళ్ళెందుకు ఇలా అన్నారు. వీళ్ళెందుకు ఇలా అన్నారు? అని అడిగేదానివి. నేను నీకు ఏదో సర్దిచెప్పి ఊరుకునేదానిని. కానీ నీ వయసు పెరుగుతున్న కొద్దీ సొంత ఆలోచనలు పెరిగి, అపుడు ఎవరు ఏమన్నా దానిని నీ ఆలోచనల ద్వారా ఒక రూపం ఏర్పరచుకుంటావు.

నిజాన్ని మేము చెప్పకపోతే అది బయట వాళ్ళనుండి నీకు తెలిస్తే నువ్వు

తట్టుకోలేవు. అప్పుడిక నేను చేసిన ఏ పనైనా నీకు చెడుగానే కనిపిస్తుంది. నీ తల్లి 'నీ సొంతం కాదనే' మాట నీకు పదేపదే గుర్తుకొస్తే నీ ఆలోచనలు మంచిగా సాగవు.

"ఎప్పుడో ఒకప్పుడు తెలియాల్సిన విషయాన్ని అందరికంటే ముందుగా నేనే చెప్తే నువు నన్ను అర్థం చేసుకోగలవనే నమ్మకం నాకుంది" అంది.

ఆ రోజునుంచి నేను అమ్మని ప్రత్యేకంగా గమనించటం మొదలు పెట్టాను. ఆమె ఆలోచనలు ఆమె ప్రవర్తించే విధానం, ఆమెలోని ప్రేమతత్వం నాకు తెలియకుండా నాలోనూ ప్రవేశించాయి.

ఒచ చిన్నిపాపకు ఆలంబననై ఆమె ఎదుగుదలకు నా చెయ్యి అందించాలనీ తల్లిగా ప్రేమని పంచి ఒక మంచి వ్యక్తిత్వం గల అమ్మాయిని సమాజానికి అందించాలని,ఏ పరిస్థితుల్లో నేను పెరిగానో అదే పరిస్థితిలో నున్న ఇంకో 'స్త్రీ'ని ఆదుకోవాలన్న 'నా' సంకల్పం బాగా బలపడింది. దృఢమైంది.

ఇక నేను అమ్మకు నచ్చచెప్పాల్సిన టైం వచ్చిందని భావించాను. మెల్లగా తలుపుతీసి అమ్మ గదిలోకి వెళ్ళాను. ఆమె ప్రక్కన కూర్చుని, మెల్లగా చెప్పటం ఆరంభించాను.

"అమ్మా' మీ ఆర్థిక పరిస్థితి సరిలేదు కనుక అప్పట్లో నాన్నకు భార్యవయ్యావు.నా తల్లివయ్యావు.ఏ జన్మలో చేసుకన్న పుణ్యమో నువ్వు నాకు మాతృమూర్తివయ్యావు.

ఇంత బాగా పెంచగలిగావు.నువ్వు 'మదర్ థెరిస్సా' స్ఫూర్తితో 'ప్రేమమయి'గా మంచి తల్లిగా నాపట్ల నీ బాధ్యత నిర్వర్తించావు. ఒకప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా అమ్మా.

'ఇంకో ఆర్నెల్లల్లో రిటైరయి ఒక చిన్న అనాథ శరణాలయం స్థాపిస్తాను. కనీసం కొంతమంది అనాథ పిల్లలనయినా ఆదుకుని సమాజం పట్ల నా బాధ్యత నిర్వర్తిస్తాను" అని అన్నావు. మరి నీ ఆదర్శాలు నీ పద్ధతుల్లో పెరిగిన నాకు ఇలాంటి ఉద్దేశ్యం కలగటం తప్పెలా అవుతుందమ్మా!

కంటేనే తల్లి అనిపించుకుంటుందా స్త్రీ 'మాతృత్వమే స్త్రీ జన్మసార్థకం' అనే పాతకాలపు నమ్మకం నించి ఈ సమాజం మారే పరిస్థితి లేదా? ఒకప్పుడు ఆడపిల్లలు పెళ్ళి, పిల్లలే పరమావధిగా బతికేవారు.కానీ ఇప్పుడు కాలం మారింది. పిల్లలు కాకపోయినంత మాత్రాన స్త్రీజీవితం ఆగిపోదు. అంధకారం అలుముకోదు. అయినా

కనగానే తల్లి అయినట్లు కాదమ్మా, ఆ కన్నపిల్లల్ని సక్రమంగా పెంచి మంచి నడవడిక అలవర్చాలి.

పిల్లల్ని కన్న స్త్రీలందరికీ మాతృత్వపు మమకారం ఉంటుందనుకుంటే రోడ్లమీద, చెత్తకుప్పల మీద నిర్దాక్షిణ్యంగా పిల్లల్ని వదలి వెళ్ళే తల్లులను ఏమనాలి? ఆడపిల్ల అని తెలియగానే నిర్దయగా తనలో ఊపిరి పోసుకుంటున్న పిండాన్ని ముక్కలు చేయటానికి ఏమాత్రం బాధపడకుండా సిద్ధపడే తల్లులకి ఏమని చెప్పాలి? అదే నా మాతృత్వం, అదేనా మమకారం అదేనా కన్నతల్లి ప్రేమా? ఇంత రాక్షసంగా ప్రవర్తించటం కన్నా గొడ్రాలిగా ఉండటం మేలు కాదా!

అమ్మా! నువ్వు చెప్పు, తనకన్న పిల్లల్ని పెంచటం చేత కాకపోయినా పక్కవాళ్ళని గురించి గేలిచేసే స్త్రీలున్న సమాజంలో 'నా' గురించి నువ్వేలా బాధపడ్డావో, ఎన్ని మాటలు పడ్డావో నాకు తెలుసు. అసలు స్త్రీల కష్టాలు, పురుషుల నుంచి కాదమ్మా వచ్చేది. మహిళా సంఘాలు, 'పురుషాధిక్యత' అని గోల చేస్తాయి. మనమంతా పురుషాధిక్యత గురించి మాట్లాడుతామే కానీ, పురుషుడు మనల్ని గుర్తించాలని భావిస్తామే కానీ, పురుషుడు మనల్ని గౌరవించాలి. ప్రేమించాలి అని భావిస్తామే కానీ మనల్ని మనం గౌరవించుకోం.. ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరించాలని భావిస్తామే కానీ మనల్ని మనం ఉద్ధరించుకోవటానికి ఏం చేయాలో ఆలోచించం.

అక్కాచెల్లెల్లు, అత్తాకోడళ్ళు, వదిన మరదళ్ళు, తల్లీకూతుళ్ళు ఇలా స్త్రీతో స్త్రీ చక్కగా కలిసిపోవడం, గొడవపడకుండా ఆప్యాయతని పంచుకోవటం ఇలాంటి అనుబంధాలు ఎన్నో విచ్ఛిన్నమవటం ఈ రోజు మనం చూస్తూనే ఉన్నాం.కొడుకు కోడలు ఆనందంగా ఉంటే చూడలేని అత్త ఎక్కడైనా ఉంటుందేమో కానీ,అమ్మా – భార్య చక్కగా కలిసి ఉంటే చూడలేని భర్త ఉండడేమో!

వదిన మరదలు కలిస్తే సూటిపోటి మాటలే కానీ, సరదాలు సరసాలు ఈ రోజుల్లో ఏవి? తన భర్త హెూదాని, ఆర్థిక పరిస్థితిని తోటి కోడలు భర్తతో పోల్చుకుని ఈర్ష్యపడటమో, గర్వపడటమో తప్ప ఆప్యాయత గురించి ఆలోచించే స్త్రీలెందరు? ఇదంతా స్త్రీలను చులకన చేయటానికో, తక్కువ చేసి మాట్లాడటానికో కాదు. స్త్రీలపట్ల స్త్రీకి గల ఈర్ష్య అసూయలు, పగలు ద్వేషాలు పోవాలి.

ఇలాంటి గుణాలు ఉండబట్టే పురుషుడు స్త్రీని ఆడించగలుగుతున్నాడనే నా నమ్మకం. అసలు కట్నం సమస్యలు కూడా అత్తగారు అనబడే స్త్రీ నుంచే కదమ్మా

మొదలయ్యేది. కొడుకు కానుకలు అడుగుతున్న తన భార్యని బాధపెడుతున్నా గట్టిగా వొకసారి మందలించి ఇవి తప్పు అని సర్దిచెప్పితే, ముఖ్యంగా తన కోడలికి అండగా నిలిస్తే, ఇద్దరూ కలిసి అతనికి బుద్ధి చెపితే చాలావరకు సమస్యలు చిలికిచిలికి గాలివాన కావు.

ఒక సాధారణ సమస్యని తుఫానుగా మార్చే శక్తి స్త్రీకి ఉంది. ఆమెగానీ తలచుకుంటే ఎంత పెద్ద తుఫాను అయినా ఆపగలదు. మన బాధలకీ, దు:ఖాలకి మూలం 'మనమే' అని తెలుసుకొన్నరోజు స్త్రీ స్వభావంలో మార్పు వస్తుంది. ఒక ఆడపిల్లకి తల్లిగా మమకారాన్ని పంచే స్త్రీ తన యింటికి వచ్చిన ఆడపిల్లకు నరకాన్ని ఎందుకు చూపిస్తుంది? అందుకే నేను అంటున్నాను స్త్రీల దృక్పథంలో మార్పు రావాలి.

స్త్రీలు చైతన్యవంతం కావాలి. స్వశక్తితో పైకి రావాలి. తమకుతామే అండగా నిలబడాలి. తమలో తాము పరస్పరం సహాయం చేసుకోవాలి. అప్పుడే అప్పుడేనమ్మా! సమాజంలో స్త్రీ పరిస్థితి మెరుగయ్యేది. స్త్రీలు కలలుకనే సమాజాన్ని సాకారం చేసుకోగలిగేది. నేనాలోచించింది కూడా నా బిడ్డ స్త్రీ కావటం నేను, నేను ప్రేమ ఆప్యాయత అందించి ఆ పాపను ఒక మంచి స్త్రీగా సమాజానికి అందించాలనే, ఒక స్త్రీగా భావించటానికి ఒక మంచి ఆడపిల్లని అందించాలనే నా తాపత్రయం.

ఈ విధంగా సమాజానికి సేవచేసే భాగ్యం నాకు రావటం ఆ దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను.అలా అని నేను పిల్లల్ని కనకుండా, సినిమాల్లో లాగా త్యాగాలు చేయను. రెండు మూడేళ్ళు కష్టపడితే పాప పెద్దదవుతోంది. చెప్తే అర్థం చేసుకునే వయసు వస్తుంది.

ఆ పాప మరేవిధంగాను అడ్డు కాదమ్మా! మా క్షణికమైన ఆనందాలకి అడ్డు వస్తుందని ఆ పాప బంగారు భవిష్యత్తుని బలిపెట్టటం భావ్యమా? అదే మా సొంత పిల్లలుంటే మేము వారిని మా ఆనందానికి అడ్డంకిగా భావిస్తామా? 'మా' పిల్లలని ఎందుకంటున్నానంటే బాలరాజు వాళ్ళ తమ్ముడు కరెంట్‌షాక్‌తో చనిపోతే వాళ్ళ బాబుని అతనే పెంచుతున్నాడు. అతని భార్య చైతన్య కూడా నిండుమనసుతో అందుకు అంగీకరించింది. ఒక పురుషుడే స్త్రీ పట్ల అంత దయ చూపుతుంటే స్త్రీనయి ఉండి అతన్ని ఇష్టపడుతూ ఉండి– ఇన్ని భావాలు కలిగి ఉండి ఆపాప బాధ్యత తీసుకోలేనా? అది అతనిపట్ల ఆ పాపపట్ల నా కర్తవ్యం కాదా?ఇన్ని ఆలోచించేనమ్మా నేను ఈ

నిర్ణయం తీసుకున్నాను. నాకు నువ్వున్నావు. పాపకి నేనుంటాను. నేను ఈ బాధ్యత సక్రమంగా నిర్వర్తించాలంటే ఎప్పటికీ నీ సహాయం కావాలి. ఇంత చెప్పినా నువ్వు ఒప్పుకోకపోతే మాత్రం నేను నీ మాటే వింటాను” అని స్థిరంగా చెప్పాను.

కాసేపటివరకూ అమ్మ ఏమి బదులు చెప్పలేదు. ఆమెకు కళ్ళనుండి నీళ్ళు ధారాపాతంగా వస్తున్నాయి. నన్ను గట్టిగా పట్టుకుని నుదుటిపై ముద్దు పెడుతూ... “ఎంత ఎదిగిపోయావు వాణీ! ఏదో వేళకు తిని, నీ చదువు నువ్వు ఉద్యోగం చేస్తూ కన్పించే నీలో ఇన్ని లోతైన భావాలున్నాయని ఇప్పుడే... ఇప్పుడే తెలుసుకున్నాను. నువ్వు ఏదో ఉడుకురక్తంతో ఎంతో ఆదర్శాలు వల్లిస్తున్నావని, భవిష్యత్తులో బాధపడతావని నచ్చచెప్పాలని ప్రయత్నించానే కానీ – ఇంత బలంగా నీ మనసులో ఈ భావాలు పాతుకుపోయాయనుకోలేదు. ఇప్పుడు నేను ఒక స్త్రీగా ఒక స్త్రీ చేసే పనిని మనసారా అభినందిస్తున్నాను.

“నాకు చేతనైన సహాయం చేస్తాను. పద... నా మనుమరాల్ని చూద్దాం. ఇక్కడికి తీసుకొద్దాం. నేను అలవాటు చేసుకోవాలిగా. రేపు నువ్వు ఆఫీస్‌కెళితే చూసుకోవాలిగా...” అంది ఆరాటంగా.

నేను ఆశ్చర్యంగా, అభినందనగా అమ్మవైపు చూశాను. కన్నీళ్ళు తుడుచుకుంటూ అమ్మ అన్నట్లు నా బిడ్డ చదువుల తల్లి సరస్వతి కావాలని ‘వాగ్వాణి’ అని పెట్టుకున్నాను. మరి నా మనవరాలి పేరు ఏంటీ? అని అడిగింది. ఇంకేంటి ఇప్పుడే పెడ్తున్నాను. చెప్పనా అమ్మా ‘వ్యాహృతి’ అని చెప్పాను ఆనందంగా.

*(2014లో వరంగల్ ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక; పాలపిట్ట ఉగాది పోటీలో 24.7.2020 తృతీయ బహుమతి పొందిన కథ)*

# పరోపకారార్థ మిదం శరీరం

ఆకాశంలో మబ్బుల కన్నుల్లోంచి జలజలా రాలుతున్నట్లుగా బాధాతప్త హృదయంతో కురవడానికి సిద్ధమవుతున్నట్లుగా ఉన్నాయి. అప్పటివరకు గంటన్నరగా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. అయినా ఆలోచన ఓ కొలిక్కి రావడం లేదు. ఆదిలక్ష్మమ్మ గారు చనిపోయి మూడు గంటలు కావస్తుంది. తలదగ్గర ప్రమిదలో దీపం వెలుగుతుంది. ఆవిడ కట్టుకున్న చేనేత చీర ఫ్యాను గాలికి రెపరెపలాడు తుంది. స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో రాట్నం మీద నూలు వడికిన చేతులు ఇప్పుడు నిశ్చలంగా ఉన్నాయి. ఆ వేళ్ళకి తెల్లరాయి... ఎర్రరాయి ఉంగరాలు మెరుస్తున్నాయి. మెడలో రెండు వరుసల చంద్రహారం ఉన్నది. చేతులకి బంగారు గాజులున్నాయి.

ఉదయం ప్రాణం పోగానే కోడలు పార్వతి అవి తీయాలని ప్రయత్నం చేసింది. ఇంతలో ఎదురింట్లో ఉన్న 'స్త్రీ విముక్తి' సంఘం నాయకురాలు గీత వచ్చి ఆపింది. "అమ్మమ్మగారు' తన పార్థివ దేహాన్ని వరంగల్ మెడికల్ కాలేజీకి తన యావదాస్తిని మా సంఘానికి రాశారు. లాయరు గారి సమక్షంలో విల్లు కూడా వ్రాశారు" అంటూ కాగితాలు చూపింది. దాంతో ఇంట్లో కలకలం, కలవరం, మొదలు.

అదో చిన్న గ్రామం. వంద ఇళ్ళుంటాయి. అంటే అందమైన పచ్చని పొలాలు, చెరువు, చెరువులో స్వచ్ఛమైన నీరు, తామరతూడు– ఊరంతా దివ్యమైన గాలి.

ఊళ్ళో శివాలయం, రామాలయం, సాయిబాబా గుడి ఉన్నాయి. రామాలయంలో భజన సంఘం కూడా ఉంది.

ఆదిలక్ష్మమ్మ గారు ఊళ్ళో అందరికీ కన్నతల్లిగా మెదిలింది. ఉన్న ఒక్కకొడుకు రామారావుకి పట్నంలో ఉద్యోగం. ఆ ఊళ్ళో పొలం, ఇల్లు అన్నీ ఆవిడే ఆజమాయిషి చేసేది. ఐదారేళ్ళ క్రితం ఆ ఊళ్ళో 'స్త్రీ విముక్తి' అనే సంస్థ యొక్క శాఖ తెరిచారు. ఆ ప్రాంతంలో వరకట్న మరణాలు అధికంగా రిపోర్టు కావడంతో 'స్త్రీ విముక్తి' అనే సంస్థ ఆ ఊళ్ళో తమ కార్యాలయం తెరిచింది. అప్పటినుండి గీత ఆ కార్యాలయంలో పనిచేస్తూ ఆ ఊళ్ళో కార్యాలయం అధికారిణిగా ఎదిగింది.

ఆదిలక్ష్మమగారు, గీత మంచి స్నేహితులు, స్త్రీవిముక్తిని ఆ ఊళ్ళో చాలామంది వ్యతిరేకించారు.ఇక్కడ స్త్రీ జనోద్ధరణ అవసరం లేదని మేమందరము బాగానే ఉన్నాము. మీరు వచ్చి ఏమి చేయనవసరం లేదని, ఆ ఊరి పెద్దలు పట్టుబట్టారు.

అయినా స్త్రీ విముక్తి కార్యాలయం ఆ ఊళ్ళో నిలదొక్కుకున్నది. అందుకు ముఖ్యకారణం ఆదిలక్ష్మమ్మ గారే. ఆవిడ తన యింట్లో స్త్రీ విముక్తి కార్యాలయానికి ఒక గది కేటాయించింది.ఏటా వచ్చే డబ్బులో కొంత విరాళంగా ఇచ్చింది. స్త్రీ విముక్తి నిర్వహించే పంచాయితీలలో సభ్యులహెూదాతో పాల్గొని తగవులు తీర్చడమే కాదు. అవయవదానం గూర్చి కూడా అవగాహన కల్పించేది.

ఇదంతా ఊర్లో పెద్దలకు నచ్చలేదు. ఇదివరకు తమ దగ్గరికి వచ్చే పంచాయితీలు స్త్రీ విముక్తి వారు తీరుస్తున్నారిప్పుడు. సమాంతర అధికార పీఠం. ఏర్పడినట్లే కదా! ఇలా వారు ఆదిలక్ష్మమ్మగారి మీద కారాలు మిరియాలు నూరుతుండగానే ఆవిడకి పెద్ద జ్వరం వచ్చింది.కొడుక్కి ఫోన్ చేశారు. రెండ్రోజుల క్రితం కొడుకు వచ్చాడు. అతనితోపాటు కోడలు కూడా వచ్చింది. ఇవాళ ఉదయం ప్రాణం పోయింది.

ఆవిడ శవయాత్రకి ఊరి పెద్దలు రామన్నారు.వారి ఇళ్ళలో కోడళ్ళ కష్టాలు కూడా స్త్రీ విముక్తి తీర్చింది మరి. ఆదిలక్ష్మమ్మగారు స్వాతంత్ర్య పోరాట యోధురాలు. ఆవిడకి సన్మానపత్రం కూడా ఇచ్చారు ప్రభుత్వం వారు. ఆవిడ జీవితమంతా పరోపకారంతోను, దైవచింతనతోను, ధర్మాపాలన తోను గడిపింది.

నూలు వడికిన చేతులతోనే ఊళ్ళో బడి కడుతుంటే శ్రమదానం చేసింది. గుడి కడుతుంటే విరాళం ఇచ్చింది.

రామభజన సంఘంలోను, రామకోటి లేఖన సమాజంలోనూ చేరింది. రామకోటి

వ్రాసి భద్రాచలం వెళ్ళి పుష్కరాలలో నిమజ్జనం చేసి వచ్చింది. ఆవిడకి 'స్త్రీ విముక్తి' ఆ ఊరికి అవసరం అని తోచింది. ఆవిడ కొడుక్కి కట్నం లేకుండా పెళ్ళి చేసింది. కొడుకు చిన్నపిల్లాడిగా ఉన్నపుడే తను వైధవ్యం పొందినా ఆమె గుండె నిబ్బరంతో బ్రతికింది.

ఇవాళ ఆదిలక్ష్మమగారు, అయిదువందల గజాల ఇల్లు, ఐదెకరాల పొలం, ఎకరం మామిడితోట, బ్యాంకులో ఉన్న యాభైవేల డిపాజిట్టు, తన ఒంటిమీద ఉన్న బంగారం, వీటన్నింటినీ స్త్రీ విముక్తి సంస్థకి వ్రాసి అనాథ స్త్రీల సంక్షేమానికి అవి ఉపయోగించాలని విల్లు రాసింది. ఆ మాట పక్క ఊరిలో ఉన్న లాయరుగారు వచ్చి ధృవీకరించారు. ఆవిడ విల్లు ఇలా రాసింది.

నా ఆస్తంతా నా స్త్రీ ధనం,నా భర్త నుండి సంక్రమించిన ఆస్తి వరంగల్‌లోని మేడ మాత్రమే. అది నా కొడుకు రామారావుకి చెందుతుంది" అని.

అది కూడా ఇవ్వకపోతే కొడుకు కర్మ చేయనని కూడా అనేవాడేమో. కాని యిప్పుడు మౌనం వహించాడు. కోడలు మాత్రం సణుగుతూనే ఉంది. ఈవిడ ఊరందరితో గొడవలు పెట్టుకుంది. ఇప్పుడీ శవాన్ని ఎట్లా పారెయ్యాలి అంటూ.

ఆవిడ 'స్త్రీవిముక్తి'కి ఆస్తి రాసిచ్చిందని తెలిసే ఊళ్ళో చాలామంది అబ్బురపడ్డారు. కొందరు మాత్రం "ఆ అనుకున్నాం, అనుకున్నాం" అన్నారు.

ఊరి పెద్దలు, బంధువులు ఎవరూ ఆమె శవాన్ని మోయడానికి రామన్నారు. పట్టణాల్లో వలె 'స్వర్గరథం' వంటి వ్యాన్లు ఆ ఊళ్ళో లేవు. ఊరి పెద్దలు తాలుకు పనివాళ్ళు కూడా రాలేదు. మధ్యాహ్నం రెండు దాటింది. వీధిలో ఎండ చురుక్కుమంటోంది. ఎవరు వంటలు చేసుకోలేదు. ఏమవుతుందనీ అంతా చూస్తున్నారు. చిన్న గుంపులుగా విడిపోయి గుసగుసలాడుకుంటున్నారు.

రామారావు ట్యాక్సీ కోసం కబురు చేశాడు. కానీ ట్యాక్సీ దొరకలేదు. అయినా ఆ చిన్న పల్లెల్లో ఇంటినుండి ఇరుకు వీధుల్లోంచి స్మశానానికి ట్యాక్సీ వెళ్ళదు.

అపుడు ఊళ్ళో ప్రముఖులు అనిపించుకోదగిన రైతులు ముగ్గురు ముందుకు వచ్చారు. వెంకటయ్య, దుబ్బయ్య, రాజయ్యలు.

"అమ్మమ్మగారు ఎవరికీ నచ్చని పని చేసింది. మన ఊళ్లలో మనకి అలవాటు లేవు. ఈ స్త్రీ విముక్తులు ఆయిన మన ఆడవాళ్ళు గడప దాటి రారు. అయినా ఆదిలక్ష్మమ్మగారు కాలం కన్నా ముందుకి ఆలోచించారు. అందువల్ల నాలుగు

కుటుంబాలు బాగుపడ్డాయేగాని చెడిపోలేదు. అందుకని మనం వెళ్ళి రామారావుగార్ని అడిగి ఆదిలక్ష్మమ్మగారి శవం మోస్తూ, మెడికల్ కాలేజీకి అప్పజెప్పివద్దాం అని వాళ్ళలో వాళ్ళు తీర్మానించుకున్నారు. రామారావుగారు "సరే" అన్నారు.

మెడికల్ కళాశాలలో కళ్ళు, గుండె మొదలుకొని వారికి అవసరమైన అవయవాలు తీసుకుని శవాన్ని ఇచ్చారు.

చకచకా పాడె కట్టారు. ఊరి బయట యానాదులకు కబురు పంపారు. డప్పులతో తరలివచ్చారు వాళ్ళు. ఆదిలక్ష్మమ్మగారి శవానికి స్నానం చేయించారు. కొత్త నూలు చీర కట్టారు. శవాన్ని పాడె మీదకు ఎక్కించారు.

రామారావు ఇంటిముందున్న నిప్పుకుండ తీసుకుని బ్రాహ్మణుడు మంత్రాలు చదువుతుంటే శవానికి ముందు నడిచాడు. రైతులు ముగ్గురు మూడుపక్కలా పట్టుకుంటే, నాలుగో భుజం ఊరిజనం మార్చుకుంటూనే ఉన్నారు.

ఊరి ప్రజలు 'స్త్రీ విముక్తి' సభ్యులు, భజన సంఘం సభ్యులు, రామకోటి సంఘం సభ్యులు, దళితులు, పిల్లలు, పెద్దలు, స్త్రీలు అందరూ ఆదిలక్ష్మమ్మ గారి శవం వెంట నడిచారు. పొరుగూరి నుండి వచ్చిన ఇంగ్లీషు బ్యాండుతో ఊరి యానాదుల డబ్బులతో పేళాలు, పైసలు చల్లుతుండగా స్త్రీ విముక్తి సంఘం వారు బంగారు, వెండి మల్లెపూలు చల్లుతుండగా శవయాత్ర ఘనంగా సాగింది.

శ్మశాసనంలో ఆదిలక్ష్మమ్మ గారి శవాన్ని కట్టెలపై చేర్చాక ఎవరో గంధపు చెక్కలు కూడా చేర్చారు ఆవిడపై. దహనం పూర్తయి, కపాలమోక్షం అయిన శబ్దం వినిపించేవరకు అందరూ ఉన్నారు. శ్మశానంలో బోర్‌వెల్ దగ్గర కొందరు చెరువులో కొందరు స్నానాలు చేశారు.

'పరోప కారార్థ మిదం శరీరం' అన్నట్లుగా బ్రతికిన స్త్రీ ఆవిడ ఊరందరికీ ఆప్తురాలయ్యింది. ఆ గ్రామంలోని మానవ సమూహమంతా ఆవిడ కోసం స్నానాలు చేశారు.

ఆ మరుభూమి అక్కడి తుమ్మపొదలు, వేపచెట్లు, సమాధులపై మొలచిన గడ్డిచెట్లు, కొమ్మలపై పక్షులు, పువ్వులపై సీతాకోకచిలుకలు, తూనీగలు, గాలి, బూడిద, మబ్బుపట్టిన మేఘాలు నిండిన ఆకాశం ఎర్రని మట్టినేల, పశ్చిమాన అస్తమిస్తున్న సూర్యకిరణాలు అన్ని ఆదిలక్ష్మమ్మగారి మరణ స్పర్శతో కలత చెందాయి.

ఆ సంధ్యా దృశ్యమే కన్నీట కరిగింది. ఆకాశంలో చంద్రోదయ మయింది.

తదియ నాటి చంద్రుడు లేత వెన్నెల రేఖలు ఆకాశం పలకమీద గీస్తున్నాడు. దు:ఖంతో వెన్నెల కూడా వెలవెల పోయింది. దూరంగా పేరు తెలియని పిట్ట కూత పెడుతుంది.

లాయరు గారు గీతని పిలిచి చెప్పారు. “ఇదిగో అమ్మాయి అమ్మమ్మ గారి రుద్రాక్షమాల నిన్ను తీసుకోమని రాసింది” అని.

“వాళ్ళ అబ్బాయికి, కోడలికి చెప్పండి” అంది గీత నిర్లిప్తంగా ‘అనాయ సేన మరణం వినాదై న్యేన జీవనం’ అన్నారు కదండీ పెద్దలు. ఆవిడకు ఆ రెండూ దక్కాయి” అన్నారు ఊరి గుడిలో పూజారి అవధానిగారు.

“అంతేకాదు” ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయః అన్నారు కూడా. ఆవిడకి ఊరి పెద్దలు, అగ్రవర్ణాలవారి ఋణం లేదు. తక్కిన ప్రజల ఋణం ఉన్నది అన్నారు. ఊరిబడిలో హెడ్ మాస్టారు శంకరం. ఆయన తెలుగు బోధిస్తారు.

రామారావు నిశ్శబ్ధంగా అన్నీ వింటున్నాడు. తల్లికి దూరంగా ఉండి తానేం కోల్పోయాడో అతను ఈనాటికి గ్రహించాడు. యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయ్యుండి అతడు సెలవుల్లో కూడా తల్లీ వద్దకు వచ్చి ఉండేవాడు కాదు. నార్త్‌టూర్ అని, సౌత్ టూర్ అవి జీవితాన్ని అనుభవించే హడావుడిలో ఉండేవాడు. తన దగ్గరికి వచ్చి ఉ ండమంటే ఆవిడ ఎందుకు రాననేదో అతనికి అర్థమైంది ఈనాటికి. నాకున్న నలుగురూ ఇక్కడే ఉన్నారురా అబ్బాయి. మీదేముంది, పొద్దున పోయి రాత్రికి వస్తారు అనేది ఆవిడ. నిజంగా ఆదిలక్ష్మమ్మ గారికి ఉన్న నలుగురూ, నాలుగు పక్కలా మోసే నలుగురూ, వెంటవచ్చే నలుగురూ, ఇక్కడే ఉన్నారు అనుకున్నాడు రామారావు.

పరిపూర్ణత్వం నిండిన జీవితం జీవించిన ఆ ఋషివంటి స్త్రీమూర్తి మగ్గిపోయిన పండువలె రాలిపోయింది. నాలుగు అనుభవాలను మిగుల్చుకుని, నలుగురికీ తన జ్ఞాపకాలు మిగిల్చిపోయింది. పంచభూతాల్లో కలిసిపోయింది.

*(2013లో ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక;*
*సహరి పత్రిక పోటీలో 2.10.2021 ద్వితీయ బహుమతి పొందిన కథ.)*

# అమ్మ మనసు

**ఈ** రోజు మా చిన్నుగాడు తిరుపతి నుండి వస్తున్నాడు. చిన్నుగాడంటే మా వొక్కగానొక్క గారాల కుమారుడు. వాడు బెంగుళూరులో సీనియర్ సైంటిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. నిన్నటి రోజున తిరుపతిలో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని వాడి పరిశోధనల ఫలితాలు గుర్తించి శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుతోపాటు లక్షరూపాయల నగదు బహుమతిచ్చి సత్కరించింది మన ప్రభుత్వం. ఈ విషయం తెలిసిన నుండి నా శ్రీమతి మనసు వాడిపైనే ఉంది. కుమారరత్నం ఎప్పుడు వస్తాడా... వాడికి గుమ్మడికాయతో దిష్టి తీయాలని ఒకటే కాలు కాలిన పిల్లిలా పచార్లు చేస్తుంది మా ఆవిడ.ఎన్నో దేవుళ్ళ పేరు కలిపి పెట్టినా వాడిని మాత్రం 'చిన్నూ' అనే పిలుస్తుంది.

కళ్ళలో పెట్టుకుని పెంచుకొన్న తన గారాల పుత్రుని కోసం, తెల్లవారుజామునే లేచి, వాడికి ఇష్టం అని పులిహోర, భక్ష్యాలు, ఫ్రూట్‌సలాడ్, బేబికార్న్ మంచూరియా, కద్దూక మీఠా, సాంబారు, ఉల్లికారం దొండకాయ, వగైరా వగైరా ఎన్నోరకాలు చేసింది.

"పులిహోర, భక్ష్యాలు ఇంట్లో దేవుడికైనా పెట్టావా లేదా? ఆయన నిజంగానే తింటాడేమో అని ఊరుకున్నావా! ఆ ఏం లేదు నాకు డౌట్ వచ్చి అలా అన్నాను

లేవే! పోనీ ఇవన్నీ నీ పుత్రరత్నానికేనా నేను తినవచ్చునా; లేక వాడు తినేశాక మిగిలితే తినాలా?" అని అడిగాడు.

దానికి అంతెత్తున లేచింది. "చాల్లెండి. సంబడం మీ దిష్టే తగిలేట్టుంది. పిచ్చికన్నడు సంవత్సరం నుండి వచ్చిరాని స్వయంపాకం మెతుకులు తింటున్నాడు కదా! నోరు చప్పబడి పోయుంటుంది. కమ్మగా, కారంగా, తియ్యగా తింటాడు పిచ్చినాన్న ఇవ్వాళ" అన్నది.ఆమెకు కొడుకంటే ఉన్న ప్రేమ కళ్ళలో, ముఖంలో సంపూర్ణంగా ప్రతిఫలిస్తూంది.అయితే ఇవాళ నీ చిన్నికృష్ణుడికి ఆరగింపు అయ్యేవరకు ఈ పతిదేవునికి పెట్టేది లేదేమో".

"చాల్లెండి సరసం, వాడొచ్చే టైమయింది. కలిసి తిందాం కాస్త ఆగవచ్చు కదా! పుట్టవ్వను పిలిచి దిష్టి తియ్యడానికి అన్నీ సిద్ధం చెయ్యమనండి, వెళ్ళండి" త్వరగా అని గదమాయించింది.

"చిత్తం అమ్మగారు" అంటూ నేను బయటకు వచ్చాను.తల్లులు కొడుకుల్ని అధికంగా ప్రేమిస్తారని,కూతుళ్ళకన్నా కొడుకులంటేనే ఎక్కువ ఇష్టం అని అంటుంటారు. పైగా నా శ్రీమతి అయితే "ఒక్కడే కొడుకని మరీ హెచ్చులు పోతుంది. ఈమె ప్రేమతో" అని అంటుంటారు మా బంధువర్గంలో. కాని నాకు అయితే ఆమె పుత్రవాత్సల్యం వైవిధ్యభరితంగానూ అనురాగపూరితంగాను, ఒక్కోసారి పిచ్చి ప్రేమగాను అనిపిస్తుంటుంది.

ఇంతలో కారు హారన్ వినిపించింది. మా యువరాజు కారు దిగాడు. ఆడి కారులో దాదాపు ఆరడుగుల పొడవుండేవాడు గంభీరంగా దిగుతుంటే నాకు లోలోన ఎంతో సంబరంగా ఉంది.పుట్టవ్వ దిష్టి తీశాక "అమ్మా" అన్నాడు వాడు తన తల్లిని చూసి. అప్పుడు నా శ్రీమతి కళ్ళల్లో వెలిగిన కోటి దీపాల వెలుగు రాముడి కోసం ఎదురు చూస్తున్న శబరిమాతల వర్ణించడానికి తరమూ కాదు. ఆ అన్నమయ్య ఏమైనా వర్ణించగలరేమో.

నీలం రంగు జీన్స్ ప్యాంట్ మీద , స్కైబ్లూ చెక్స్ వున్న షర్ట్ టక్ చేసుకున్నాడు. బంగారు రంగులో వున్నవాడు బ్లూషర్ట్‌లో మరింతగా మెరిసిపోతున్నాడు. నుదుట చిన్న కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. సన్నని అద్దాలతో ఫ్రేమ్‌లెస్ కళ్ళజోడు, చక్కగా క్రాపు దువ్వుకున్నాడు. సంవత్సర కాలంలో బెంగుళూరు చల్లదనానికి కొంచెం ఒళ్ళు చేసి ముద్దుముద్దుగా బొద్దుగా ఉన్నాడు.నా శ్రీమతి వాడి బుగ్గలు, భుజాలు, జుట్టూ

చేతులు, నడుము నుండి కాళ్ళ వరకూ, తన రెండూ అరచేతులతో అప్యాయంగా స్పృశిస్తూ నిమురుతూ కళ్ళనిండా నీళ్ళతో "పిచ్చినాన్నా- ఎంత చిక్కిపోయావురా! కడుపునిండా తిండి తిని ఎన్నాళ్ళయిందో" అంటూ కొంగుతో ఒకటే కళ్ళు తుడుచుకుంటుంది. అమ్మ చూపులకు తన పిల్లలు చిక్కినట్లుగానే కనిపిస్తారేమో ఎప్పుడూ.

"ఏమిటే అమ్మా! నేను బాగానే ఉన్నాను కదే.నా ఫ్రెండ్స్ అయితే ఎర్రగ్గా, బుర్రగా, లావుగా అయ్యావనిఅంటున్నారు. అయినా నీకు యింత పిచ్చిప్రేమ తగదే" అంటున్నాడు తనకు దగ్గరగా తల్లిని పొదివిపట్టుకుని చిన్నూ.

"ఎవడు వాడు అన్నది. నీకు పెద్ద దిష్ఠి తీయిస్తానుండు పుట్టవ్వ చేత'' అంది కళ్ళు తుడుచుకుంటూనే. "నీకోసం, నీకిష్టమైనవి అన్ని చేశానురా కన్నా అన్ని తిన్నాకనేరా మీ ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడేది".

ఆ తల్లీ కొడుకుల ఆప్యాయతానురాగాల జల్లులో తడిసి ముద్దయిన నాకు, నా కళ్ళలో చేరిన ఆనందభాష్పాల పొరచాటున వాళ్ళిద్దరూ తల్లి ఒడిలో గారాలు పోతున్న పసివాడి కమనీయ పాలరాతి శిల్పంలా గోచరిస్తున్నారు.

ఆమె "కన్నా! నీకోసం అమ్మ నాలుగు గంటలకే లేచింది.ఆమె ఆలోచనలతో నాకూ నిద్రలేదు. నీకు ఇష్టమని చాలా ఐటమ్స్ చేసింది. అవన్నీ నువ్వు తినకపోతే చాలా బాధపడుతుందిరా" అంటున్న నన్ను 'చాల్లెండి ఆపండి మీ గోల.పద నాన్నా ఎప్పుడు తిన్నావో ముందు పెద్ద గ్లాసు పాలు త్రాగి,గారెలు, వడలు, భక్ష్యాలు తిని, తొందరగా భోజనం చేసేద్దువుగాని..." అంటూ కొడుకు చేతులు పట్టుకుని లోపలికి తీసుకువచ్చింది. ఇవన్ని తినేసి "తొందరగా భోజనం చేయాలిట ముద్దుల కొడుకు. నాలోన నేనే నవ్వుకున్నాను. తల్లికి ఎప్పుడూ కొడుకు కడుపునిండా తినిపించాలనే ఆరాటం.అందుకే తల్లి కడుపు తడుముతుంది.ఆలి జేబు తడుముతుంది' అనే మాట వాడుకలో ఉంది.

వాడు వెంటనే తన బ్యాగ్ తెరచి "ఇదిగో అమ్మా... నీకోసం, నాకు పురస్కారంలో ఇచ్చిన నగదు లక్షరూపాయలు నీకు, శాలువా, మెమెంటో నాన్నకు" అని ఇచ్చాడు. ఆ లక్ష రూపాయలతో నీకు ఏవి కావాలనిపిస్తే అన్నీ కోనుక్కోమ్మా అని వెయ్యి రూపాయల నోట్ల కట్ట అమ్మ చేతికిచ్చాడు. వెంటనే చిన్నూని తన గుండెలకి హత్తుకుని, నా కన్నతండ్రి, నేను మీ నాన్నగారు ఎప్పుడూ ఇంత డబ్బు కళ్ళ చూడలేదు. నీవు ఇంత ప్రయోజకుడవు అవుతావని మేము కళ్ళో కూడా ఊహించలేదురా

కన్నా,వెయ్యేళ్ళు సుఖంగా జీవించునాన్నా...” అంటూ మళ్ళీ కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుంది.

నాకు క్షణక్షణం గుండె చెరువవడం, మరల తేరుకోవడం ఏమిటో పుత్రవాత్సల్యం ఆమెంతగా నేను వ్యక్తం చేయలేకపోతున్నందుకు నాకే సిగ్గనిపిస్తుంది. మా చిన్నుగాడిని యల్.కె.జి.లో చెర్పించడానికి వెళ్ళినపుడు మావాడు యావరేజ్ స్టూడెంట్ అయినా సరే.. సార్ ముఖం చూసి చేర్చుకుంటాం లెండి అని కాన్వెంట్ వాళ్ళు అంటే వెంటనే వాడి ఆన్సర్‌షీట్ తెప్పించి రీవాల్యూయేషన్ చేయించి అశ్రద్ధగా పేపర్ దిద్దారని వాళ్ళని తిట్టి,అవును మెరిట్ స్టూడెంట్ మావాడు అని వాళ్ళచేతనే అనిపించి మరీ చేర్పించింది. మరి వాడు ఉత్తమ భారతీయ తల్లికి కొడుకు కదా! తల్లే మొదటి గురువని అన్ని తానై ముందుకు నడిపించింది.

సెవెన్త్ క్లాస్ పరీక్షలకు నిద్రాహారాలు మాని వాడిలోని పట్టుదల పెంచుతూ చదివిపించి జిల్లా ఫస్ట్‌ని చేసింది. టెన్త్‌క్లాస్‌లో రాష్ట్రంలో మొదటి పది మందిలో రావాలని వాడితోపాటు నిద్రలేని రాత్రులు గడిపి సాధించింది. ఇంటర్మీడియెట్ రాష్ట్రంలో ప్రథముడిగా రావాలని రెసిడెన్షియల్ కాలేజీకి ప్రతి పదిహేను రోజులకొకసారి వెళ్ళి వాడికి బాగా తినిపించి, వాడిలోని ఆత్మవిశ్వాసం పెంచి, ప్రేమానురాగాలు కురిపించి, వాడిని ప్రిపేరు చేసి రాష్ట్రంలో రెండోవాడిగా నిలబెట్టింది. అలాగే ఎంసెట్ ఫస్ట్ ర్యాంకర్ అయ్యాడు. తన కొడుకు గొప్ప సైంటిస్టు కావాలని కోరుకున్నది. ఫార్మసీ దూరప్రాంతంలో వచ్చిందని ఒకటే బెంగపడిపోయింది.పి.జి.లో దేశంలో మొదటి ముప్పయి మందిలో ఒకటిగా వచ్చాడు. ఆ తరువాత బెంగుళూరులో ఒక అంతర్జాతీయ పరిశోధనా సంస్థలో వాడికి నెలకు లక్షరూపాయలు జీతంతో ఉద్యోగం ఇచ్చారు. ఈ వార్తా తెలిసిన రోజు దేవుళ్ళందరికీ కృతజ్ఞతలు తెల్పుతూ మొక్కులు తీర్చుకుంది. చిన్నూను చూడకుండా నేనెలా ఉండాలని ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఎప్పుడొస్తాడని ఒకటే ఎదురుచూపు వాడు వచ్చాక వాడిని కాసేపు గుండెలకి హత్తుకుని వదలనే లేదు.

ఇటువంటి పిచ్చితల్లీ మరివాడికి పెళ్ళి చేసి మరో స్త్రీ చేతిలో పెట్టాలి. మరి ఈ పరిణామానికి ఆమె సిద్ధంగా ఉందా? అని నా మనసు నన్ను ప్రశ్నించింది.

ఒకవేళ నేను ఆమెను ఈ విషయమై ప్రశ్నిస్తేనో లేక ఆమెను ఆమార్పుకు అనుగుణంగా ప్రిపేర్ చేస్తేనో... అమ్మో... ఊహల్లో కూడా ఆమె భరించలేదు.

చిన్నూ రేపు వెళ్ళిపోతాడు. నా శ్రీమతి ఈ నాలుగు రోజులు ఒక ఊహల ప్రపంచంలో తన ముద్దుల కొడుకుతో విహరించిందనే చెప్పాలి.

"ఏమోయ్ మీ అబ్బాయి రేపు వెళ్ళిపోతున్నాడు కదా! మరి..."

"మరి అంటే ఏమిటి?"

"మరీ కొడుకు అంటే ఇంత వెర్రి ప్రేమ పెంచుకోకు. ఈ భవబంధాలు, వెర్రి ప్రేమలు మనల్ని, మన మనసుల్ని కట్టిపడేసి ఉక్కిరిబిక్కిరి చేసేస్తాయి...."

"చాల్లెండి, వేదాంతం. పిల్లలంటే ఎవరికి ఇష్టం ఉండదు?"

"అది సరే మన చిన్ను గాడికి మరి పెళ్ళి చేయాలి కదా! మరి వాడు పెళ్ళయ్యాక కొత్త పెళ్ళాం కొంగు పట్టుకుని అనుక్షణం ఆమె నీడలో తిరిగాడే అనుకో... నువ్వు భరించగలవా?"

"అదేం కుదరుదు. బాగా బీదింటిపిల్లని చేస్తాను. అది మన దగ్గర అణిమణిగి వుంటుంది. మనం చెప్పినట్లల్లా వింటుంది. గొడవే లేదు. వాడిని మన ఊరుకు దగ్గర వేయించుకోమంటాను. మనం వాడి దగ్గరకు వెళ్ళిపోదాం అక్కడే వుందామండి!"

"వాడి ఉద్యోగం మనకు దగ్గరగా ఉండదే పిచ్చమ్మా! అదేం కుదర్దు. ఉండాల్సిందే..." అంది నా నోరు రెండు చేతులతో మూసేస్తూ.

"ఏమో మనం మన ప్రమేయం లేకుండానే ఈ లోకంలోకి వచ్చేస్తాం. ఆ తరువాత ఏవేవో బంధాలు పెనవేసుకుని అందులోంచి కదలలేని స్థితిలో పడిపోతాము. అంతేకాని మనం ఈ బంధాలను ఏదో ఒక దశలో వదిలేయాల్సి వస్తుందని ఊహల్లోకి కూడా రానివ్వలేం" అంటున్న నా మాటలను ఆపి, "మొదలెట్టారా.... వేదాంతం చెప్పడానికి ఇంకా చాలా సమయం ఉంది." అంది. ఎందుకు చెప్పుతున్నానంటే చిన్నూకు పెళ్ళి చేశాక వాడికి పెళ్ళాం, పిల్లలు, వాడి సంసారం ఆ తరువాత మనం. మొదటిస్థాయి నుండి రెండవ స్థాయికి చేరాల్సిందే..." అందుకు వెంటనే ఆమె "అయితే..." అంది కోపంగా.

"అందుకని మన బంధాలను పెంచుకోవడమొక్కటే కాదు. సర్దుకు పోవడం కూడా నేర్చుకోవాలి. అయితే అనాదిగా మనం బంధాలు పెంచుకోవడమే నేర్చుకున్నాం గాని సర్దుకుపోవడం గాని, ఆ బంధంతో మనస్పర్థలు వచ్చినప్పుడు భరించడం ఎలాగో నేర్చుకోలేదు. కారణం మనం ఈ జీవిత వలయంలో చిక్కుకుపోవడం వలననే..."

"చాల్లెండి పడుకొండి, వాడిచ్చిన లక్షరూపాయలు బ్యాంక్‌లో వేసుకోమని వాడికే ఇచ్చేస్తాను. అయినా మనకెందుకూ..." అంది.

"అలాగే" అన్నాను.

చిన్నూ బెంగుళూర్ వెళ్ళాడు. ఉదయం ఉపాహారంలోనూ, మధ్యాహ్నం భోజనంలోనూ, రాత్రి డిన్నర్‌లోనూ, చిన్నూ తలపులు, కబుర్లూ నా శ్రీమతి కలగలిపి పెడుతూనే ఉంది. కొడుకు అనుబంధంలోని సుగంధాన్ని మా కడుపుల నిండా నింపుతూనే ఉంది.

కొన్నిరోజుల తరువాత ఒకరోజు రాత్రి పదిగంటలకు ఫోన్ వచ్చింది. నా శ్రీమతి మాట్లాడింది వాడితో,తన శరీరంలోంచి రక్తమాంసాలు లాగేసినట్లుగా, అప్పుడే గుండె ఆపరేషన్ చేశాక థియేటర్ నుండి తీసుకు వచ్చిన పేషెంట్‌లా అయిపోయింది.

ఫోన్ పెట్టేసి మంచంపై నిస్త్రాణంగా వాలిపోతున్న నా శ్రీమతి తలను నా ఒడిలో ఉంచుకుని "ఏమయింది?" అన్నాను. "వాళ్ళ కంపెనీ యం.డి. గారి అమ్మాయిని పెళ్ళి చేసుకోమన్నారుట. త్రీ బెడ్‌రూం ఫ్లాట్, కారు, వగైరాలు ఇస్తామన్నారుట. ఒకర్తే కూతురట. అమ్మాయి చాలా బాగుంది. శుభవార్త... అని చెప్పాడు" అని మరలా పడిపోయింది.

మా చిన్నూ స్త్రీ పురుషుల ఆకర్షణకూ, కొత్త దంపతుల అనురాగాలు, ముద్దుముచ్చటలకూ, భార్య మాత్రమే ఇచ్చే స్వర్గసుఖాలకూ అతీతంగా తనను అమితంగా ప్రేమించే అమ్మను ఇంతటిముందులాగే ఆదరిస్తాడా? ఒకవేళ అలా జరగకపోతే ఈ పిచ్చితల్లి ఏమైపోతుంది?అనేకమైన ప్రశ్నలు నా మస్తిష్కాన్ని పొడిచి పొడిచి వేధిస్తున్నాయి. కాలమే ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలి.

దయనీయ స్థితిలో వున్న నా శ్రీమతిని చూస్తున్న నాకు, నా కంటినిండా నీరు చేరడంతో హాలులో మా చిన్నూగాడు మా ఇద్దరిని దగ్గరగా పొదివిపట్టుకున్న లైఫ్‌సైజు ఫోటోలో ఒక్కక్షణం వాడు మసకమసకగా కనిపించాడు.కాదు చిన్నప్పటినుండే ఎప్పుడూ చూస్తున్న తల్లిదండ్రులే మసకబారిపోతారేమో... ఏమో...

*(08-02-2017న వరంగల్ ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక, హుస్నాబాద్ కథలపోటీ 8.7.21 తృతీయ బహుమతి పొందిన కథ)*

# తెలుగు తల్లి ఒడిలో

**రా**త్రి బడిలో ఆకాశం భూమి పలకమీద చినుకు కలంతో అక్షరాలు దిద్దుతుంటే ధరణితల్లి పులకించిపోతున్న వేళ.

తెల్లవారితే సంస్కృతిని స్కూల్‌లో చేర్పించే సమయం,ప్రొద్దుటే యుద్ధవాతావరణం. ఆవేళలో ఉన్నట్లుండి సాహితి మూడీగా మారిపోయింది. ఆమెను సమాధానపర్చడం తనవంతే తప్పదన్నట్లుగా మెల్లగా ఆమె వద్దకు వచ్చి ముక్తాయింపుగా "సాహితీ" అన్నాడు ఆనంద్.

అది గ్రహించి మరీ మౌనవ్రతం పట్టినట్లుగా ఉండిపోయింది సాహితీ.

"అది కాదురా" అన్నాడు ఆనంద్.

"వద్దు! నాకేం చెప్పొద్దు!" అంటూ మరింత ముఖం ముడుచుకుంది సాహితీ.

"నీకు మంచి అనిపించింది నాకు చెడుగా అనిపించవచ్చుగా. రేపు తీరిగ్గా ఆలోచిద్దాంలే. రావోయ్! పడుకుందాం" అన్నాడు ఆనంద్.

"ఊహూ! వీల్లేదు. ఇప్పుడే తేలిపోవాలి". మంకుపట్టు పట్టుక్కూర్చున్న భార్యామణిని ఎలా లొంగదీయాలా అని శతవిధాల ప్రయత్నిస్తున్న ఆధారం దొరకటం లేదు.

మౌనం నాట్యమాడుతుంటే... ఏంటా అని ఒక కన్ను తెరిచి చూసింది సాహితీ. ఆలోచనల్లో ఉన్న ఆనంద్ కనిపించాడు.ఎక్కడ చూస్తాడోనని చటుక్కున కళ్ళు మూసుకుంది.

"అన్నీ నీ యిష్టమొచ్చినట్లుగానే చేస్తున్నాను కదా! అమ్మాయికి పేరు పెట్టటంతో సహా. ఈ ఒక్కసారి నా మాట వినవచ్చుగా" అన్నాడు ఆనంద్.

"ఎందుకు వినాలి? చెప్పేది మంచిదయితే ఎన్నిసార్లయినా వినచ్చు" అంది సాహితీ.

"నేనన్నది తప్పని ఒక్కరితో అనిపించు చాలు" అన్నాడు ఆనంద్ సవాల్ చేస్తూ.

"అదే మాట నా మాట కూడా".

"అంతేనా..." నీరసపడ్డాడు ఆనంద్.

ఈ రాత్రిపూట ఎవరిదగ్గరికి తీర్పుకెళ్ళాలిరా బాబు అని ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయాడు ఆనంద్. నిద్రపోతున్న ఆనంద్‌ను చూసి జాలికలిగింది సాహితికి. ఆలోచిస్తూనే ఆత్మ విమర్శ మొదలయింది తనకి.

'ఆ... ఏమవుతుందట' ఎదురుతిరిగింది మనస్సు.

'అదేమిటే అలా అంటావ్' విస్తుపోయింది.

'మీ ఆయన చెప్పేదాంట్లో కూడా కొంత ఇది ఉంది. కాస్తంత అర్థం చేసుకో'.

'ఇది అంటే'

'విషయం'

'లేదని ఎవరన్నారు?'

'మరింకేం ఒప్పుకోవచ్చుగా'

'నువ్వు కూడా నన్ను అర్థం చేసుకోలేదన్నమాట' విరక్తి ఆవహించింది తన మనస్సు పైన. తాడు తెగేదాక లాగుతుంది. తన కర్తవ్యం గుర్తుకొచ్చింది.

"ఏమండీ" అంది నెమ్మదిగా.

నిద్రలో ఉలిక్కిపడి లేచి గాంభీర్యంతో "ఏంటీ... మరేమో, మరేమో చెప్పాల్సిందేదో త్వరగా చెప్పు నిద్రొస్తుంది" అన్నాడు.

అధికారింపు ధోరణిలో "సరేనండీ" అంది ముక్తసరిగా.

అప్పటివరకు అంత హఠం చూసి సర్వం చేజారిన ఆస్తిపరుడిలా డీలాపడ్డ ఆనంద్ గొప్ప బంపర్ లాటరీ దొరికినంత ఆనందపడుతూ నిద్రలోకి జారిపోయాడు.

ఇదంతా ఏమిటి అని అసలు నిన్నటి నేపథ్యం కళ్ళముందు కదలాడింది సాహితికి. 'నేతాజీ స్కూల్'లో తమ గారాల బిడ్డ 'సంస్కృతి'ని చేర్చడానికి వెళ్ళారు ఆనంద్ సాహితీలు.

అక్కడ ప్రిన్సిపాల్ వసుంధర వాళ్ళను చక్కగా పలకరించి కుర్చీల్లో కూర్చోమని మర్యాద చేశారు. అంతా బాగానే ఉంది. అప్లికేషన్‌లో సెకండ్ లాంగ్వేజ్ ఏం రాయాలి అన్న దగ్గర గొడవ మొదలైంది. సాహితి 'తెలుగు' అంటుంది. ఆనంద్ హిందీ రాద్దామంటాడు. విషయం అక్కడ తేల్చుకోలేక, వాళ్ళందరి ముందు చర్చించుకోవడం బాగోదని బయటకొచ్చేశారు. రేపు డొనేషన్ కడతామని.

సాహితి రుసరుసలాడుతూనే ఉంది. తన మాట వినటం లేదని అర్థం చేసుకోవటం లేదని, అర్థమయ్యేలా చెప్పే అవకాశం ఇవ్వటం లేదని ఆనంద్, వాళ్ళిద్దరికీ మౌనాన్ని ప్రసాదించే దేవుడిలా ఆటో డ్రైవర్. సంఘం, కట్టుబాట్లు అని ఎన్నోసార్లు తిట్టుకుంటాం కానీ, ఇలాంటి వాటివలన ఎన్నో అనర్థాలు గొడవలు, వాదాలు, తగ్గుతాయనటానికి ఇదే నిదర్శనం. అదే వాళ్ళు కారులో వెళ్ళుతున్నారనుకుందాం. ఇక ఇద్దరూ ఆవేశాన్ని ఆపుకోలేక దారిలోనే అరుచుకునేవాళ్ళు, ఆ టెన్షన్‌లో ఆనంద్ ఏ ఆక్సిడెంటో చేసేవాడేమో ఈ రోజు కారు డ్రైవర్ రాకపోవటం, కారు రిపేరులో ఉందని డ్రైవర్ చెప్పటం చాలా మంచిదయింది.

అసలు వీళ్ళది అన్యోన్యతా దాంపత్యమే. ఒకరికి ఇష్టమున్నా, లేకున్నా అవతలివారు చెప్పే మాటను ఒప్పుకొని సామరస్యంగా, రసవంతంగా జీవితాన్ని సాగించే జంట. ఇద్దరిదీ సర్దుకుపోయే మనస్తత్వాలే కానీ! ఈ విషయంలో మాత్రం రాజీపడకపోవడం విచిత్రమే! అసలు వాళ్ళ ఊహలు వారికే తెలియాలి. ఇంతవరకు మనసు విప్పి మాట్లాడుకుంటే కదా! సమస్య పరిష్కారం అయ్యేది.

సాహితికి తెలుగు అంటే ప్రాణం. తను తెలుగులో లిటరేచర్ చెయ్యాలనుకుంది. కుదరలేదు. కానీ చిన్నప్పటినుండి సాహిత్యంతో స్నేహం చేసి ఆ లోటు తీర్చుకుంది. చిన్నచిన్న కవితలు,వ్యాసాలతో ప్రారంభించి, కథలు, నవలలు రాయటం వరకు ఎదిగింది. నవలా రచయిత్రిగా మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చుకుంది. అందుకే 'సంస్కృతి'కూడా తెలుగు తీసుకోవాలని అంతగా పట్టుపట్టడం.

ముత్యాలు, మల్లెపూవులు ఎంత అందమో మన తెలుగు అక్షరాలు అంతే అందమైనవి. తెలుగు భాషలో ఉన్నంత సుగంధం మరి దేనిలో లేదనేది ఆమె ఆలోచన. అది తన కూతురికి కరువటం.. ఆమె మనసు అంగీకరించటం లేదు. తను రచయిత్రి కావటంతో అది మరీ ఇబ్బందిగా అనిపిస్తోంది.

ఆనంద్ ఎందుకిలా తర్కిస్తున్నాడు. అతనికి తెలుగు అంటే ఇష్టమే. నీకంటే

ఎక్కువ ఇష్టమని ఉడికిస్తుంటాడు కూడా. మరెందుకిలా ఎదురు తిరుగుతున్నాడు. తనకు మాత్రం హిందీ ఇష్టం లేదు?కాకపోతే తెలుగు ఉన్నా హిందీ భాష తీసుకోవటానికి తను ఇష్టపడడం లేదంతే. ఆనంద్‌ని ఎలాగయినా ఈ విషయంలో కన్విన్స్ చేయాలి.అసలే ఇంగ్లీష్ మీడియం చదువుతో తెలుగు జ్ఞానం 'శూన్యంలా' ఉంది పరిస్థితి. ఇది కూడా లేకుంటే మరీ అధ్వాన్నంగా తయారవటం ఖాయం. తెలుగు గడ్డపై పుట్టి తెలుగు రాకపోవటం కన్నా ధారుణం ఉందా?అసలే తెలుగు కనుమరుగమవుతుందని ఉ ద్యమాలు.

అసలు మన భాష మనకు కావాలని మనమే ఉద్యమాలు చేయాల్సి రావటం అంటే ఎంత సిగ్గుచేటు?మాతృభాషలేని చదువు ఒక చదువేనా? ఇక ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోయి తీరం చేరే అలలా మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చింది.సాహితి. తిరుగులేని నిర్ణయంతో తన బిడ్డ తెలుగు భాషను దూరమవ్వటం మాత్రం జరగని పని అని గట్టిగా అనుకుంది.'తెలుగును దూరం చేసుకోవటం అంటే కన్నతల్లిని వదిలివెళ్ళటమే. అని తనను తాను ఓదార్చుకొన్నాక హృదయం కాస్త తెరపిన పడింది.వీటన్నింటికి మూల కారకురాలు 'సంస్కృతి' మాత్రం ప్రశాంతంగా నిద్రపోతుంది.

అది చూసి నవ్వుకుని నిద్ర నటిస్తున్న ఆనంద్‌ను "ఆనంద్ ఆనంద్' అని తట్టిలేపింది సాహితీ. ఆనంద్ సాహితీ ముఖంలోకి చూశాడు.కోపం ఛాయలు సాహితిలో కన్పించకపోవటంతో ఎగిరి గంతేసినంత పనిచేశాడు మనసులో. అన్న పెళ్ళి అయిపోతే తమ్ముడికి లైన్ క్లియర్ అన్నంత ఆనందం అతని ముఖంలో కన్పించింది.

ఇప్పుడు చెప్పు ఆనంద్ అంది సాహితి సాలోచనగా. 'అది కాదు సాహితి తెలుగంటే నాకు ప్రాణమే! అది నీకు తెలుసు. దానిని వదలాలని నాకు మాత్రం ఉంటుందా?

కానీ తెలుగు చదివితే మన ప్రాంతం వరకే పరిమితం.అదే మన రాష్ట్రం దాటితే ఇంగ్లీషు,హిందీ తప్ప మరేది మాట్లాడరు.మనం టూర్ వెళ్ళినపుడు ఎంత అవస్థ పడ్డాం.నువ్వే గుర్తు తెచ్చుకో.

ఇంగ్లీష్ వచ్చినా లాభం లేకపోయింది. కొన్నిచోట్ల హిందీ తప్ప తమకే భాష రాదని చెప్పారు. అవునా? అన్నాడు ఆమెనే గమనిస్తూ.

"అవును" తల వూపింది సాహితీ.

నిజంగానే ఇష్టమైన వస్తువులు కొనాలన్న మనకు వాళ్ళు చెప్పేది మనకు అర్థమయ్యేది కాదు. తను చెప్పేది వాళ్ళకు అర్థమయ్యేది కాదు.

గైడు దగ్గర కూడా అదే బాధ. ఆ ప్రాంతాన్ని చూస్తున్న ఆనందం. వాటి గురించి అతను చెపుతున్న తమకేమి అర్థం కాకపోవటం ఎంతో ఇబ్బందిని కలిగించింది. అప్పుడే తను ఒక నిశ్చయానికి వచ్చింది. హిందీ బాగా నేర్చుకోవాలని అలాగే పట్టుపట్టి నేర్చుకున్నది కూడా. ఇప్పుడు ఎవరు హిందీ మాట్లాడినా తనకు అర్థమవుతోంది. కానీ తను మాట్లాడలేకపోతుంది.

ఏం మాట్లాడాలో తెలుసుకునే సమయానికి అది ప్రోడ్యూస్ చెయ్యలేకపోతుంది.

అది ఒక్కసారిగా కాకుండా వాడుక మీద రావాల్సిందే! అందుకే రోజులో కాసేపయినా ఆనంద్, తనూ హిందీలో మాట్లాడుకోవాలనుకుని నియమం పెట్టుకున్నారు. అలాగే రోజులో ఓ అరగంట మాట్లాడుకొని హిందీని ఇంప్రూవ్ చేసుకుంటున్నారు.

ఇప్పుడు అర్థమయింది ఆనంద్ 'సంస్కృతి' విషయంలో ఎందుకంత పట్టుపట్టాడో! తాము పడ్డ భాధ 'సంస్కృతి' ఎదుర్కోగూడదని, ఏ తల్లిదండ్రులయినా ఇలాగే కదా ఆలోచించేది? 'సాహితీ'! నీ మౌనం నన్నెంతో బాధిస్తోంది" అన్నాడు. ఇంత చెప్పినా అర్థం చేసుకోలేకపోతుందా అనే నీరసరవం అతని గొంతులో జీరలు. సంస్కృతిని ఆ భాషలో ప్రావీణ్యురాలిని చెయ్యాలనుకొన్నాను" అన్నాడు. తమ సంభాషణకు ముగింపు వాక్యం అదే అన్నట్లుగా.

అపుడు నోరు విప్పింది సాహితి. మరి మన సంస్కృతికి తెలుగువద్దా? ఆ ప్రశ్నలో ఎంతో బేలతనం. దాగి ఉన్న తెలుగు మీద మమకారం వద్దన్నా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

అలా అడుగుతున్న సాహితిలో అమాయకత్వం ఎంతో నచ్చి వెంటనే ఆమె దగ్గరికి వెళ్ళి అలా అని నేను అన్నానా? దానికి తెలుగును మనమే ఇంట్లో నేర్పిద్దాం. స్కూల్లో అయితే ఒక్కరే తెలుగు మాస్టారు. మరి ఇంట్లో అయితే మనిద్దరం. నువ్వూ... నేను... ఇద్దరం తెలుగు మాస్టార్లమే కదా!... హ హో...హో..!! అంటూ నవ్వేశాడు.

ఆ నవ్వులో శృతి కలపలేదు సాహితి. ఇంకా ఆమెలో ఎన్నో సందేహాలున్నాయి. "ఇంట్లో చెబితే స్కూల్లో చదివినంత బాగా వస్తుందేమిటి?" ప్రశ్నలేసినా రాదనే ఖచ్చితమైన సమాధానం తనకు తెలుసున్నట్లే!

"ఎందుకు రాదు? అంతకంటే ఎక్కువే వస్తుంది. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం కాబట్టి నిన్ను మించిన పండితురాలు అవుతుందని నా నమ్మకం!" అన్నాడు కాస్త కవ్వింపు ధోరణిలో.

"మన మాట వింటుందా అని" అంది.

"ఎందుకు వినదు. మన రక్తం... మన భాష మన సంప్రదాయం కావాలని అడిగి మరీ చెప్పించుకుంటుంది" అన్నాడు ఆనంద్.

ఆనంద్ ఎంత బల్ల గుద్దినట్లు చెపుతున్నా... సాహితి పూర్తిగా అంగీకరించలేక పోతుంది. ఎంత మనసుకు సర్ది చెప్పాలని ప్రయత్నిస్తున్నా అది ఎదురు తిరుగుతూనే ఉంది. అది సరైన నిర్ణయం కాదని తేల్చి చెప్పేస్తుంది. "నిజమేనా" అని తనను తానే ఎదురు ప్రశ్న వేసుకుంది. అలా ప్రశ్నించుకోటం చేతకానితనంలా అనిపించిందామెకు మళ్ళీ! తన ఆలోచన తనకే సిల్లీగా తోచింది. నిజంగా తను తలుచుకుంటూ ఇది సాధించలేనిదా? ఇంటినే స్కూలుగా మార్చేయదు! కనుపాపలనే అక్షరాలు చూపే బ్లాక్‌బోర్డ్‌లా తన కన్నతల్లి ముందు నిలబెట్టదూ!

అసాధ్యాలను సుసాధ్యం చేయటం తనకు చిన్నప్పటినుంచీ అలవాటే ఈ ఒక విషయంలో ఇంత అధైర్యపడుతుంది ఎందుకు? ప్రతి నిముషం, ప్రతివిషయంలో తనకు ఆనంద్ సహకారం ఉంటుంది. అందులో డౌటే లేదు. ఇంకెందుకు అర్థంలేని సంశయాలు. మబ్బులు వీడిన ఆకాశంలా ఆమె మనసుకు కమ్మిన మేఘాలు తొలగిపోయాయి. తెలుగు అంటే తనకు ప్రేమే గానీ ఇతర భాషలంటే ద్వేషం లేదు. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత విజ్ఞానం అనుకుంటుంటే గతం గుర్తు వచ్చింది.

"సంస్కృతిని ఎల్.కె.జి. ఇంగ్లీషు మీడియంలో ఆనంద్ చేర్చాలన్నప్పుడే తను ఒప్పుకోలేదు. ఈ ఒక్కసారికి తన మాట వినమని బతిమిలాడాడు.

తెలుగు మీడియంలో చదివిన ఎంతమంది ఐ.పి.ఎస్ ఆఫీసర్లు, డాక్టర్స్, ఇంజనీర్స్ అవలేదు. అన్న ప్రశ్నను పక్కనబెడుతూ 'సంస్కృతి' ఇప్పుడు ఎన్నేళ్ళని? ఆ వయసుకు వచ్చాక అలాగే ఆలోచిద్దాం. ఇప్పటికీ ఇందులో చేర్చనీ. అని తన అభిప్రాయానికి అప్పటికి కామా పెట్టాడు. సరేనని అపుడు ఒప్పుకుంది.

మరి ఇప్పుడిలా... అయినా ఎప్పుడూ విజయం వైపే తన చూపు. అలాగే సాధించగలదని నమ్మకం కూడా! ఓటమిని తన కాలిగోటి దగ్గరకు కూడా దరి రాకుండా చూసుకోవటమే తనకున్న ఓ మంచి అలవాటు.

ఆలోచనలకి ఎప్పుడు స్థిరత్వం ఏర్పడిందో అప్పుడే.. అప్పుడే ఆమె కనురెప్పలు మూతపడటం ప్రారంభించాయి. అది గమనించాక కాని ఆనంద్ కంటిమీదకు కునుకు రాలేదు.

సంస్కృతికి సాహితి దగ్గర తెలుగు నేర్చుకోవటం ఎంతో ఇష్టంగా ఉండేది. పరీక్షలు పెట్టటం మార్కులు వేయటం. గెలిచిన ప్రతిసారి చాక్లెట్ ఇవ్వటం ఇవన్నీను. ఒక్కోసారి తననే రెడ్ ఇంక్ పెన్‌తో దిద్దుకోమనటం సంస్కృతికి ఎంతో నచ్చేది. ఆ కాసేపు తనే ఓ మాష్టారులా ఫీల్ అయి తెగ ఆనందపడేది. అందుకే స్కూల్ వర్క్ ఎంత ఉన్నా తెలుగు చదవటానికి బద్ధకించేది కాదు. అది నేర్చుకుంటే గానీ నిద్రపోయేది కాదు. తల్లికి పాఠాలన్నీ అప్పచెప్పేసినా, ఆనంద్ రాగానే అతని పక్కన చేరి ఆ రోజు ఏం నేర్చుకుందో చెప్పి భలే చదువుతున్నావురా! అని తండ్రి మెచ్చుకుంటే కాని తృప్తిగా ఉండేది కాదు. అలా తన దగ్గరే తెలుగు నేర్చుకోవటం చూడటానికి వాళ్ళ రెండు కళ్ళు చాలవని మురిసిపోయేవారు దంపతులు.

ప్రతియేటా బజార్లో తెలుగు పుస్తకం కొనటానికి ముగ్గురు కలిసే వెళ్ళేవారు. ఆ రోజంతా ఆనందంగా గడిపేవారు. తిరిగి వచ్చాక కొత్త పుస్తకాన్ని అందులో బొమ్మల్ని ఆసక్తిగా చూసే తమ చిన్నారిని ముద్దులతో ముంచెత్తేవారు. అలా అమ్మఒడిలోనే మూడవ తరగతికి వచ్చేసింది సంస్కృతి.

పక్కింటి ప్రవళ్ళిక తన మూడవతరగతి నోట్స్‌తెచ్చి సాహితీకిచ్చి, “ఆంటీ! ఎప్పటిలాగే నా రిజల్ట్స్ రాగానే నా నోట్స్ సంస్కృతికి తెచ్చాను. బాగా చదివించండి” అంది.

“తప్పకుండా! ఉండు మామిడి జ్యూస్ చేసాను తాగి వెళ్ళువుగాని” అంది సాహితి.

“వద్దు ఆంటీ వెళ్తాను”.

“ఫరవాలేదు” ప్రవళ్ళిక “నువ్వు అలా మొహాటపడితే నేను మా పాపకు నీ నోట్స్ ఎలా తీసుకుంటాను చెప్పు” అనటంతో చక్కగా త్రాగేసి వెళ్ళిపోయింది. సంస్కృతి గురించి తీసుకునే శ్రద్ధ చిన్నదయినా ప్రవళ్ళికను బాగా ఆకర్షించేది. అపుడపుడు తను కూడా వాళ్ళతో చేరి తెలుగు వెలుగును పంచుకుంటూ ఉండేది.

‘‘ప్రవళ్ళికయే కాదు’’ సంస్కృతి తీసుకునే శ్రద్ధకు అందరూ ఆశ్చర్యపోయేవారు. అలాగే సంస్కృతిలా ఇంట్లో ఇంతబుద్ధిగా చదువుకునే పిల్లలు అరుదనే మెచ్చుకునేవారు. ఇద్దరినీ పొగడని వారుండేవారు కారు. దానికి పొంగిపోక అది తన బాధ్యత. గర్వపడాల్సింది ఏమి లేదని చెప్పేది నిగర్వంగా. అలా అయిదవ

తరగతిలోకి అడుగుపెట్టింది సంస్కృతి. అప్పటికే తను స్వతహాగా ఆలోచించటం, రాయటం చేయగల స్థాయికి వచ్చేసింది.

సాహితి సంస్కృతితో ఈ రోజు ఒక సాహసం చేస్తావా అని అడిగింది. ఏంటమ్మా అది? చెప్పమ్మా! తప్పకుండా చేస్తాను అంది. సంస్కృతి.

"ఈరోజు గ్రంథాలయంకి వెళ్ళాం కదా! అక్కడ వెన్నెలమ్మ" పత్రికవాళ్ళు కథలపోటీ పెట్టారు. అందులో కథరాసి సెలక్ట్ అయితే పన్నెండు భాషలలో అచ్చువేయించి వస్తుందట. పిల్లలకు ప్రత్యేక సంచిక పెట్టాలనట, నువ్వెందుకు ప్రయత్నించకూడదు అంది. తన బిడ్డ తనకంటే గొప్ప రచయిత్రి కావాలనే ఉద్దేశంతో లోలోన మురిసిపోతూ తప్పకుండా రాస్తనమ్మా అని తన ఆలోచనలను పేపర్మీద పెట్టింది. సంస్కృతి కథ రాయటం పోస్ట్ చేయడం అయిపోయింది. బహుమతి వచ్చినా రాకపోయినా, ఆ కథ పడ్డా పడకపోయినా ఫరవాలేదు. సంస్కృతి తన వంతు ప్రయత్నం చేసింది. అదే చాలు అనుకుంది. తను నేర్పిన చదువుకు తగిన సార్థకత దక్కినట్లే భావించింది సాహితి.

ఆమె కష్టం ఊరికే పోలేదు. వెన్నెలమ్మ పత్రిక ఎడిటర్ సంస్కృతి కథని తన పత్రికలో ప్రచురించుకుంటున్నామని తెలియజేశారు. తరువాత ఆ సంవత్సరం పిల్లలు రాసిన కథలలో గొప్పగా ఉందని, అంత చిన్న వయసులోనే అంత పెద్దకథని, మంచి నీతితో రాసిన కథ అని. జాతీయఅవార్డును ప్రభుత్వం ప్రకటించింది.

సాహితికి అప్పటికిగానీ స్కూల్లో తెలుగు నేర్పించలేదని ముల్లులా మనసును పొడుస్తున్న బాధ తగ్గలేదు. ఇపుడు అదే పువ్వులా,నవ్వులా తయారయి మనసును గిలిగింత పెడుతుంది.

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏది లేదని మరోసారి ఋజువయింది. "తెలుగుతల్లి ఒడిలోకి" తన బిడ్డను చేర్చానన్న ఆనందం, పరవశం ఆమెను భూమిమీద నిలువనీయటం లేదు. మనసులో ప్రశంసల పల్లకీ ప్రత్యక్షం. అందులో ఎక్కబోతోంది సాహితి,

"మరినేనో" అంటూ ఆనంద్ తయారయ్యాడు.

"మరి నా సంగతి", అంటూ సంస్కృతి వాళ్ళిద్దరి మధ్య చేరింది.

అక్కడ నవ్వులు పువ్వులై విరిశాయి.

*(2012లో హైదరాబాద్ ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక , జి.సి.ఎస్. ఫౌండేషన్వారు నిర్వహించిన కథల పోటీలో బంగారు నంది అవార్డు పొందిన కథ. 16.7.2023)*

# దేవుడిచ్చిన బిడ్డ

**మా**తృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం. అమ్మా! అనిపించుకొనుటే స్త్రీమూర్తికి గౌరవం, అన్న పాట చెవుల్లో గింగుర్లు తిరుగుతుంది.... ష్... లక్ష్మీకి తన ఆలోచనలుఎటు వెళుతున్నాయో ఆమెకే తెలియని స్థితిలో ఉంది. కంటి మీదకు కునుకు రావడం లేదు. ప్రక్కన పడుకున్న భర్త రాజారావును చూసింది. హాయిగా నిద్రపోతున్నాడు. పగలు అలసిన శరీరానికి విశ్రాంతి నిస్తున్నాడు. ఆలోచనలతో సతమతమయిన మెదడుకు విరామమిస్తున్నాడు. నిద్ర సుఖమెరుగదంటారు. నిజమేననిపించేటట్లు నిర్వికారంగా నిద్ర పోతున్నాడు రాజారావు.

అతన్ని చూస్తే లక్ష్మీకి వళ్ళు మండిపోయింది. ఎలా నిద్రపోతున్నాడో చూడు. అసలు నిద్ర ఎలా పడుతుంది? నేనిలా బాధపడుతుంటే ఆ మనిషికి చీమ కుట్టినట్టుగా కూడా లేదా?అని విసుక్కుంది. ఆ విసుగులో కాస్త అసూయ కూడా ఉండే ఉంటుంది.

అసలు లక్ష్మీ పరిస్థితి ఈ మధ్య కాలంలో ఇలాగే ఉంటుంది. పేరంటాలకు వెళ్ళడం మానుకుంది.ఏ వేడుకలకు ఉత్సాహంగా వెళ్ళడం లేదు. మరి తప్పనిసరైతేనే వెళుతుంది. తిండి మీద, అలంకరణ మీద కూడా ఆసక్తి తగ్గిపోయింది. ఒకరికొకరు ప్రాణంగా ఉండేవారు. అలాంటిది ఇప్పుడు భర్త విషయంలో కూడా శ్రద్ధ తగ్గింది. అంతేకాదు. ఆయన ఏదన్నా అడిగినా, మాట్లాడినా విసుగే అనిపిస్తుంది.

మళ్ళీ తర్వాత తనకు తనిలా ఆలోచించుకొంటోంది. పాపం ఆయన చేసిన నేరమేమిటీ? నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటారు? ఏనాడన్నా విసుక్కుని ఎరుగునా?

నేనన్న దానికి కాదని ఎరుగునా? పసిపిల్లలా నన్ను లాలిస్తాడు. పాలిస్తాడు. అయినా ఆయన పట్ల నేనిలా ప్రవర్తించడం, అని ఏదో అపరాధనా భావన. మరి ఎందుకు నాకు ఇలా తరచూ కోపం వస్తుంది?

లక్ష్మికి కళ్ళముందు తన మరదలు రజని కనబడింది. ఆవిడ ఒడిలో పసివాడు. బాలింతరాలుగా చెవులలో దూది, చల్లగాలి తగలకుండా మఫ్లర్, నడుముకు నడికట్టుతో ఎంతో దర్పంగా ఉంది.

ఎన్ని నగలు పెట్టుకున్నా, ఎంత ఖరీదైన పట్టుచీర కట్టుకున్నా రానీ హుందాతనం. ఈ అమ్మతనంలోనే ఉంటుందా! అన్న సందేహం మదిలో తొలుస్తుంది. బారసాల పీటలమీద కూర్చుని రజనీ తనవైపు చూచిన చూపులో ఆత్మీయత కంటే హేళనే ఎక్కువ కనిపించింది. బాబును తాను ఎత్తుకోబోతుంటే... "ఉండండి వదినా! మీకు అలవాటు లేదుగా, ఇదుగో ఇలా ఎత్తుకోండి" అంటూ తన చేతుల్లో పెట్టింది.

అప్పుడు తన ముఖం తనకే వికారంగా కనిపించింది. బారసాలకు వెళ్ళానన్న ఆనందం కన్నా మరదలు మాటలు ఎంతో గుచ్చుకున్నట్లుగా ఉన్నాయి.

నిజమే తనకు అలవాటు లేదు. మరి రజనీకి ఇదే తొలికాన్పు కదా! ఆమెకు అలవాటు ఉందా? అయినా నేను చిన్నప్పటినుండి పసిపిల్లలను ఎత్తుకు మోసేదాన్నని ఆమెకేం తెలుసు?

పెళ్ళయి ఆరేళ్ళయింది. ఇంతవరకు పిల్లలు లేరు. దానికి తనేం చేస్తుంది? అది తన తప్పా? పెళ్ళయిన ఏడాదికే రజనీకి కొడుక పుట్టాడు. అది ఆమె అదృష్టం.అంతమాత్రం చేత ఇతరులను నొప్పించాలా?దాని వలన వారికొరిగేదేమి. అంతా పైశాచికానందం కాకపోతే?

సరిత పెళ్ళిలోను అంతే! ఎవరో ఆమె తనకు ముక్కు మొహం కూడా తెలియదు. అయితేనేం పలకరించి మరీ అడిగింది. "పిల్లలెంతమంది? అని. తన జవాబు విని 'అయ్యో... అలాగా...' అంతటితో ఆగినా బాగుండేది. అప్పుడే ప్రక్క ఆమెతో చెపుతుంది. 'పాపం పిల్లలు లేరట అని' ఈ పాపం ఏమిటో తనకు అర్థం కాలేదు? వళ్ళు మండిపోయింది.

ఎక్కడికి వెళ్ళినా ముందు ఇదే ఎదురవుతుంది. అందుకే తను ఎక్కడికీ వెళ్ళడం కూడా మానుకుంది.

తనలో ఆవేదన ఎక్కువైనా తరువాత డాక్టరుకు చూపించుకున్నారు. పరీక్షలు

చేసారు. నాలో ఏ లోపం లేదట. కానీ ఆయనలోనే లోపం ఉందనీ ఆయనకు పిల్లలు పుట్టే అవకావం చాలా తక్కువన్నారు డాక్టర్స్.

ఇదీ సమస్య, అందరికీ చెప్పుకోవాల్సిన అవసరం లేదుగా. అసలు ఎందుకు చెప్పుకుంటారు?

తనను గొడ్రాలిగా భావించి హేళనగానో, జాలిగానో చూస్తుంటే భరించలేక పోతుంది. అందుకేనేమో ఈ అసహనం. అయినా తను కంట్రోలు చేసుకోలేక పోతుంది. ఆయన ఎడల కూడా నిర్లక్ష్యం ఏర్పడడానికి ఇదే కారణం కావచ్చు.

ప్రేమగా మాట్లాడలేకపోతుంది. నవ్వుతూ ఉండేలేకపోతుంది. భార్య బాధ రాజారావు అర్థం చేసుకున్నాడు. అందుకే పదేపదే ఎటన్నా తీసుకువేళ్ళాలని ప్రయత్ని స్తున్నాడు. కానీ దేనికి సుముఖత చూపడం లేదు. పైగా 'ఆ' అదొక్కటే తక్కువైంది మనకు అంటుంది. ఆ మాట అతనిలో ముల్లులా గుచ్చుకుంటుంది. కానీ అతనేం చేయలేకపోతున్నాడు. పైగా తన అసమర్థత వల్ల భార్యలో అసంతృప్తి కలిగిందేమోనన్న బాధ అతనిలోను రగులుతోంది. దాంపత్య సుఖం అందుకోలేకపోతున్నారు. అన్యోన్యంగా ఉండలేక అన్యమనస్కంగా అపరిచితుల్లా బ్రతుకు వెళ్ళదీస్తున్నారు.

రాజారావులో ఘర్షణ మొదలైంది. దాంపత్యానికి పిల్లలే ముఖ్యమా? పిల్లలు కలుగకపోతే వాళ్ళు ఎందుకు పనికిరాని వాళ్ళేనా? జీవితాన్ని అనుభవించలేరా? ఒకరి కొకరు తోడు నీడలా ఉండి ఆనందాన్ని అందుకోలేరా? లక్ష్మి ఇలా ఎందుకు ఆలోచించలేకపోతుంది?

పెళ్ళినాటి నుండి తాము ఎంతో ఆనందంగా గడిపారు. పొరపొచ్చలు లేకుండా సంసారం సాఫీగా గడిచింది. ఒకరంటే ఒకరికి ప్రేమ, అభిమానం ఉన్నాయి. మరెందుకు ఈ ఒక కారణంతో లక్ష్మి ఇలా మారిపోతుంది? తను మగవాడిని కానట్టే ప్రవర్తిస్తుంది.

తనూ చదువుకుంది చేయాలంటే ఏదో ఉద్యోగం చేయవచ్చు. కాదనుకుంటే ఏ సోషల్ వర్క్ అయినా చేయవచ్చు. తనకూ ఏదైనా ఓ వ్యాపకం ఉంటే ఇలా ఆలో చిస్తూ కూర్చోదేమోననిపిస్తుంది. కానీ వాటికి వీటికి దేనికి లక్ష్మి సుముఖంగా లేదు. ఇలా ఒకే గూటిలో ఎడమొహం పెడమొహంగా గడపడం తన వల్ల కావడం లేదు. ఏదో ఒక పరిష్కారం చూడాలి. అతని ఆలోచనలు ఇలా సాగాయి. ఆ ఆలో చనలు తీవ్రరూపం దాల్చి పరిష్కారమార్గం కోసం అన్వేషణ సాగింది.

ఒకరోజు లక్ష్మీని పిలిచి "కూర్చో" అన్నాడు. లక్ష్మీ 'ఏమిటి?' అన్నట్లుగా అసహనంగా కూర్చుంది.

"చూడు లక్ష్మీ! నేను చెప్పేది జాగ్రత్తగా విని ఆలోచించు. నీ మనసులో బాధ నేను అర్థం చేసుకోగలను. కానీ అది నా చేతుల్లో లేని పని. అయినా నీ తప్పు కాదు. అన్వేషించిన మార్గాలే నీకు చెపుతాను. నీకు ఏది బాగా అనిపిస్తే అది చేయి. నాకిష్టమైన మార్గం నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే. ఏమంటావు?" అన్నాడు.

"అసలు సంగతేంటో చెప్పండి. ఈ ఉపోద్ఘాతం ఎందుకు?" అంది విసుగ్గా.

"అదే! ఆ విసుగే లేకుండా స్థిమితంగా వింటావని, వినాలనే ఇదంతా చెప్పింది" అన్నాడు.

లక్ష్మీలోని మార్పు రాజారావుకు తృప్తినిచ్చింది. మొన్న డాక్టరుగారిని కలిసాను. రాజారావు కాస్త తగ్గాడు.

లక్ష్మీ ఓసారి అతని వంక చూసి తల దించుకుంది. "నీ బాధ చూడలేక పోతు న్నాను. లక్ష్మీ! అందుకే ఆయనేమన్నా పరిష్కార మార్గం చూపిస్తారేమోనని వెళ్ళాను. ఇప్పుడు ఏవో చాలా పద్ధతులు వచ్చాయి కదా! అవి మనకేమన్న ఉపయోగ పడతాయోమోనని ఆలోచన" రాజారావు చెప్పడం ఆపి లక్ష్మీ ముఖం వంక చూసాడు.

ఆమె ఆసక్తిగా తలెత్తి చూసింది. "రిపోర్టులన్నీ పరిశీలించారు. అసలు ఆమె తల్లి అయ్యే అవకాశం లేదని పెదవి విరిచారు. అయినా నీకు తెల్సుగా టెస్టిక్యులర్ బయాప్సి రిపోర్టులో కూడా ఛాన్సులేదన్న సంగతి నీకు మళ్ళీ చెపుతున్నా.

రాజారావు కంఠం రుద్ధమయింది. ఆ కనురెప్పలలో దాగిన కన్నీరు కనబడకుండా జాగ్రత్త పడ్డాడు. 'లక్ష్మీ మనసు వికలమయింది. భర్త ఇంత బాధపడుతున్నాడా? మనసులో ఏమూలో ఆర్ధ్రత తొంగిచూసింది. అందుకే ఆయన ఓ సలహా ఇచ్చారు. రాజారావు చెప్పడం కొనసాగించాడు. "ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్ డోనార్ పద్ధతిలో అంటే కృత్రిమ పద్ధతి ద్వారా ప్రయత్నించడం!"

లక్ష్మీ చివ్వున తలెత్తి చూసింది. ఆమె ముఖం కందగడ్డలాగా అయింది. "అంటే మీ ఉద్దేశ్యం? నేను... నేను...!"

రాజారావు నవ్వాడు. ఆ నవ్వులో జీవముందో లేదో గాని కల్మషం మాత్రం లేదు. "ఆగు లక్ష్మీ! నన్ను చెప్పనీ! నీవెందుకు అలా ఆలోచిస్తున్నావు? డాక్టరుగారు చెప్పినట్లైతే నీవు తల్లివవుతావు. మనకు బిడ్డ కలుగుతుంది".

లక్ష్మీ పెదవులు అదురుతున్నాయి. భర్త ఆలోచనకు విస్తుపోతోంది. ఇలాంటి మగాళ్ళు కూడా ఉంటారా? అన్నట్లు చూస్తుంది. "అయితే ఖర్చు కాస్త ఎక్కువే అనుకో అయితేనేం నీవు తల్లివవుతావు. నీ కళ్ళలో ఆనందం కంటే కావాల్సిందేమిటి?అయితే ఒకసారి ప్రయత్నంలోనే సఫలీకృతం కాకపోవచ్చుట. అపుడు రెండుమూడుసార్లు ఒక్కోసారి నాలుగుసార్లు కూడా ప్రయత్నించవలసి రావచ్చుట. అయితేనేం. ప్రయత్నిద్దాం. ఏమంటావ్?" అన్నాడు.

లక్ష్మీ అతని మాటలకు ఇంకా తేరుకోనేలేదు. "ఖర్చు గురించి ఆలోచించకు లక్ష్మీ! కొంత లోను తీసుకుంటాను. మరికొంత బయట ప్రయత్నిద్దాం. ఒకటి-రెండు లక్షల్లో అయిపోతుందట!" అన్నాడు. ఒకటి రెండు లక్షలా మనసులో లక్ష్మీ ఆశ్చర్యపోయింది. అంత డబ్బు అప్పు చేసినా తాము తీర్చగలిగే స్థితిలో లేము. అయినా భర్త తనకోసం అప్పు చేస్తానంటున్నాడు. అయినా కృత్రిమ పద్ధతిద్వారా బిడ్డను కనడం మనసు అంగీకరించడం లేదు. ఎందుకో ఆ లోచననే ఆమెను ముడుచుకుపోయేలా చేస్తుంది. అందుకే "ఊహూ వద్దు" అంది అతి మెల్లగా.

రాజారావు లక్ష్మీ మనసు చదవగలడు. ఆమె మనోభావం అతనికి అర్థమయింది. ఆమెపై ప్రేమ పొంగడంతో పాటు జాలీ కలిగింది.

"పోనీ మరో పద్ధతిలో కూడా ఉన్నదట. కానీ అవి నూటికి ఒక శాతం మాత్రమే ఫలిస్తుందట. అయినా ప్రయత్నం చేద్దామంటే చేద్దాం" ఆగాడు రాజారావు.

"అదేమిటి?" అంది లక్ష్మీ!

సాలోచనగా చూస్తూ చెప్పసాగాడు. "టెస్ట్‌ట్యూబ్ బేబీ అంటారు చూడు. ఆ పద్ధతి ద్వారా" అన్నాడు నెమ్మదిగా.

లక్ష్మీ ముఖం చిన్నబోయింది. వెంటనే తల దించేసుకుంది. "అంటే... అంటే... ఇంకా ఇంకా పరీక్షలు చేసి నీవు పిల్లలు పుట్టటానికి ఏమాత్రం పనికిరాని చవటవని ముఖాన చెప్పించడానికా ఈ పరీక్షలు?అది ఆయన భరించగలడా? అసలు తను భరించగలదా? వింటుంటేనే ఎలాగో ఉంది.

ఆ ప్రయత్నం విఫలమయితే?ఆయన పరిస్థితి ఏమిటి?ఇంక ఆలోచించలేక పోయింది. వెంటనే "ఊహూ... వద్దు. ఇంక ఆ పరీక్షలు వద్దు అంది. రాజారావుకు ఏం చేయాలో తోచలేదు. అయినా చెప్పదలచుకుంది చెప్పాలి. లక్ష్మీ! కోరుకునే మాతృత్వం ఆమె పొందాలి. అది తనకు తృప్తి. "పోనీ ఓ పని చేద్దాం. లక్ష్మీ అన్నాడు.

ఏమిటన్నట్లు చూసింది. "నువ్వు కోపం తెచ్చుకోకు బాధపడకు కాస్త ఆలోచించు. నా నిర్ణయం నీకు సరైనదే అనిపిస్తుంది" అన్నాడు.

చెప్పండి అన్నట్లు చూసింది.

"మనం విడాకులు తీసుకుందాం! కలిసున్నన్నాళ్ళు సుఖంగాను అన్యోన్యంగానూ ఉన్నాం. కాని జీవితాంతం మాతృత్వం పొందలేదనే బాధతో నీవు గడపడం నాకిష్టం లేదు. ప్రతి స్త్రీ మాతృత్వం కోరుకుంటుంది. అది సహజం. అంతే కాదు. ప్రతి పురుషుడు తండ్రి కావాలని కోరుకుంటాడు. కాకపోతే స్త్రీ బయటపడినంతగా పురుషుడు బైటపడడు. అంతే తేడా! సంతానం లేకపోవడం స్త్రీ లోపమనేని లోకం భావిస్తుంది. సహజంగా అందుకే గొడ్రాలు అని ముద్ర వేస్తుంది. లోపం నీలో కాదు నాలో ఉందని నీవు చెప్పగలవా? ఊహూ చెప్పవు చెప్పలేవు. అందుకే మనం విడాకులు తీసుకుందాం. హాయిగా నీవు మళ్ళీ పెళ్ళి చేసుకొని నీ భర్త నుండి సంతానం పొందే భాగ్యం లభిస్తుంది. ఏమంటావు?" అన్నాడు.

తెల్లబోయింది లక్ష్మి. తను వింటున్నదేమిటో అర్థం చేసుకునేందుకు మెదడు మొద్దబారిపోయింది లక్ష్మికి. ఇది తప్పేమీ కాదు లక్ష్మీ! నేటి సమాజం లోకి అలవాటుగా వస్తూ వున్నదే! మనం పోట్లాడుకోలేదు. ఒకరిమీద ఒకరు ద్వేషంతో నిందలు వేసుకుని విడిపోవడంలేదు. మన ఇద్దరికీ అంగీకారం ఉంది. కనుక కారణం సరైనదే కనుక మనకు విడాకులు కూడా త్వరగానే లభిస్తాయి అన్నాడు రాజారావు.లక్ష్మికి తల తిరిగిపోతోంది.రాజారావు మంచితనం ఆమె భరించలేకపోతోంది. దు:ఖాన్ని ఆపుకోలేక పోయింది. గిర్రున లేచి వెనుదిరిగి గదిలోకి వెళ్ళి తలుపులు భళ్ళున మూసుకుంది.

రాజారావు మనసు స్థిమితపడింది. తను చెప్పదలచుకుంది చెప్పేశాడు. ఇప్పుడు కాస్త బాధపడినా తరువాత ఆలోచించుకుని లక్ష్మి 'సరే' నంటుంది. ఎక్కడ ఉన్నా లక్ష్మి సుఖమే తనకు కావాల్సింది. దీర్ఘంగా నిట్టూర్చాడు. లక్ష్మిని ఇప్పుడు వంటరిగా వదలడమే మంచిదనుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

లక్ష్మి ఆ రోజునుండి ఆలోచిస్తూనే ఉంది. తనను గురించి ఇంతలా ఆలోచించే భర్తను వదలి తను విడాకులు తీసుకోవాలా? అసలు ఇంతవరకు తన ఆలోచనలలో భర్త ఎడల కలిగిన నిర్లక్ష్యమే ఒక నేరం అనుకుంటే విడాకులు తీసుకోవడం ఎంత క్షమించరాని నేరం. అసలు ఆ ఆలోచనే తన మనసులోకి రాలేదు. తను

తట్టుకోగలదా; ఆయనను విడిచి తను ఉండగలదా? చికాకుతోనో, అసంతృప్తితోనో లోకుల మాటలతోనో ఏదో కాస్త నిర్లక్ష్యంగా ప్రవర్తించానే కాని ఆయనమీద తనకు ప్రేమ లేదా? ఆయనను విడిచి మరొకరితో తను సుఖపడగలననే ఆయన అనుకుంటు న్నారా? ఎంత పిచ్చి ఆలోచన! తన నిర్లక్ష్యానికి ఇంత పెద్ద శిక్షా? ఆ ఆలోచనే భరించలేక పోతోంది.

లక్ష్మీ! భర్తమీద ఇప్పుడు నిర్లక్షభావం లేదు. కానీ అతనికి చేరువ కాలేకపోతోంది. ఏదో సంకోచం, ఏదో అపరాధభావం వెన్నంటి వెనక్కి లాగుతున్నాయి. భార్యాభర్తల మధ్య పూర్వపు అనుబంధం లేకపోయినా లక్ష్మీ ప్రవర్తనలో మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

అయినా ఆమె ఎన్ని పనులలో ఉన్నా ఆ ఆలోచన మాత్రం వెన్నాడుతూనే ఉంది.

ఇప్పుడు లక్ష్మీ దినచర్యలో మరో కార్యక్రమం చోటుచేసుకుంది. వీలు చిక్కినప్పుడల్లా దగ్గరలో ఉన్న సంతోషిమాత దేవాలయానికి వెళ్ళివస్తోంది. అక్కడ ఆమెకు ఏదో ప్రశాంతత లభిస్తోంది. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో గడపడం అధికమవుతోంది.

ప్రతి రోజు గుడికి వెళ్ళాలని తలంటుకొని స్నానం చేస్తోంది. ఆమె ఆలోచనలోకి చటుక్కున వినాయకుడు వచ్చి కూర్చున్నాడు. పిండి బాలుడు– అమ్మ ఆజ్ఞ, శివుని కోపం, గజానన ముఖం, గణాధ్యక్ష పదవి, ఆదిదంపతుల ముద్దుబిడ్డ, తొలిపూజ అందుకోవడం, ఇలా అన్నీ కళ్ళముందు, సినిమారీలులా తిరగాయి. భవానీమాత లోకమాత కదా! అందరూ ఆమె బిడ్డలే. ఆమె చల్లని చూపు, కరుణాదృష్టి, అమ్మ మనసు.

అమ్మ మనసు, అమ్మ మనసు... అక్కడ ఆగిపోయాయి. లక్ష్మీ ఆలోచనలు, లలితసహస్రనామస్తోత్రం పఠిస్తూ అమ్మవారి సన్నిధిలో ఏకాగ్రతతో ఉన్న లక్ష్మీకి సమయం తెలియలేదు.

"అమ్మా! గుడి మూసే వేళయింది" అన్నారు అర్చకులు. తలెత్తి చూసింది. సమయం ఎనిమిదిన్నర. చాలా టైమయిందే? అయినా అమ్మ సన్నిధినుండి కదలి రాబుద్ధి కావడం లేదు. కదలక అప్పుడు కనుక మెల్లగా లేచి అమ్మ వారిని తనివితీరా మరోమారు చూసుకొని వెనుదిరిగింది. ఏదో అవ్యక్తమైన అనుభూతి.

మెట్లు దిగి నాలుగడుగులు వేసిందో లేదో ఎక్కడో సన్నగా ఏడుపు వినిపించింది. నడక ఆపి మళ్ళీ విన్నది. నిజమే... ఏడుపే. మళ్ళీ వింది. ఏడుపు వినిపించిన వైపు గబగబా నాలుగడుగులు వేసింది. అమ్మ గర్భగుడి వెనుక వైపు ప్రాంగణాల గోడకు దగ్గరలో గుడ్డల మూటలాంటిది. అక్కడ నుండే సన్నగా పసిపిల్ల ఏడుపు. గబగబా గుడ్డలు విప్పింది. పసిబిడ్డను అమాంతం ఎత్తుకుని ఆనందభాష్పాలు రాలుస్తూ గుండెల కదుముకుంది. ఆమెలోని మాతృత్వం సముద్రంలా ఉప్పొంగింది.

గుడకి వెళ్లేపుడు, ప్రదక్షిణ చేసేపుడు కూడా ఇక్కడ ఈ బిడ్డ లేదు. ఇపుడు.. ఎవరో... పాపం... ఈ బిడ్డను ఇలా...! కాదు కాదు నాకోసమే ఈ బిడ్డ పుట్టింది. బిడ్డలేని తల్లికి తల్లి లేని బిడ్డ... అమ్మ ఇచ్చిన బిడ్డ. ఆ అమ్మే స్వయంగా ప్రసాదంగా నాకు ఇచ్చిన బిడ్డ.

బిడ్డను అక్కున చేర్చుకుని గబగబా అడుగులేసుకుంటూ ఇంటిదారి పట్టింది. తలుపు తీసిన రాజారావు బిడ్డతో లక్ష్మిని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. అతన్ని చూస్తూనే ఆనందంతో "మన బిడ్డండి... మన బిడ్డ. అమ్మ దయతలచి మనకు ప్రసాదించిన బిడ్డండి" అంటూ ఆనందభాష్పాలు రాలుస్తూ అంది.

"అవును లక్ష్మీ! ఈ బిడ్డ మన బిడ్డే. 'దేవుడిచ్చిన బిడ్డ'" అంటూ ఆప్యాయంగా, అపురూపంగా ఆ బిడ్డను అందుకున్నాడు రాజారావు.

లక్ష్మీ! విజయగర్వంతో విజేతగా తలెత్తి భర్త ముఖంలోకి చూసింది. అనురాగంతో ఎంతో ఆప్యాయంగా తల్లీ బిడ్డను అక్కున చేర్చుకున్నాడు రాజారావు.

*(2014లో వరంగల్ ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమైన కథానిక; సర్వేజన సుఖినోభవంతు నిర్వహించిన కథల పోటీ 10.6.21 ద్వితీయ బహుమతి పొందిన కథ)*

# చదువులలో మర్మమెల్ల నే చదివితి

**మా**ర్గశిర మాసం ఉదయం మంచు ఇంకా విడివడలేదు. అయినా వాకింగ్‌కి బయలుదేరాను.

“ఉండమ్మాయ్ నేను కూడా వస్తాను! అన్న మాటలు ఎంతో అనునయంగా వినిపించి వెనుదిరిగి చూశాను. ఆవిడే కాంతమ్మగారు! చిరుపరిచయం. వెనుక వాటాలో ఉంటారు. ఆవిడ కొడుకు దగ్గరకు వచ్చి మూడు నెలలవుతుంది. అప్పుడప్పుడు పలకరిస్తూ ఉంటుంది ఎంతో ఆత్మీయంగా. దరిదాపు ఎనభై సంవత్సరాలు ఉంటుం దామె వయస్సు. అయినా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎవరికైనా చిన్నాపెద్దా తేడా లేకుండా అన్ని సహాయాలు చేస్తుంది. కాని... ఒక దురదృష్టకరమైన సంఘటన జరిగింది.

ఇటీవల! ఆమె ఒక్కగానొక్క కొడుకు మరణించాడు సడన్‌గా.

అయినా ఆమె చలించలేదు! పుట్టినవాడు గిట్టక మానడు. ‘పునరపి జననం. పునరపి మరణం’ అన్న శంకరాచార్యులవారి సూక్తిని మననం చేసుకున్న మహోన్నత వ్యక్తి! కాని మమతానురాగాలను త్యజించిన మూర్ఖురాలు అని కూడా కొందరు చెవులు కొరుక్కుంటారు.

ఈమెగారు నాతో వాకింగ్‌కి వస్తుందా? “వద్దు బామ్మగారు నేను చాలా దూరం వెళ్తాను. మీరు నడువలేరు” అన్నాను సౌమ్యంగా. ఏం పిల్లా చూస్తావుగా నా చురుకు దనాన్ని, తిరుపతి మెట్లకు ప్రతీసారి బొట్టుపెడుతూ, కర్పూరం వెలిగిస్తూ ఎక్కినదాన్ని నన్ను అంత తక్కువగా అంచనా వెయ్యకమ్మా! ఆరోగ్యం విషయంలో “దాహం వేసినప్పుడే బావి తవ్వకోవడం మూర్ఖుల లక్షణం అని నొక్కి వక్కాణించేదాన్ని సరేనా! పదవెళ్దాం అంది బామ్మగారు. తప్పలేదు. మాడ్రన్ బామ్మగారు అని మనసులోనే అభినందించు కుంటూ నడక మొదలెట్టాను. పూర్వకాలం మనిషి! ఆలోచనలు, అభిరుచులు మాత్రం ఆకాశాన్ని అంటుతూ ఉంటాయి. కొడుకు పోయాక, కోడలు మనుమల మధ్య

అత్మాభిమానం చంపుకుని బ్రతుకు వెళ్ళదీస్తుంది. మీరు ఇటుపై మీ దారి మీరు చూసుకొండి.

మా బ్రతుకులు మేము వెళ్ళదీసుకోవడమే కష్టంగా ఉంది. మిమ్మల్నెలా చూడగలం. అనాథాశ్రమాలు ఉన్నాయిగా. అక్కడికి వెళ్ళిపోండి. ఈ అద్దె ఇళ్ళల్లో మీరు ఇమడలేరు! అని కోడలు అనడం ఎన్నోసార్లు విన్నాను. మేడమెట్ల కింద చిన్న చోటిస్తే పిడికెడు మెతుకులు ఉడకేసుకుంటాను. వరండాలో పడుకుంటాను" అంటూ ఇంటివాళ్ళని కాంతమ్మగారు బ్రతిమిలాడటం కూడా ఎన్నోసార్లు విన్నాను. ఇది ఎందుకు చెప్తున్నానంటే కాంతమ్మగారి కోడలు మనమలు వేరే ఇంట్లోకి మారిపోయారు. రోజు ఇంటివాళ్ళు చెప్తున్నారు. మీరు వెళ్ళిపోండి బామ్మగారు! మేము మిమ్మల్ని ఆదుకోలేం అని. వాకింగ్ చేస్తున్నంతసేపు కాంతమ్మగారు ఏదో మాట్లాడుతూ ఉన్నారు. "ఇదిగో అమ్మాయ్ కరుణశ్రీ గారు ఎంత బాగా రాశారో పుష్పవిలాపాన్ని. నేనొక పూల మొక్క కడ నిల్చి తటాలున కొమ్మ వంచి" అని రాగయుక్తంగా పాడుతుంటే ఘంటసాల గారే బామ్మగారిని ఆవహించారా అని నేను ఆశ్చర్యంతో చూశాను.

"శ్రీశ్రీగారి మహాప్రస్థానం. వేరే ఏముంది? వేదాంతిలా నవ్వారు కాంతమ్మగారు. మరోసారి ఖంగు తిన్నాను. చూడమ్మాయ్ కాళ్ళకూరి నారాయణ గారు లేరు? ఆయనెవరు? అదేనమ్మాయ్ ఆయన రాశారే చింతామణి నాటకం ఎంత సొబగుగా ఉంటుందనుకున్నావు. ఆ నాటకం స్టేజిమీద ఆడినపుడు ఎన్నిసార్లు చూశానని ఆ పద్యాలు అవీ ఎంత రంజుగా ఉంటాయని!

"అన్నట్టు గురజాడ అప్పారావు గారే కదూ తెలుగులో మొట్టమొదటి కథానిక రాసినది. అమ్మాయ్! మళ్ళీ కన్యాశుల్కం రోజులొచ్చేలా ఉన్నాయి సుమా! ఆడపిల్ల దొరకక మొగపిల్లలంతా ముదురు బెండకాయల్లాగా ఎదిగిపోతున్నారు! అయినా అమ్మాయ్ ఎలా దొరుకుతారు పెళ్ళికూతుళ్ళు? ఆడపిల్ల అని తెలియగానే కడుపులోనే చంపేస్తున్నారుగా పిల్లల్ని? గర్భస్థ శిశువుల కథల్ని ఎన్ని చదవలేదు పత్రికలలో?"

గ్రాంథిక పరిజ్ఞానం, తార్కిక పరిజ్ఞానం, ప్రపంచ పరిజ్ఞానం అంతా ఔపోసన పట్టినట్లుగా అగుపించారు కాంతమ్మగారు నా కళ్ళకి. పురాణాలు, ఇతిహాసాలు, కాశీ మజిలీ కథలు, పాత తరం నవలలు, ప్రతివ్రతల కథలు, నాటకాలు, ఎన్నో ఆమె నోటినుండి అనర్గళంగా వెలువడ్డాయి. ఆమె నడిచే గ్రంథాలయంలా తోచింది. ఇందులో నాకెన్ని తెలుసు? అనుకునే బదులు ఏమి తెలియదనుకుంటేనే బాగుంటుంది.

నా బుర్ర గిర్రున తిరగసాగింది. పిచ్చిదాన్ని కాంతమ్మ గారి విషయంలో నా అంచనా తప్పు. ఆమె మొండిదని, చాదస్తురాలని ఇంకా ఎన్నోరకాలుగా అనుకున్నాను.

ఇవన్ని విషయాలు మీకెలా తెలుసు? అమాయకంగా ప్రశ్నించాను. జ్ఞానిలా నవ్వారు కాంతమ్మగారు. అలా అలా నడుస్తూ ఇంటికొచ్చామిద్దరం. కాంతమ్మగారి గురించి ఆలోచనలు నన్ను విడిచిపెట్టడం లేదు. మా కుటుంబంలో ఆడవాళ్ళు ఎవరూ పెద్దగా చదువుకోలేదు. నేనొక్కదాన్నే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాను. ఆ గర్వం నన్ను నిలువ నియ్యడం లేదు. ఎదుటివాళ్ళకి ఏమి తెలియదన్న అహం నన్ను పట్టి పీడిస్తోంది.

రోజూ కాంతమ్మగారు నాతో వాకింగ్‌కి వస్తూనే ఉన్నారు. ఆమె వల్ల నాకు ఎన్నో కొత్త విషయాలు తెలస్తున్నాయి. ఆ రోజు ఉదయాన్నే ఈజీ చైర్లో కూర్చుని న్యూస్ పేపరు చదువుకొంటున్నాను. మాలక్ష్మి కూరలు తెచ్చింది. "ఏమేం కూరలున్నాయి? వారానికి ఒకరోజు కాని కనిపించవు" అన్నాను ధాటిగా.

"అవునమ్మగారు సంతల కెళ్ళాల కూరలు తేవాల" అంటూ తన దగ్గరున్న కూరల లిస్టు చదివింది.

"వంకాయలెంత?" అన్నాను.

"ఇరవై రూపాయలమ్మగారు" నెమ్మదిగా అంది మాలక్ష్మి.

"కాదు పదహారు రూపాయలు, మార్కెట్ రేట్లు ఎంత తగ్గినా నీ రేట్లు మాత్రం తగ్గవు. రైతు బజార్లో ఎలా అమ్ముతున్నారో తెలుసా?"

"లేదమ్మా! నేను ఎక్కువ రేటు చెప్పడంలేదు. ఇంతకీ కూరలు కావాలా, అక్ఖరలేదా? ఇంకా నాలుగిళ్ళు తిరగాలి" విసుగు ధ్వనించింది మాలక్ష్మి గొంతులో.

"ఇదిగో చూడు రైతుబజార్లో రేట్లు ఎలా వేశారో, నీకు చదువు రాదుగా! ఈ పేపరిస్తాను. నీ పిల్లలచేత చదివించుకో!" అంటూ పేపరు మాలక్ష్మి కూరల గంప మీదకి గిరాటేశాను. మాలక్ష్మి నిశ్చలంగా చూసింది. కూరల గంపవైపు. ఆమె పెదాల మీద చిరునవ్వు విసిరింది!

"అవునమ్మగారు! ఇప్పటి చదువులు నాకు రావు! ఏదో చిన్నప్పుడు పలకా బలపం పట్టుకుని యీది బడికెళ్లేదాన్ని! మేష్టరు గోరు ఏదో సెప్తూ ఉండేవారు.

ఆ ముక్కలు నాలుగుమాత్రం గేపకం ఉన్నాయమ్మగోరు. "ఏది వీధిబడి చదువా? ఎకసెక్కంగా నవ్వాను. ఔనమ్మగోరు యీది బడి చదువే! పదారు పదార్లెంతమ్మ గోరు".

ఒక్కసారిగా ఖంగుతిన్నాను. ఈ కాలంలో ఏ లెక్క కట్టాలన్నా కేలిక్యులేటర్

ఉండాలి. మామూలుగా ఏ లెక్క కట్టలేము. సెల్‌లో కేలిక్యులేటర్ నొక్కబోయాను. “ఉండమ్మగారు నేను సేస్తాను” మాలక్ష్మి మాటలు స్పష్టంగా వుంటాయి. “పదారు పదార్లు రెండొందల యాభైయ్యారు. మేష్టరు గారు ఆరుచేత మూడుని గుణిస్తే ఎంతొస్తుంది? మూడు చేత ఆరుని గుణిస్తే ఎంతొస్తుంది. ఈ వచ్చిన సంఖ్యలోంచి రెండో సంఖ్యని తీస్తే ఎంత మిగులుతుందో అని అడిగితే సున్నా అని సెప్తే నా భుజంతట్టి ‘నువు పైకొస్తావు! అని మెచ్చుకొన్నారండి” అమాయకంగా అంది మాలక్ష్మి! నేనేమైపోతున్నాను. ఇంకా చెప్పసాగింది మాలక్ష్మి! “ఒక మీటరు సైనుగుడ్డ ఆరడానికి గంట టైము పడుతుంది. అదే పది మీటర్లు సైను గుడ్డ ఆరడానికి ఎంత టైము పడుతుంది? గంటసేపే పడుతుందండి! అని.

ఎలా చెప్పగలిగావు? అన్నారు మేష్టారుగారు. పదిమీటర్ల గుడ్డ కూడా ఒక గుడ్డే కదండీ! అన్నాను. మేష్టారు గోరు నాకు మంచి బహుమతి యిచ్చారు. “ఐసీ” అన్నాను. శతక పద్యాలు కూడా అప్పచెప్పమనేవోరండీ! “ఏం పద్యం అప్పజెప్పేవు?” “ఒకటేటండీ! బోలెడన్ని పద్యాలు అప్పజెప్పేదాన్నండి.

“ఏవి ఆ పద్యాలు ఇప్పుడు కూడా అప్పజెప్పగలవా?”

“కొంచెం గేపకం తక్కువండి! అయినా సెప్తానండి! అనగననగా రాగ మతి శయిల్లుచునుండు, తినగ తినగవేము తియ్యనుండు, సాధనమ్మున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినుర వేమా!’ రాగయుక్తంగా పద్యం చదివింది మాలక్ష్మి! వేమన పద్యం ఇంత అందంగా ఉంటుందా! “ఇంక చరిత్ర, భూగోళం, పరిసరాల విజ్ఞానం అన్నీ చెప్పేవోరండి!’ మా లక్ష్మిని నేను తక్కువ అంచనావేసి తప్పుచేశానా; ఇది మాలక్ష్మి కాదు మట్టిలో మాణిక్యం. అయ్యో నా మతిమండ. ఇంతసేపు మీతో మాట్లాడుతూ ఉండిపోయనమ్మగోరు! ఇంకా బోలెడు కూరలు అమ్ముకోవాలి” అంది మాలక్ష్మి గంప ఎత్తుకుని లేవబోతూ. “ఒక కేజీ వంకాయలు, టమాటలు, ఆనపకాయ యిచ్చి వెళ్ళు!” అంది గిల్టీగా ఫీలవుతూ. మాలక్ష్మి కూరలిచ్చి గంపనెత్తి నెత్తుకుని వెనుదిరిగింది! ఆమె కాలికున్న అందెలు, కడియాలు, మెల్లగా శబ్దం చేశాయి. మాలక్ష్మి! చాలా మంచిమనిషి, ఎప్పుడు మాట్లాడుతూనే వుంటుంది. నల్లగా వున్న కళతో అందంగా ఉంటుంది. మాలక్ష్మి! భర్త మిలట్రీలో ఉన్నాడు అంటారు. ఆమె ఎప్పుడూ ఆ సంగతి చెప్పలేదు. ఆమె మాత్రం పుట్టినింట్లోనే వుంటూ ఇద్దరు బిడ్డలు కూడా ఉన్నారు. మాలక్ష్మి! ఎప్పుడు వెళ్ళిపోయిందో తెలియదు. మా వారిది కేంపుల

ఉద్యోగం. ఒకచోట స్థిరంగా ఉండటానికి కుదరదు. ఏ నెలరోజులకొకసారి వస్తారు. ఒకటి రెండురోజులు ఉండి వెళ్ళిపోతారు. అక్కడా ఇక్కడా ఉద్యోగం చేయలేక ఇంట్లోనే కుట్టుమిషన్ పెట్టుకుని టైలరింగ్ పని చేస్తున్నాను. అప్పుడప్పుడు పుస్తకాలు చదువుతూ ఉంటాను. పుష్పవిలాపం, మహా ప్రస్థానం కాదు! ఏవో కాలక్షేపానికివే పత్రికొచ్చిన ఆదివారం స్పెషల్స్. అవి కాంతమ్మ గారి లాంటి వారికే పరిమితం. నాలాంటి అజ్ఞానికి కాదు. తెలుగు భాష,ఆ భాషకి వున్న విలువ తెలియని మూఢురాల్ని నేను.నా పోస్టుగ్రాడ్యుయేషన్ నన్ను వెక్కిరిస్తున్న ఫీలింగు కలుగుతోంది. అసలు చదువంటే ఏమిటి?

కార్తీక మాసపు ఎండ. పిండి వడియాలు పెట్టటానికి డాబా మీదికెళ్ళాను. మంచం మీద గుడ్డ పరిచి వడియాలు పెట్టటానికి ఉద్యుక్తురాలినయ్యాను. అమ్మాయ్ ఒక్కదానివే కదా? అతగాడు ఎప్పుడో కానీ రాడు! ఈ వడియాలు దేనికట?అంది కాంతమ్మగారు నా వెనుక నిలబడి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. సముదాయించుకొన్నాను. జిహ్వ చాపల్యం బామ్మ అన్నాను కాస్త కటువుగా.

"అయినా అమ్మాయ్ రక్తసంబంధం, కొడుకు పోయినా మనుమ లున్నారుగా! వాళ్ళు నాకో ముద్ద పడేసి కాస్త తలదాచుకోడానికి కూసింత చోటు యిస్తే ఏం పోయింది. కన్నవాళ్ళు చూడకపోతే పరాయివాళ్ళు చూస్తారా? ఇన్నాళ్ళు ఆ ఇంట ఈ యింట వంటవార్పు చేసుకంటూ బ్రతికాను. ఇపుడు నేను చేస్తానన్నా అవతలి వాళ్ళు ఒప్పుకోవడం లేదు. క్షణకాలం ఆగి అన్నారు కాంతమ్మ గారు. "ఈ వయసులో నాకు ఇల్లిల్లు తిరిగే బతుకయింది?" కాంతమ్మ కళ్ళల్లో సన్నటి కన్నీటి తెర కమ్ముకుంది.

నాలో పోటీపడి వాకింగ్‌కి వచ్చిన ఈమేనా ఈ మాటలు అంటున్నది. ఈమెకి కూడా కన్నీళ్ళు ఉన్నాయా మౌనంగా వడియాలు పెట్టసాగాను.

"అమ్మాయి నాది ముదుసలి చాదస్తం అనుకోకపోతే ఒకే మాట! నీ భర్త ఉద్యోగరీత్యా పై ఊళ్ళల్లో వుంటున్నాడు. నువ్వు ఒంటరిగా ఉంటున్నావు. నన్ను నీ యింట్లోనే ఉండనివ్వొచ్చు కదా!" ఆమె గొంతులో ఏదో వేడికోలు.

గతుక్కుమన్నాను. నేనా? అమ్మో! ఆయనగారు ఏమంటారో నని నేను సమాధానం చెప్పలేకపోయాను. కొంతసేపయ్యాక అన్నాను. "బామ్మగారు హాయిగా ఏ గుడికో గోపురానికో పోయి రామకృష్ణా అనుకోరాదు? పుణ్యం పురుషార్థం కూడాను. ఇలా తిరిగితే మీకేమొస్తుంది?" విసుగు ధ్వనించింది నా గొంతులోనే!

పగలబడి నవ్వారు కాంతమ్మగారు.

'ఏ శాస్త్రంబులు చదివే సాలెపురుగు ఏ వేదంబులు పఠించే కరి?' అంటూ తన కాళహస్తీశ్వర శతకంలో చెప్పాడు దూర్జటి కవి. సాలెపురుగు ఏ శాస్త్రాలు చదివితే ఏనుగు ఏ వేదాలు పఠించింది? వీటికి శివసాయుజ్యం కలుగలేదా?

బుర్ర పిచ్చిగా తయారైంది. దూర్జటి ఎవరు? నాకు తెలుగులో సున్నాలే! జ్ఞానానికి ఎల్లలు లేవు!

కాంతమ్మ గారిని చూస్తే ఏ భావం కలుగదు. మాసిన ముతకచీర, తైల సంస్కారం లేని జుట్టు, గారపళ్ళు, ఇదివరకెప్పుడో కిళ్లీ వేసుకునేదట. కానీ.. ఆమె విజ్ఞానానికి భగవంతుని చేరుకోవడానికి భేషజం, డాంబికం అక్కర లేదు. పవిత్రమైన మనసుంటే చాలు అంటుంది. అనుక్షణం నిత్యసత్యాల్ని వెల్లడిస్తుంది. ఎవరీమె? నాకేమవుతుంది? ఈ జీవితం  అనే ఎడారిలో పయనిస్తున్న ఓ పథికురాలు.

క్రమేపీ నా కంటిపొరలు విడివడుతున్నాయి. మనిషి రూపురేఖల్నిబట్టి వారిని అంచనా వెయ్యకూడదు. అంతరంగాన్ని చూడగలగాలి. ప్రతి మనిషికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. కాంతమ్మ గారి అంతరంగం, వ్యక్తిత్వం అంచనాకు అందనివి.

రోజూ వాకింగ్‌కి వెళ్తున్నాము. కాంతమ్మగారు ఎన్నో విషయాలు మాట్లాడు తున్నారు. "అమ్మాయ్ ప్రహ్లాద చరిత్ర చదివావా?" అన్నారు కాంతమ్మగారు వున్నట్టుండి.

తెల్లబోయాను. "లేదండీ భక్త ప్రహ్లాద సినిమా చూశాను! ప్రహ్లాదుడిగా రోజారమణి వేసిందిగా" అన్నాను నెమ్మదిగా!

గుంభనంగా నవ్వారు కాంతమ్మగారు. "చూడమ్మా! అందులో శ్రీహరి ప్రహ్లాదున్ని ఎన్నో బాధలు పడిన తరువాత ఆదుకున్నాడు. కానీ అనుక్షణం వైరంతో రగిలిపోయే హిరణ్యకశిపుడికి స్తంభంలో దర్శనమిచ్చి కైవల్యానికి పంపించాడమ్మా! ఎందుకను కున్నావు? వైరంతోనైనా హరినామాన్ని అనుక్షణం జపిస్తూనే ఉన్నాడు హిరణ్య కశిపుడు".

కాంతమ్మగారు ఎంతో ఎత్తుకి ఎదిగినట్లనిపస్తున్నారు అనుక్షణం నాకు. ఇంటి ఓనర్లకి ఏమి అక్కరలేదు. అద్దె డబ్బులు చాలు. ఏడాదికోసారి అద్దెలు పెంచుకుంటూ పోతారు. నీటికి, కరెంటుకి అంటూ! అలాంటివాళ్ళు కాంతమ్మలాంటివాళ్ళని ఉండనిస్తారా? ఆమె విలువ వాళ్ళకేం తెలుసు?

"జానకమ్మ తల్లీ... మీకు పండగ పబ్బాలలో పిండివంటలు చెయ్యడానికి సాయం చేస్తాను! మీ పిల్లలకి కథలు చెప్తాను! ఇంకా చిన్నపిల్లలకి జోలపాటలు,

లాలిపాటలు పాడతాను! నన్నీ మేడమెట్ల కింద ఉండనిస్తే చాలు!" అంటోంది ఒకరోజు కాంతమ్మగారు ఇంటివాళ్ళ పెద్దకోడలు జానకితో.

నా ఇష్టం కాదు బామ్మగారు! అత్తగారు, మామగారు నా మాటకి విలువనివ్వరు" అంటోంది ఇంటివారి పెద్దకోడలు జానకి. ఇంతలో ఇంటివాళ్ళ ఆఖరి కొడుకు వినోద్ వచ్చి మాకెందుకండీ తలనొప్పి? మీవాళ్ళందరూ వెళ్ళిపోయారు! మీరు ముందు నడవండి!" అన్నాడు కఠినంగా.

"ఏమిటీ ఈ యింటి వాతావరణం? బహునాయకత్వం, బాల నాయకత్వం..." అంటూ పెరట్లో జామచెట్టు కిందకి పోయి కూచుందావిడ.

"ఆ స్వభావం, ఆ వైఖరి ఎంత తరచిచూచినా అంతుపట్టవు. వీళ్ళందర్నీ బ్రతిమాలే బదులు ఆ కోడల్ని, మనుమల్ని బ్రతిమాలుకోవచ్చు కదా!" పక్కవాటాలో అద్దెకుంటున్న పంకజాక్షి అంటోంది!

"వాళ్ళు ఈమె మాటలు వినొద్దూ?" అంటూ నవ్వాను నేను.

"అక్కరలేని సొల్లు అంతా మాట్లాడుతుందీవిడ! ఎవరు వింటారనీ! మొన్నటికి మొన్న 'వరవిక్రయం' సినిమా చూశావా పంకజాక్షి?" అని అడిగింది.

పోనీ పెద్దావిడ కదా అని "చూశాను పిన్నిగారు!" అన్నాను.

అంతటితో ఆవిడ వూరుకుంటేనా! "అందులోనే భానుమతి మొట్ట మొదట నటించింది. అప్పుడే అన్నాను నేను ఈమె సినీఫీల్డులో రానిస్తుందని. అసలు భాన ుమతికి మరణం ఉంటే కదా! ఆమె పాట ఆట అన్నీ మనముందే నిలిచి ఉన్నాయిగా! అన్నట్టు పంకజాక్షి 'వరవిక్రయం' సినిమా నా పెళ్ళికాకముందు వచ్చింది''.

ఈ మాటలన్నీ విన్న నా కొడుకు నామీద గయ్‌మన్నాడు! ఆవిడకి బుద్ధి లేకపోతే నీకు ఉండొద్దూ?" అని. అప్పటినుండి ఆవిడతో మాటలు తగ్గించాను.

గట్టిగా ఊపిరి పీల్చుకుంది పంకజాక్షి. ఈమెలాంటివాళ్ళు కోకొల్లలు లోకంలో. కాని.. కాని... కాంతమ్మగారిలాంటివాళ్ళు ఏ కొందరో ఉంటారు. కాంతమ్మగారు ఎందుకిలా ఇల్లిల్లు తిరుగుతోంది? పోనీ కాంతమ్మగారిని మాతోనే ఉండనిస్తే అమ్మో ఆయనగార్ని అడగాలి! లేకపోతే మా యిద్దరి మధ్యలో పొరపొచ్చాలు రావచ్చు.

రోజులు దొర్లుతున్నాయి. మాలక్ష్మి ఈమధ్య కనిపించడం లేదు. కేజీలకొద్దీ కూరలు కొని ఫ్రిజ్‌లో నిలువ చేస్తూ ఉంటాను. అవికూడా అయిపోయాయి. వద్దన్నా కూరల గంపతో వచ్చి నా ఎదురుగా కూర్చునే మాలక్ష్మీ రాకపోవడానికి కారణం

తెలియలేదు. ఏమీ తోచక వీధిలో నిలుచున్నాను. ఎవరో వీధిలోంచి వెళ్తూ కనిపించాడు. అతగాడు మాలక్ష్మి మేనల్లుడిగా గుర్తించాను. "మాలక్ష్మి కనిపించడం లేదు ఏమైంది?" అన్నాను.

"ఆమె ఇక రాదండీ.మా మామయ్య మిలట్రీ నుంచి వచ్చి తీసికెళ్ళిపోయినా డండీ!" అన్నాడు.

ఎప్పుడూ మాలక్ష్మి వస్తే విసుక్కునేదాన్ని. ఇప్పుడు ఆమె రాదంటే ఏదోలా ఉంది. ఇదే మానవ మనస్తత్వం. మనుషులు దగ్గరగా వుంటే విసుగు. దూరంగా ఉంటే వగపు. మా లక్ష్మి గుణవంతురాలు. భర్త దూరంగా ఉన్నా నీతికి, నిజాయితీకి నిలిచిన మనిషి! మణిపూస! చదువులలో సారం తెలిసిన దిట్ట!

ఈమధ్య కాంతమ్మగారు ఎక్కువగా మాట్లాడడం లేదు. నాతో వాకింగ్‌కి వస్తున్నారు మామూలుగానే. ఈ మౌనానికి అర్థం? నాలో ఓ మెరుపు మెరిసింది! ఆయనగారు క్యాంపునుంచి వచ్చారు. ఎలాగైనా ఆయన్ని ఈ విషయం గురించి ఒప్పించాలి. ఆయనతో అన్నాను భోజనం వడ్డిస్తూ, "మీకు కాంతమ్మ గారు తెలుసుకదండీ!"

ప్రశ్నార్థకంగా చూశాడు నావైపు.

"మీకు తల్లిదండ్రులు లేరు. నాకు తండ్రి మాత్రమే ఉన్నాడు. ఆయన కూడా కొడుకుల దగ్గరే ఉంటున్నారు. మన దగ్గరికి రమ్మన్నా రారు. అందుచేత.. అందుచేత ఆ పెద్దావిడిని మనదగ్గరే ఉంచుకుంటేనేం?"

"నీ ఇష్టం" అన్నారాయన.

ఎనలేని ఉత్సాహం చోటుచేసుకుంది. దాంతో ఎప్పుడు తెల్లవారుతుందా? ఎపుడు కాంతమ్మగారితో ఈ వార్త చెబుదామా? అన్న అన్న ఆలోచన నాకు నిద్రని దూరం చేసింది. ఆయన గాఢనిద్రలో ఉన్నారు. మధ్యలో మెలకువ వచ్చి ఒక మాట చెప్పి మళ్ళీ నిద్రలోకి జారిపోయారు. అది "గాయత్రీ! నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. ఇకపై క్యాంపులుండవు" అన్నారు. ఆయనగారు మరి నాలుగు రోజులలో జాయిన్ అవ్వాలి. ఆ మాటకి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు నేను. ఎప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురు చూస్తున్నాను.

అయినా ఆయనగారికి ట్రాన్స్‌ఫర్ అయితేనేం? మాతోపాటే కాంతమ్మ గారు కూడా. భళ్ళున తెల్ల వారింది. కాంతమ్మగార్ని ఆశ్చర్యంలో ముంచెయ్యాలి. మేడమెట్ల దగ్గరికి పరుగెత్తాను. అక్కడ కాంతమ్మగారు లేరు. ఏమై ఉంటారు? నాకు చెప్పకుండా

వాకింగ్‌కి వెళ్ళారా? అలా చెయ్యరే!

"ఆ మహాతల్లి వెళ్ళిపోయింది. పీడ విరగడయింది" అంది పంకజాక్షి మెటికలు విరుస్తూ.

"ఎప్పుడు? ఎక్కడికి?" అప్రయత్నంగా వెలువాడ్డాయా మాటలు నానుండి.

"ఏమో నాకేం తెలుసు? అయినా దారినపోయే దరిద్రాన్ని ఎవరు నెత్తిన వేసుకుంటారు" అంటూ పంకజాక్షి ఇంట్లో దూరింది.

నా మనసు చివుక్కుమంది. కాంతమ్మగారు చెప్పిన వేమన పద్యం గుర్తొచ్చింది.

'అనువుగాని చోట అధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై ఉండదా?
విశ్వదాభిరనామ వినుర వేమా!'

నా కనుకొలుకుల్లో నీరు నిలిచింది.'అనువుగానిచోట అధికుల మనరాదు!' అనుకుందో ఏమో గాని కాంతమ్మగారు వెళ్ళిపోయారు. నాలుగు రోజుల తర్వాత సామాన్నన్నీ వేసుకుని ఆయనగారి ఉద్యోగం ఊరికి బయలుదేరాము.

ఎండ నిప్పులు చెరుగుతోంది. వ్యాన్ వేగంగా పోతోంది.

కొంత దూరం పోయేసరికి ఆ మండుటెండలో చిన్న చేతిసంచితో ఓ వృద్ధురాలు నడిచిపోతున్నది. గట్టిగా అరిచి వ్యాన్ ఆపించాను. డ్రైవర్ వ్యాన్ ఆపి ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిటి గాయత్రీ!" అన్నారు మావారు.

"ఉండండి!" అంటూ వ్యాను దిగాను.

ఆ ఎండలో మజిలీ లేని ప్రయాణం చేస్తోందా వృద్ధురాలు. వెనుకవాటుగా వెళ్ళి ఆమె భుజం మీద చెయ్యి వేశాను. ఆమె తిరిగి చూసింది. ఆ ఎండిన కన్నులలో కనీ కనబడని నీటి చెలమలు!

నా ఆనందానికి అవధులు లేవు! ఆమె చెయ్యి పట్టుకుని నడిపించుకు వచ్చి వ్యాన్‌లో నా పక్కన కూచుండబెట్టుకున్నాను.

ఆవిడ కాంతమ్మగారే!

***(22-02-2017 నాడు వరంగల్ ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయిన కథానిక, బుజ్జువారి కథలపోటీల ప్రోత్సాహక బహుమతి పొందిన కథ)***

# తిరగని పొద్దు

**అ**మ్మా... మగవాళ్ళందరూ మన ఆడవాళ్ళ వంకే ఎందుకు చూస్తారే...? చిన్ని ప్రశ్నతో ఉలిక్కిపడింది ప్రమోద. చేస్తున్న పని ఆపి తన చిట్టితల్లి కళ్ళల్లోకి భయంగా చూసింది. ఆ కనుపాపల్లో అవమానపు నీలినీడలు.. అంతులేని ఆవేదన..

ఏ పాపిష్ఠి నీడలు తన చిట్టితల్లిపై పాకాయో... ఏ విషపు చూపు నా చిట్టితల్లి తనువెల్లా గాయలపాలు చేసిందో...ఏదో ఒకటి చెబితే గానీ చిన్ని ఊరుకోదని తెలుసు. చెప్పకుంటే అంతటితో వదలదనీ తెలుసు.

ఆ వయసు పిల్లలకు అలాంటి ప్రశ్నలు రాకూడని వాతావరణంలోనే తాను చిన్నీని పెంచుతున్నాననుకుంది. చదువులో ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ బంగారు భవిష్యత్ నిర్మించుకుంటుందనే అనుకుంది. జరిగిందేమిటి? ఒక సైన్స్ స్టూడెంటుగా ఆ ప్రశ్న వేస్తే తనో తనవాళ్లో ఎన్నెన్నో విషయాలు చెప్పుండే వారు. కానీ ఒక నిస్సహాయంగా ఆ ప్రశ్న తననడిగింది. అది ఒక తల్లిని తప్ప మరెవరినీ అడగలేని ప్రశ్న... రెండు చేతులు చాపి చిన్నీని గుండెలకు హత్తుకుంది. కన్నీళ్ళతో తడిసిన చిన్నీ చెంపలు కొలిముల్లా తనని దహిస్తున్నట్లనిపించింది ప్రమోదకు. తరాలు మారినా ఈ బాధ మాత్రం మారటం లేదు...

ప్రమోద కలవారింటి పిల్లే. తండ్రిచేతి కింద ఉన్న పదిమంది పాలేళ్ళతో ఆ ఇల్లు జాతరలాగా ఉంటుండేది. పనిలేనివాళ్ళు పిచ్చాపాటి ముచ్చట్ల కోసం ఆ ఇంటి అరుగుల మీదకు చేరుతుంటారు. ప్రమోదకు నలుగురు అన్నలు– ఒక అక్క– ఒక చెల్లీ ఉన్నారు. ఒడ్డూ పొడవుతో పాటు రంగుదేలిన ప్రమోద అందరిలోకి

అందగత్తె కిందే లెక్క. చిన్నప్పుడు ఆటల్లో ఎదురింటి చంద్రకళ వాళ్ళన్నయ్య నన్ను దగ్గరికి తీసుకుని గుండెలకు హత్తుకుంటే నొప్పనిపించేది. వాడు దగ్గరకు వస్తున్నాడంటేనే భయమేసి పరిగెత్తేది. ఇంట్లో.. అద్దం ముందు నిలబడి అన్నలు మీసాలు మెలితిప్పుతుంటే క్రాపులు ఎగరేసుకుంటుంటే... వాళ్ళ వెనకే చేరి అద్దంలో తన్ను తాను చూసుకుంటుండేది. అప్పుడు ఇంట్లో అందరూ ప్రమోదని చెడామడా తిట్టేవారు. తనవి పోకిరి వేషాలని.

ఇంటికొచ్చిన వాళ్ళు తనను ఎగాదిగా చూసినా.. పనిలేని పోకిరోళ్ళు ఇంటిముందు తచ్చాడినా... ఇంట్లో అందరూ తననే తిట్టేవాళ్ళు. ఆఖరికి అక్కా చెల్లీ కూడా. అమ్మా దీని కొంగుకి అరడజను పిన్నులు పెట్టవే... అంటూ వెకిలిగా మాట్లాడేవారు. ఇక అన్నలు సరేసరి... ఇది బాగా బలిసి కొట్టుకుంటుందే అంటూ తోబుట్టువులు కూడా అలా మాట్లాడేవారు.

ప్రమోద చదువు వానాకాలం చదువే అయింది. పిల్లలే కాదు. పంతుళ్ళూ కోతుల్లాగానే వ్యవహరించేవాళ్ళు. తనని స్వేచ్ఛగా ఎక్కడికీ పంపేవారు కాదు. ప్రమోదది పంజరపు బతుకే అయింది.

ఎవరికీ లేని ఒళ్ళు నీకే ఎందుకొచ్చిందే... చూడు ఎన్ని కష్టాలో... అంటూ తల్లి కళ్ళు ఒత్తుకునేది. తనకు వచ్చిన ఈ ఒంటికా లేక ఆ కష్టాలకా తల్లి కన్నీళు ్ళ... అర్థమయ్యేది కాదు.

ప్రమోద ఒక పోకిరిగా ఆనోటా ఈ నోట పాకి దగ్గరి సంబంధాలు కుదరలేదు! ఆఖరికి దూరపు పట్నంవాసపు పిల్లవాడికి ఇచ్చిపెళ్ళి చేశారు. బిక్కుబిక్కుమంటూ అయిష్టంగానే పెళ్ళి కూతురైంది. మూడు రోజుల ముచ్చట ముగించి ప్రమోద నందరూ గడప దాటించారు. చేసుకున్న సదానందంతో పట్నం చేరింది.

తాను శారీరకంగా దగ్గరయ్యే కొద్దీ బిగుసుకుపోవటం సదానందం గమనించాడు. తెలిసిన సైక్రియాట్రిస్టు సలహా సహకారాలతో మానసికంగా కోలుకుంది. ప్రైవేటు క్లాసులకి వెళ్ళి చదువు ప్రారంభించింది. సంవత్సరం తిరిగేసరికి తను పెద్ద పెద్ద పుస్తకాలు చదువ నేర్చుకుంది. ఐతే క్లాసుకి వెళ్ళి వచ్చేపుడు బస్సులో హింస భరించనంతగా ఉండేది. ఎవరెవరి చేతులో తనని తడుముతూనే ఉండేవి.సడెన్ బ్రేకుల కోసం ఎదురుచూసే జనం ఒక్కసారి మీదపడేవాళ్ళు. అమాయకంగా చూస్తూనే వెధవ పనులు చేసేవాళ్ళు... క్లాసులోనూ ఇంతే...

వెనుక నుంచి జాకెట్ సందులోకి చూస్తుండేవాళ్ళు. ఏదో గొంగళి పురుగు లోపలికి జొరబడి నట్లుండేది. పెద్దరికం నటిస్తూ జబ్బమీదో, వీపు మీదో చేత్తో రాస్తూ వెనకే నిలబడే ముసలి టీచర్లు. వీళ్ళకన్నా కుర్ర టీచర్లే నయం... రెండుసార్లు ఓరగా చూసి, తగిలి తగలనట్లు రాసుకుంటూ పోయేవాళ్ళు.

ఈసారి ఏ వెధవైనా తన గుండెల వైపు చూస్తే... ఇవి నీ తల్లికీ, చెల్లికీ కూడా ఉంటాయిరా.. చూడు బాగా చూడరా... అని చెప్పాలని ఉద్రేకపడేది. కానీ చెప్పలేని పిరికితనం.. అలా అనడం సంస్కారం కాదని సరిపెట్టుకునేది. తిట్టినా వినబడనట్లు నటించే పశువులనూ వెటకారంగా నవ్వుతూ వెళ్ళిపోయే మృగాలను భరించడం ఎంత కష్టం. ఇలా చూపుల హింస, చేతల హింస అనుభవిస్తున్నప్పుడనిపించేది. ఆ సౌందర్యమేదో ఈ వెధవలకే ఉంటే ఆ హింస తప్పేదేమోనని... ప్రమోద ఆలోచిస్తోంది.

తన చిన్నప్పటికీ ఇప్పటికీ నలభై ఏళ్ళు గడిచాయి. దేశంలో ఎన్నెన్నో మార్పులొచ్చాయి. ఎన్నో పార్టీలు వచ్చి ప్రభుత్వాలు మారినా, ఉద్యమాలు, వాదనలు వచ్చాయి. మనుషులెంతగానో మారారు. అయినా స్త్రీ శరీరం విషయంలో మాత్రం మగవాళ్ళు ఒక్క తీరుగానే ఉంటున్నారు.

ఛీ... పాడులోకం... పాపిష్టి లోకం. తన గుండెలకి హత్తుకుపోయిన చిన్నారి చిన్నీని చూస్తూ అనుకుంది. నాకు నీకే కాదమ్మా.. నీ బిడ్డకు, బిడ్డ బిడ్డకూ ఈ సమస్య పునరావృత్తమవుతూనే ఉంటుంది. అన్నికాలాల్లో, అన్ని దేశాల్లో.. అన్ని సమాజాల్లో స్త్రీలపై చూపుల హింస.. చేతల హింస కొనసాగుతూనే ఉంటుందేమో... నిస్సందేహంగా రెండు అలసిన గుండెలు.. పరిష్కారం కనిపించని సమస్యతో కుమిలిపోతూ ఒకరి ఒళ్ళో ఒకరు కూలబడి పోయారు.

ఒక ఆడబిడ్డ సహజ శారీరక పెరుగుదల మనుషుల్లో అంత పెద్ద ప్రశ్న అయిన విషాద సందర్భంలో ఆడదాని జీవితం ఇంకా తిరగని పొద్దు లాగే ఉండి పోతుంది. మారేదెలా ఆలోచించండి ఓ మగమహారాజులారా..? మీలో ఒక ఆడదానిని చూసినపుడు కలిగే వికృత భావన, అదే ఆడదాని స్థానంలో మీ తల్లినో, అక్కనో, చెల్లినో, భార్యనో ఊహించుకోండి. అప్పుడు మీ మనసుకి ఏమనిపిస్తుందో కాస్త ఆత్మవిమర్శ చేసుకోండి ఓ పురుషపుంగవులారా...?

***(తెలుగు వెలుగు ఫౌండేషన్ వారి కథల పోటీలో***
***ప్రథమ బహుమతి పొందిన కథ)***

# వినూత్న

'**అ**పురూపమైనదమ్మ ఆడజన్మ.. ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మా!' అని ప్రక్కవీధిలో మైక్ సౌండ్‌లో పాట పెద్దగా విన్పిస్తుంది. ఆ పాట వినగానే ఆలోచనలో పడిపోయాను. నేను కూడా మంచి ఇల్లాలని ఎలా నిరూపించు కోవాలని. కాని నాకు ఆ అవకాశం లేదని మనసులోనే కుమిలి పోయాను. ఆ పాటంటే ఇష్టం కూడా చిన్నప్పుడు స్కూలులో టెన్త్ క్లాస్‌లో వీడ్కోలు పార్టీకి ఇదే పాట పాడి అందరితో గుడ్ అనిపించుకొన్నాను. కొందరి స్నేహితురాల్లు మాత్రం నీవు ఏ సతీ అనసూయ కాలంలోనో ఉన్నావే. ఇది కంప్యూటర్ యుగమమ్మా! నీవు ఇకనైనా మారడానికి ప్రయత్నించు అని వెటకారం చేశారు. ఎంతైనా నా బ్రతుకు ఇలా అయ్యిందనే కదా వాళ్ళ వేళాకోళం. చెప్తా. నేను కూడా పై చదువులు చదివి మెప్పులతో ఏ గొప్పవాడో నన్ను సంతోషంగా కట్టుకునేలాగా నేను బాగా చదివి గొప్పదాన్నవ్వాలనే తాపత్రయపడేది వినూత్న. అయినా ఆ చిన్నతనం ఆలోచనలే ఆమె మనసును బాధపెడుతూనే ఉండేవి. బతుకమ్మ పండుగ సెలవులు ఇచ్చారు. అందరూ చక్కగా ముస్తాబై బతుకమ్మ పేర్చుకుని వీధుల వెంట వెళ్తూంటే ఏదో ఆశగా చూస్తుంది వినూత్న.

సాయంత్రం వెన్నెల్లో ముత్తయిదవులంతా పాట పాడుకుంటూ బ్రతుకమ్మ ఆడుకుంటుంటే నేను వెళ్తానని మొండికేయాలనిపించేది. ఇదివరకే మాది సనాతన

సంప్రదాయ కుటుంబమాయే పట్టింపులెక్కువ అయినా అందరు ఎన్ని మాటలన్నా స్కూలుకి పంపించి టెన్త్ వరకు చదివించారు నాన్న. మా ఆడబిడ్డ కొడుకని వరుసకు బావ అవుతాడు. బాగా ఉన్న సనాతన సంప్రదాయాలున్న కుటుంబం, ప్రతిష్ట కలిగి ఉన్న కుటుంబమని. వేదవిద్యతో పాటు కంప్యూటర్ విద్య కూడా చదివి ఉద్యోగంతో పాటు పౌరోహిత్యం కూడా చేస్తున్నాడని ఎంతో మురిపెంగా పెళ్ళిచేస్తే అతడు ఏ మాయరోగానికో బలై నా బిడ్డ జీవితం ఇలా వల్లకాడు చేసివెళ్ళాడని అనుక్షణం కుమిలి పోతున్నారు అమ్మానాన్న. సెలవులు వచ్చిన నుండి ఎంతో ముభావంగా బాధగా కన్పిస్తుంది. అమ్మ పెద్ద బతుకమ్మ రోజు నేను గౌరమ్మను పెట్టుకున్న బతుకమ్మ పట్టుకుంటానంటే వద్దు అని లాగేసుకుంది. శారదక్కను ఎందుకక్కా అని అడిగాను. నీవు ముత్తయిదువవి కావని పట్టుకోనివ్వలేదని చెప్పలేక కన్నీళ్ళ పర్యంతమయింది. చెమ్మచెక్క చారడేసి మొగ్గ అట్లు పోయంగ ఆరగించంగా అని అందరు మా వాకిట్లోకి వచ్చి ఆడుకుంటుంటే వినూత్న నేను ఆడ్తానని వెళ్తే నీవు ఆడొద్దు ఈ ఆటలని వినూత్నను ఆడుకోనివ్వలేదు. ఆ బాధను మరిచిపోవడానికి మనసుకు సర్ది చెప్పుకుని 'నీ నేలంత తొక్కితొక్కి పాడుచేస్తినీ' అని తమ్ముళ్ళు ఆడుకుంటుంటుంటే వాళ్ళల్లోకి వెళ్ళి ఆడుకున్న ఆ రోజులు– అప్పటికే కడుపుతో ఉన్న నన్ను మళ్ళీ స్కూళ్ళో ధైర్యంగా చేర్పించి చదివిస్తున్నాడు తాతయ్య. మళ్ళీ పెళ్లి చేస్తానన్న నాగరిక సమాజానికి ఎదురు తిరుగలేక పెళ్లి చేయలేక తల వంచాడు నాన్న.

అమ్మా వాళ్ళంతా రంగురంగుల బట్టలు, బొట్లు పెట్టుకుని సింగారించుకుంటు న్నారు. నేనెందుకు పెట్టుకోవద్దమ్మా బొట్టు, కాటుక, పూలు. నా భర్తతో రాలేదు కదమ్మా! నేను పుట్టినప్పటి నుండి నీవు పెడ్తూనే ఉన్నావు కదమ్మా! అని నేను వేసే సవాలక్ష ప్రశ్నలకు అమ్మ కన్నీళ్ళే దానికి సమాధానమయ్యేది. నేనేది అడిగిన అమ్మ సమాధానం కన్నీళ్ళే అని నేనడగటం మానుకున్నాను.

గతమంతా గుర్తొచ్చి ఆలోచనలో నున్న వినూత్నకు మనసు పరిపరి విధాల పోతోంది. తను ఎదిగొచ్చిన బిడ్డ తనతో తన ఇష్టాఇష్టాల్ని చెప్పుకు పోతున్నట్లు ఏవో ఊహించుకొంటుంది. అమ్మా నేను పెళ్ళి చేసుకోనమ్మా అని వాపోతున్నట్లు, పోనీ చేసుకుంటే నా పెళ్ళయినా కాస్త ఆలోచించి మంచివాడితో చేయమ్మా! అని అడుగుతున్నట్లు మంచివాడంటే ఎలాంటివాడు మాన్పడిపోతున్నట్లుగా దానికి తన

కూతురు పెళ్ళి అంటే ఇటు ఏడుతరాలు, అటు ఏడు తరాలు చూడాలంటారు కదమ్మా! అమ్మమ్మ తాతయ్య చేసిన తప్పే నీవు చేయకమ్మా అన్నట్లుగా.

అమ్మా ఎదురింటి పద్మ మొగుడు తాగుబోతు నీచుడిలాంటి వాడికి కివ్వకమ్మా! వెనుక గల్లీ వనజ వాళ్ళ ఆయన ఎప్పుడూ రాక్షసుడిలా పేకాడుతుంటాడు. అలాంటివాడికివ్వద్దు. మరి అమ్మమ్మా వాళ్ళింటి దగ్గిర విరూపాక్షి పెనిమిటి ఎపుడు కొడుతుంటాడు, క్రూరుడు తిడుతుంటాడు. ఎప్పుడూ సోమరిగా ఉంటాడు. చూడు అలాంటి వాడికివ్వకమ్మా!

ఆస్తి ఉంది కదా అని వయసు మళ్ళిన వాడికివ్వకమ్మా. నేను పుత్తడి బొమ్మ పూర్ణమ్మను కాదు కదమ్మా! దాహం వేసినపుడే బావి తవ్వుకునే ఆరోగ్యం మీద అవగాహన లేని మూర్ఖునికి- బ్రతకడానికి తినేవాడు కాకుండా తినడానికే బ్రతికేవాడికివ్వకమ్మా! నన్ను దొమ్మరోనికియ్యకే డోలు కొట్టమంటడే... సాకలోనికివ్వకే సందరి పొమ్మంటడే అని పాటపాడినట్లు తన ఇష్టాఇష్టాలన్నీ చెప్పుకుపోతున్నట్లుగా. ఇదివరకే అమ్మమ్మ- తాతయ్య నిన్ను ఒక రోగిష్టి వాడికిచ్చి పొరపాటు చేసారు. తాను కన్న కలల్ని కల్లలు చేయకమ్మా. అన్నట్లుగా ఇలాంటి తప్పు జరగకుండా నా విషయంలో విజ్ఞతతో ఆలోచించ మన్నట్లు పేదవాడికైనా సరే రిక్షా తొక్కేవాడికైనా సరే మంచి మనసు కలవాడైతే సరే అని చెప్తున్నట్లు ఊహించుకుంటూ బయటకి చెప్పలేక మనసులోనే మాట్లాడుకొంటున్నాను. మళ్ళీ నా బిడ్డ గుర్తొచ్చి అందరిని ఎదిరించి అయిన ఆమె పెళ్లి విషయంలో చాలా ఆలోచించి  పెళ్లి చేయాలని నిశ్చయించుకొన్నాను.

*(వల్లూరి ఫౌండేషన్ వారి కథల పోటీలో*
*తృతీయ బహుమతి పొందిన కథ)*

# పురస్కారాలు

1. రోజా ఆర్ట్స్ క్రియేషన్స్ వారు నిర్వహించిన పోటీలో 'సంపూర్ణ మహిళ - 2007' పురస్కారం.
2. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి మూడవ జాతీయ తెలుగు మహిళా రచయితల సాహితీ సమ్మేళన పురస్కారం (21-08-2016).
3. తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్త కవిసమ్మేళన పురస్కారం (09-04-2017).
4. తెలుగు రక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ & కల్చరల్ కమీషన్ వారు నిర్వహించిన 33 గంటల 44 నిమిషాల 5 సెకన్ల ప్రపంచ రికార్డు కవిసమ్మేళనం (అనంతపురం) లో పురస్కారం (2017),
5. తెలంగాణ రైతు హార్వెస్టర్ అసోసియేషన్, కరీంనగర్ వారు నిర్వహించిన శ్రీ కృషి కవిత ప్రపంచ రికార్డు పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు పురస్కారం (10-09-2017).
6. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గౌరవనీయులైన హరీష్ రావుగారిచే పురస్కారం (14-12-2017).
7. ఉదయకళానిధివారి యాదాద్రి శిల్పకళా వైభవ పురస్కారం(15-07-2018).
8. 'నాన్న ఘనుడు - త్యాగధనుడు' కవితకు ఉత్తర అమెరికా వారి విశిష్ట బహుమతి పురస్కారం (22-06-2020).
9. తరుణిమిత్ర అవార్డు డా.మమతా రఘువీర్ గారి పురస్కారం(08-03-2021).
10. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు వారి ప్రపంచ మహిళా తెలుగు కవితా మహోత్సవం 2021 పురస్కారం (23, 24, 25 ఏప్రిల్, 2021).
11. వంశీ గ్లోబల్ అవార్డ్స్ వారి ప్రపంచ మహిళా తెలుగు కవితా మహొూత్సవం - 2021 పురస్కారం (23, 24, 25 ఏప్రిల్, 2021).
12. వల్లూరి శ్రీనివాసు వారు నిర్వహించిన "మానవీయ సంబంధాలు" అను వ్యాసానికిగాను జీవిత సాఫల్య పురస్కారము. 10.02.2021న. త్యాగరాయ గానసభలో.
13. బుజ్జా ఫౌండేషన్ వారు నిర్వహించిన కవి సమ్మేళనంలో "జాతీయ విశిష్ట కవితా శిరోమణి" పురస్కారము 24.08.2021న రవీంద్ర భారతిలో.
14. వల్లూరి శ్రీనివాసు గారి జాతీయ కవి సమ్మేళనములో "సహస్ర రవి కిరణం",

అంతర్జాతీయ కవి రత్న అవార్డు 23.01.2022న.రవీంద్ర భారతిలో.

15. తెలుగు వెలుగు సాహితి సంస్థ నిర్వహణలో "తెలుగుతల్లి ఒడిలో" కథకు గాను మహానంది జాతీయ పురస్కారము 07.07.2022న వేములవాడ.
16. నమస్తే తెలంగాణ వారు నిర్వహించిన "నా తెలంగాణ ప్రగతి ప్రస్థానములో" విశిష్ట బహుమతి రవీంద్ర భారతి లో23.07.2022
17. అంతర్జాతీయ మాతృ దినోత్సవమునాడు శీ సర్వేజనా సుఖినో భవంతు వారి ఐదవ వార్షికోత్సవము సందర్భంగా "మరో అమ్మ" కథకు గాను విశిష్ట ప్రతిభా రత్న పురస్కారము05.08.2022న.రవీంద్రభారతిలో.
18. వరంగల్లులో కాళోజిజయంతి సందర్భంగా వల్లూరి ఫౌండేషన్‌వారి నిర్వహణలో కాళోజి అవార్డు 27.11.2022 న.హనుమకొండ టి.టి.డి.కళ్యణ మండపం.
19. టి.టి.డి. కళ్యాణ మండపం హనుమకొండలో జరిగిన భగవద్గీత పోటీలో సీనియర్ సిటిజన్స్ లో ద్వితీయ బహుమతి.27.11.2022.
20. శ్రీ రాగ రమ్య సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ నాల్గవ వార్షికోత్సవం సాంస్కృతిక వేడుకలు, కళాహేమంతం, సకల కళా సమ్మేళనం పురస్కారం రవీంద్ర భారతిలో 17.01.2023.
21. ఋతుప్రేమ అవగాహన సదస్సు పురస్కారం విపంచి కళా నిలయం సిద్ధిపేట 21.02. 2023.
22. శోభకృత్ ఉగాది పర్వదిన సందర్భంగా జరిగిన వెన్నెల సంఘం వారు నిర్వహించిన కవి సమ్మేళనంలో "సామల సదాశివ" ప్రశంసాపత్రం 22.03.2023న సిద్ధిపేటలో.
23. మాతృదినోత్సవం సందర్భంగా వల్లూరి పౌండేషన్ వారి పురస్కారం రవీంద్రభారతిలో 14.05.2023.
24. సర్వేజనా సుఖినోభవంతు వారి మాతృదినోత్సవ పురస్కారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 28.05.2023.

ఇంకా 300లకు పైగా ప్రశంసాపత్రాలు.

రచనలు – ముద్రితాలు : "గుప్పెడు గుండెను తడితే" కవితా సంపుటి 29.05.2021.

అముద్రితాలు : భావ వర్ణాల లోగిలి,పూర్ణచంద్రికలు, సూక్తి ముక్తావళి, భావ వీచికలు మొదులగునవి.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు
రోజాశర్మ గారి చేతుల మీదుగా సన్మానం



ప్రముఖ రచయిత్రులు శ్రీమతి అనంత మహాలక్ష్మి &
శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి గార్లకు
తన 'గుప్పెడు గుండెను తడితే' పుస్తకాన్ని అందజేస్తూ



రవీంద్రభారతిలో కె.వి.రమణాచారి & నారాయణమూర్తి
గార్లను ఆహ్వానిస్తూ, తన పుస్తకాన్ని అందిస్తూ...



వల్లూరి ఫౌండేషన్‌లో గీతాశ్రీ గారి
చేతుల మీదుగా సన్మానం.



సిద్ధిపేట గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా
శ్రీ మృత్యుంజయ శర్మగారిచే సన్మానం.



రవీంద్రభారతిలో మామిడి హరికృష్ణ గారికి
తన పుస్తకాన్ని అందిస్తూ...



ఋతుప్రేమ దినోత్సవం రోజున
అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్ గారిచే సన్మానం



రవీంద్రభారతిలో శ్రీ ఆర్.పి. పట్నాయక్‌కు పుస్తకాన్ని అందిస్తూ
& శ్రీ తోటకూర ప్రసాద్ (తానా అధినేత) గారితో



'తెలుగుతల్లి ఒడిలో' కథకు గాను
తెలుగు వెలుగు వారిచే సన్మానం



సురభి మెడికల్ కళాశాల (అనాటమి)
ప్రొఫెసర్ గారికి పుస్తకం ఇస్తున్న సందర్భంగ



లచ్చపేట హైస్కూల్ వారిచే
'తెలుగు భాషాదినోత్సవం' నాడు సన్మానం



సర్వేజన సుఖినోభవంతు పురస్కారం సందర్భంగ
జస్టిస్ చంద్రయ్య గారికి తన పుస్తకం అందిస్తూ



సిద్ధిపేట కోర్టు జస్టిస్ మేడమ్ గారికి
తన పుస్తకాన్ని అందిస్తూ...



చీమ-ఉడుత పుస్తకావిష్కరణ, కవిసమ్మేళనంలో




రవీంద్ర భారతిలో 'బుజ్జి ఫౌండేషన్( వారిచే
సన్మానం సందర్భంగ



అనుబంధాల పూదోట పుస్తకావిష్కరణ సందర్భంగ
'బుర్ర వెంకటేశం IAS గారితో


telangana publications
నమస్తే తెలంగాణ
ప్రశంసా పత్రం



Tharuni
THARUNI
An Organization working for the welfare of
Adolescent Girls and Women
Presents
THARUNI MITRA AWARD
To
Sri Yerragunta Prasad
for supporting his wife Sujatha Prasad and enabling
her to become a successful writer
Hyderabad
Dr. Mamatha Raghuveer
Founder, Tharuni



TELUGU BOOK OF RECORDS
CERTIFICATE
OF PARTICIPATION
PRAPANCHA MAHILA TELUGU KAVITHA MAHOTSAVAM - 2021
Y.Sujatha Prasad
W/F.Y.Prasad,Lachapet-Telangana
OFFICIALLY AWESOME
2021



VAMSEE
GLOBAL AWARDS
Certificate of Participation
Presented to
Y. Sujatha Prasad
PRAPANCHA MAHILA
TELUGU KAVITHA MAHOSTAVAM



యం.పి. కొత్త ప్రభాకర్‌రెడ్డి గారితో
'గుప్పెడు గుండెను తడితే' పుస్తకావిష్కరణ



అనంతపురంలో జరిగిన
'ప్రపంచస్థాయి కవిసమ్మేళనం' సందర్భంగ



కరీంనగర్‌లో జరిగిన
'కృషి కవిత సమ్మేళనం' సందర్భంగ



వెన్నెల సాహితీ సంగమం, సిద్ధిపేట
'ఉగాది కవిసమ్మేళనం' సందర్భంగ



సిద్ధిపేట 'విశ్వకర్మ ఉగాది కవి సమ్మేళనం'
సందర్భంగ



'నందిని సిధారెడ్డి' గారిని సన్మానిస్తున్న
సందర్భమున




వల్లూరి ఫౌండేషన్ వారి త్యాగరాయ గానసభలో
జీవితసాఫల్య పురస్కారం




సాహిత్య పరిషత్ కవులచే సన్మానం

## రచయిత్రి సుజాతకు విశిష్ట పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రచయిత్రి సుజాత

దుబ్బాకటౌన్: దుబ్బాకకు చెందిన రచయిత్రి ఎర్రగుంట సుజాతకు విశిష్ట పురస్కారం లభించింది. రచనా రంగంలో సుజాత చేసిన కృషికి పురస్కారానికి ఎంపిక చేశారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో శుక్రవారం నిర్వహించిన 'నా తెలంగాణ సాహితీ సప్తాహం' కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వాగ్గేయ కారుడు గోరటి వెంకన్న, అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, దాశరథి కృష్ణమాచార్య కుమార్తె ఇందిర, తెలంగాణ సాహిత్య అకాడమీ వైర్మన్ జూలూరి గౌరీ శంకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుల చేతుల మీదుగా పురస్కారం అందించారు. సుజాతకు పురస్కారం దక్కడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.



'గుప్పెడు గుండెను తడితే" పుస్తకాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత శ్రీ సుద్దాల అశోక్‌తేజ గారికి అందిస్తూ...



'గుప్పెడు గుండెను తడితే" పుస్తకాన్ని గౌ॥ తన్నీరు హరీష్‌రావు గారికి అందిస్తూ...



తెలుగుభాషా దినోత్సవం రోజున గౌ॥ విద్యాసాగర్ రావు గారికి మరియు ప్రముఖులకు తన పుస్తకాన్ని అందిస్తూ...



కులవృత్తిలో సుజాత ప్రసాద్



మల్లారి ఫౌండేషన్ వారి 'మరో అమ్మ' కథకు గాను విశిష్ట ప్రతిభారత్న పురస్కారం అందజేశారు.



పేరు : **ఎర్రగుంట సుజాత ప్రసాద్**

తల్లిదండ్రులు : కీ॥శే॥ డా॥ క్యాతం మల్లయ్య–లక్ష్మీదేవి

భర్త : శ్రీ ఎర్రగుంట ప్రసాద్ (బిజినెస్)

జన్మస్థలం : వరంగల్

విద్యార్హతలు : దూరవిద్యలో డిగ్రీ

వృత్తి : గృహిణి

ప్రవృత్తి : రచనా వ్యాసంగం, ఆల్ఇండియా రేడియోలో కథానికలు వ్రాసి చదవడం

అభిరుచి : సినీగీతాల స్టైల్‌లో మంగళహారతులు వ్రాసి పాడడం,
పెయింటింగ్స్ వేయడం, న్యూట్రిషన్ ఫుడ్స్ చేయడం,
అన్ని సందర్భాలలో పాంప్లెట్స్ వ్రాసి పంచడం.

ముద్రితములు : గుప్పెడు గుండెను తడితే (కవితా సంపుటి), మే 2021

అముద్రితములు : 1) భావవర్ణాల లోగిలి, 2) పూర్ణచంద్రికలు, 3) సూక్తిముక్తావళి,
4) భావవీచికలు మొదలగునవి.

పెద్దకుమారుడు : డా॥ వేణుగోపాల్, సీనియర్ సైంటిస్ట్ I.I.L. లో మేనేజర్

పెద్దకోడలు : డా॥ కల్పన, M.Pharm, Ph.D, అసోసియేట్ ప్రొఫెసర్

చిన్నకుమారుడు : డా॥ తిరుమల్, న్యూరో సర్జన్–అసోసియేట్ ప్రొఫెసర్, నిమ్స్

చిన్నకోడలు : డా॥ శ్రీలత, సివిల్ సర్జన్, చీఫ్ ఎనస్తటిస్ట్, గవర్నమెంట్ హాస్పిటల్, సంగారెడ్డి

మనుమరాళ్ళు : సాయిత్రైలోక్య, అవని, లక్ష్మీ వైష్ణవి

మనుమడు : హనుమ విరించి